

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 69 • పేజీలు:12+16 • వెల: రూ.5 | బుధవారం • 7-2-2018 | www.manamnews.com | /manamnews



అగ్ని-1 క్షిపణి పరీక్ష విజయవంతం

7లో..



పార్లమెంట్‌లో పదనసలు

లోక్‌సభలో కొద్దిసేపు గందరగోళం..

రెండుసార్లు వాయిదాపడిన రాజ్యసభ

మా గొంతు నొక్కుతున్నారు: విపక్షం ఆరోపణ

మీరెటు పక్క?

రైతు పక్షమా.. వ్యతిరేక పక్షమా?.. కాంగ్రెస్‌కు మంత్రి హరీశ్‌రావు ప్రశ్న

- రైతుల ఆత్మహత్యలు కొనసాగాలా?
- భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం
- ఏడాదిలో అనంతగిరి.. రంగనాయకి సాగర్
- మిడ్‌మానేరు టన్నెల్, అనంతగిరి పనుల పరిశీలన





హైదరాబాద్/ కోనరావుపేట, ఫిబ్రవరి 6 (మనం న్యూస్):

కాంగ్రెస్ రైతుల పక్షమా లేక రైతుల వ్యతిరేక పక్షమో తేల్చుకోవాలని ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. ప్రాజెక్టులను అడ్డుకోవడమంటే రైతు ఆత్మహత్యలను ప్రోత్సహించడమేనని పేర్కొన్నారు. రైతుల శ్రేయస్సు కోరేవారెవరూ ప్రాజెక్టులను అడ్డుకోబోరని అన్నారు. కేసుల మీద కేసులు వేస్తూ, ప్రాజెక్టుల నిర్మాణాన్ని అడుగడుగునా అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను దుయ్యబట్టారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్యాకేజీ 10లో మిడ్ మానేరుకు అనుసంధానంగా జరుగుతున్న టన్నెల్ పనులు, అనంతగిరి రిజర్వాయరు నిర్మాణ పనులను మంగళవారం మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. సిద్దిపేట జిల్లా శివారు, రాజన్న-సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలంలోని తిప్పారం గ్రామంలో ఆసియాలోనే అతిపెద్ద ఓపెన్ సర్జిపుల్ సంప్ హౌస్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతగిరి రిజర్వాయరు 10వ మిగతా 6లో..



రెండు వారాల్లో 'టీడీఎన్'

వేగంగా వరంగల్ మెగా టెక్స్‌టైల్స్ పనులు

జూన్ నాటికి తొలి దశ టీ-వర్క్స్

అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు

డ్రైపోర్టు, నిమ్జ్, మెడికల్ డివైజెస్ పార్కుపై సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి):

ఎలక్ట్రానిక్ ఆధారిత సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు ఉద్దేశించిన పైలట్ ప్రాజెక్టు టీడీఎన్ (టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్)ను రెండు వారాల్లో పూర్తి చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. టీ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా చేపడుతున్న ఈ కార్యక్రమ ద్వారా ఈ-హెల్త్, ఈ-ఎడ్యుకేషన్, ఈ -గవర్నెనెన్స్ రంగాల్లో టీ-ఫైబర్ ప్రాజెక్టు ద్వారా రానున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. జూన్ నాటికి తొలి దశ టీ వర్క్స్ సిద్ధం అవుతుందని చెప్పారు. పరిశ్రమల మిగతా 6లో..

ఇదీలోకం!



మేడం గారికి కూడా చికిత్స చేయిస్తారా.. లేక వేరే పయత్నమేమైనా చేస్తారా సార్..!

ఆడపడుచుల ఆరళ్లు

చెరువులో దూకి కుటుంబం ఆత్మహత్య

- ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని వేధింపులు
- దంపతుల వేదన.. పిల్లలతో జలసమాధి
- ఘట్‌కేసర్.. కొండాపూర్‌లో విషాదం
- పెద్ద ఎత్తున బంధువుల ఆందోళన
- కేసు నమోదు.. మృతదేహాల వెలికితీత



కీసర/ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6 (మనం న్యూస్):

ఆడపిల్లలు పుట్టారని అత్త, ఆడబిడ్డలు పెడుతున్న ఆరళ్లు భరించలేక ఇద్దరు పిల్లలుసహా ఆ దంపతులు జలసమాధి అయ్యారు. మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ఘట్‌కేసర్ మండలంలోని కొండాపూర్ గ్రామవాసి మడిపడిగె రమేశ్ (26) పాల వ్యాపారం చేస్తుంటాడు. అతనికి భార్య మానస (21), కుమార్తెలు మనశ్రీ (3), గీతశ్రీ (6నెలలు) ఉన్నారు. రమేశ్‌కు మూడేళ్ల కిందట శామీర్‌పేట మండలం ఉద్ద మర్రి గామవాసి మానసతో వివాహమైంది. వీరి తొలి సంతానం ఆడపిల్ల (మనశ్రీ) కాగా, రెండోసారి కూడా ఆడపిల్లే (గీతశ్రీ) పుట్టింది. దీంతో ''ఒక పీడ చాలదన్నట్లు మరొకటి కూడా పుట్టుకొచ్చింది'' అని సాక్షాత్తూ రమేశ్ తల్లి, తోడబుట్టిన అక్క చెల్లెళ్లు కూడా తరచూ ఈసడించేవారు. దీనికి తోడు వారిని ప్రతిరోజూ చిత్రహింసకు గురిచేసేవారు. ఈ వేధింపులు భరించలేక ఆ దంపతులు తీవ్ర మనస్తాపానికి గురయ్యేవారు. ఈ నేపథ్యంలో సోమవారం కూడా ఇదే వ్యవహారం నడిచింది. దీంతో అదే రాత్రి భార్యా బిడ్డలతో స్కూటర్‌పై రమేశ్ ఇల్లువదిలి వెళ్లాడు. తెల్లవారేసరికి ఆ కుటుంబం మొత్తం కీసరలోని పెద్దమ్మ చెరువులో మిగతా 6లో..



'బలి'గొన్నది అతడే!

నిందితుడు ఇంటి యజమాని రాజశేఖర్

వీడిన చిలుకానగర్ దారుణం చిక్కుముడి

చిన్నారి మొండెం కోసం పోలీసుల అన్వేషణ

ఉప్పల్, (మేడిపల్లి) ఫిబ్రవరి 6 (మనం న్యూస్):

ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్‌లో వారం కిందట వెలుగుచూసిన చిన్నారి నరబలి ఉదంతంలో చిక్కుముడి వీడింది. మూఢ నమ్మకాలకు బానిసైన ఆ ఇంటి యాజమాని, క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ (35) ఈ దారుణానికి పాల్పడినట్లు తేలింది. దీంతో అతడితోపాటు మరో ఐదుగురు నింది తులను పోలీసులు అరెస్ట్ చేశారని సమాచారం. తన భార్య శ్రీలత ఆరోగ్యం కోసమే ముక్కుపచ్చలా రని చిన్నారిని అతడు బలి ఇచ్చాడని పోలీసులు చెబుతున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... చిలుకానగర్‌లోని మైసమ్మ గుడి మిగతా 6లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో చాలావరకు పొడి వాతావరణం ఉండే అవకాశం కనిపిస్తోంది. మబ్బులతో కూడిన చల్లటి గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 51 శాతం

గాలి వేగం: గంటకు 13 కి.మీ.

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘ మాసం, బహుళపక్షం, తిథిః సప్తమి ఉ.8.45 తదుపరి అష్టమి; నక్షత్రం: స్వాతి మ.12.13 తదుపరి విశాఖ; వర్జ్యం: సా.6.19 - 8.03 ; దుర్ముహూర్తం: మ.12.08 - 12.53; రాహుకాలం: మ.12.30 - 1.55; అమృతఘడియలు: తె.2.58 - 4.40; శుభసమయం: మ.1.56 - 3.00;

సూర్యోదయం: 6.50

సూర్యాస్తమయం: 6.11



3లో..

నిరుద్యోగులకు 3 వేల భృతి

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

కేటీఆర్ చెప్పేవన్నీ బడాయి కబుర్లు

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిరుద్యోగ చైతన్య యాత్ర ప్రారంభం

కేసీఆర్ వ్యతిరేక శక్తులను ఏకం చేస్తాం

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా

టార్గెట్.. సీఎం సీట్

కోమటిరెడ్డి కొత్త వ్యూహం..

అనుచరుడి హత్యతో మారిన పొలిటికల్ ప్లాన్



- రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు నిర్ణయం
- రాహుల్ అనుమతి కోసమే ఢిల్లీకి
- నల్లగొండ సీటు బొడ్డుపల్లి భార్య లక్ష్మికి
- మునుగోడు నుంచి అసెంబ్లీ బరిలోకి
- బలమైన నేతగా ఎదిగేందుకు ప్రయత్నం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం కుర్చీ లక్ష్యం!

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి):

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం కొంత కాలంగా వివిధ రకాలుగా ప్రయత్నించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పుడు మరింత పెద్ద టార్గెట్ కోసం పని చేయాలని నిశ్చయించుకున్నారు. ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగి పార్టీలోనూ, జిల్లాలోనూ పట్టు పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ముఖ్యమంత్రి పదవినే దక్కించుకోవాలన్న లక్ష్యంతో సరికొత్త వ్యూహం రచించారు. ఇటీవల ఆయన అనుయాయుడు నల్లగొండ మునిసిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో రూట్ మార్చారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీలోనూ, రాజకీయంగానూ ప్రధాన శక్తిగా ఎదిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా మిగతా 6లో..



7లో..

మాల్దీవ్స్ సుప్రీం సీజే అరెస్ట్

- మరో జడ్జి కూడా అదుపులోకి..
- దేశంలో ఎమర్జెన్సీ విధింపు..
- అధ్యక్షుడు యమీన్ తీవ్ర నిర్ణయం
- భారత సైన్యం జోక్యం చేసుకోవాలి
- మాజీ అధ్యక్షుడు నషీద్ విజ్ఞప్తి
- ముదిరిన రాజకీయ సంక్షోభం

డ్రగ్స్ ముఠా అరెస్టు



- **పోలీసుల అదుపులో నైజీరియన్ సహా ఇద్దరు యువకులు**
- **రూ.4 లక్షలు విలువైన మాదక ద్రవ్యాలు స్వాధీనం**

హైదరాబాద్/బౌద్ధనగర్, ఫిబ్రవరి 6(మనం న్యూస్): హైదరాబాద్ నగరంలో మాదక ద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ఓ నైజీరియన్‌తో పాటు జమ్ము-కశ్మీర్‌కు చెందిన అబిద్ నజీర్, హైదరాబాద్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి యాష్ సుంకరిను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 75 గ్రాముల ఎల్ఎస్‌డీ స్టాంప్స్, 30 గ్రాముల చరాస్, ఒక గ్రాము హెరాయిన్, 30 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపారు. పట్టుబడిన వారిలో అంగోలా అల్మా ప్రైడే (నైజీరియన్) గడువు ముగిసిన విసాతో ఇండియాలో ఉంటున్నాడు. స్నాప్ చాట్ ద్వారా పరిచయాలు పెంచుకుని అబిద్‌నజీర్, అంబర్‌పేటకు చెందిన యాష్ సుంకరితో కలిసి మాదక ద్రవ్యాలు విక్రయించేవాడు. ముందస్తు సమాచారం మేరకువీరిపై నిఘా పెట్టిన పోలీసులు, విద్యార్థులకు డ్రగ్స్ అమ్మేందుకు ప్లాన్ చేస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.4లక్షలు విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

'మేడారం' హుండీల లెక్కింపు ప్రారంభం

హన్మకొండ టౌన్, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు హాజరైన భక్తులు తమ ముడుపులను హుండీల్లో సమర్పించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభమయ్యింది. హన్మకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సుమారు 500 మంది సిబ్బంది లెక్కింపు చేస్తున్నారు. హుండీల్లో కానుకలను వేటికి అవి వేరు చేస్తున్నారు. నగదు, వడి బియ్యంతో పాటు పలువురు భక్తులు బంగారం, వెండి ఆభరణాలు కూడా కానుకలో రూపంలో సమర్పించారు. జాతరకు విదేశీ భక్తులు కూడా రావడంతో హుండీల్లో కొంత విదేశీ కరెన్సీ కూడా లభ్యమయ్యింది. హుండీల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు పది రోజులు సమయం పడుతుందని నిర్వాహకులు రమేశ్‌బాబు తెలిపారు. గత జాతరలో హుండీల ద్వారా రూ.8.91 కోట్ల ఆదాయం సమకూరిందని, ఈసారి మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు.



'ఫేస్‌బుక్' కానిస్టేబుల్ ఆత్మహత్య

- **మీడియాపై కేసులు పెట్టండి: డీజీపీ**



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న కేసులో నిందితుడు పోలీసు కానిస్టేబుల్ సందీప్‌కుమార్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మౌలాలి రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. లాలాపేట ఇందిరానగర్‌కు చెందిన సందీప్‌కుమార్(28) మొఘల్‌పురా పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ మహిళతో సందీప్ చాటింగ్ చేసేవాడు. ఇది వారి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరి విషయం తెలుసుకున్న వివాహిత భర్త సందీప్‌కుమార్‌పై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు సందీప్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయిన సందీప్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కాగా మీడియాలో వచ్చిన కథనాల వల్లే సందీప్‌కుమార్ మానసికంగా కుంగిపోయాడని, ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ విషయంలో మీడియాపై కేసులు నమోదు చేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు.

బాల్యవివాహాల నివారణకు ఏం చేశారో చెప్పండి


- **తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం**



హైదరాబాద్, ఫిబ్రవరి 6(మనం లీగల్ ప్రతినిధి): బాల్య వివాహాలను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పండంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బాల్య వివాహాలు తెలంగాణలోనే కాదని, ఏపీలోనూ ఉన్నాయని బెంచ్ అభిప్రాయపడింది. తెలంగాణలో తీసుకుంటున్న చర్యలపై విచారణ అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. బాల్య వివాహాల వల్ల బాధితులైన వారికి ప్రభుత్వం ఏవిధంగా అండగా ఉంటుందో తెలియజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. బాల్య వివాహాల వల్ల నష్టపోయిన వైనాన్ని వివరిస్తూ బి.మహిలత, మరో పది మంది రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. దీనిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. బాల్య వివాహ బాధితులకు విద్యలో 5 శాతం రిజర్వేషన్లు, ఉచిత వైద్యం, స్వయం సహాయక సంఘాలు, ఆర్థిక భరోసా ఉండే చర్యలు తీసుకోవాలని బాధితులు హైకోర్టును లేఖ ద్వారా కోరారు. వీరి సంక్షేమం కోసం తీసుకునే చర్యలను వివరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించిన బెంచ్ విచారణను నెల రోజులకు వాయిదా వేసింది.

ఉపాధి పనులే పనితీరుకు ప్రాతిపదిక

- **సీసీ రోడ్ల ప్రతిపాదనలు వెంటనే పంపాలి: జూపల్లి**



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): డీఆర్డీవోల పనితీరుకు ఉపాధి పనులే ప్రాతిపదిక అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపలి కృష్ణారావు అన్నారు. ఉపాధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణంపై వనపర్తి జిల్లా కలెక్టరేట్ నుండి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ... సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు వెంటనే పంపాలని, అనుమతించిన పనులు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 257 కోట్ల 78 లక్షల విలువైన 6 వేల 834 సీసీ రోడ్ల పనులకు అనుమతి ఇవ్వడం జరిగిందని, ఆ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంకా 12 జిల్లాలకు చెందిన ప్రతిపాదనలు అందలేదని, వాటిని రెండు, మూడురోజుల్లో అందజేస్తే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం పూర్తి చేయని దాదాపు 199 కోట్ల విలువైన 5 వేల పనులను కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మిషన్ భగీరథ పనులు వివిధ దశల్లో ఉన్నాయని..గ్రామాల్లో అంతర్గత పైప్ లైన్లు వేస్తే రోడ్డుకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేసిన వెంటనే ఎఫ్ టీ ఓ (ఫండ్ ట్రాన్స్ఫర్ ఆర్డర్)లను అప్లోడ్ చేయాలన్నారు. ఉపాధి కూలీల వేతనాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నప్పటికీ సస్పెండ్, రిజెక్టెడ్ ఖాతాల వల్ల కొందరికి వేతనాలు చెల్లింపు జరగడం లేదన్నారు. దీనిని త్వరతగతిన పరిష్కరించి, నెలాఖరులోగా అందరికీ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే ప్రస్తుతం ఉపాధి పనులు కొంత మందకొడిగా సాగుతున్నాయని, వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడునెలల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు జరిగాయని...ఆ తర్వాత ఎందుకు తగ్గుముఖం పట్టాయని అధికారులను ప్రశ్నించారు. మార్చి నెలాఖరులోగా ఉపాధి పనుల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్షకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గ్రేడ్-2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని వెనుకబడిన తరగతుల శాఖ కమిషనర్ ప్రకటించారు. శిక్షణకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, అదిలాబాద్, జామాబాద్, నల్గొండ, సంగారెడ్డి, సిద్ధిపేటలోని బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 040 24071178 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఐటీడీఏలకు ఇంచార్జిలే దిక్కు

ఏడాదిన్నరగా ప్రాజెక్టు అధికారి పోస్టులు ఖాళీ



- ఏజెన్సీ ప్రాంతంలో పాలన అస్తవ్యస్తం
- గిరిజనులకు అందని సంక్షేమ ఫలాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న తెలంగాణలోని గిరిజన ప్రాంతాల్లో పలు సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఏడాదిన్నరగా రాష్ట్రంలో ఉన్న నాలుగు ఐటీడీఏలకు ప్రాజెక్టు అధికారి లేకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. సంక్షేమ పథకాలు ఉన్నా అవి గిరిజనులకు అందని ద్రాక్షగానే మిగిలాయి.

పర్యవేక్షణ కరువు

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 32 లక్షల మందికి పైగా గిరిజనులున్నారు. గిరిజనుల సంక్షేమంలో భాగంగా ప్రతి సోమవారం ఐటీడీఏల్లో గ్రీవెన్స్ నిర్వహిస్తుంటారు. ఈ గ్రీవెన్స్‌లో గిరిజనులు తమ సమస్యలను ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువస్తారు. కొన్నింటిని అధికారి అక్కడికక్కడే పరిష్కరిస్తారు. మరికొన్నింటిని రిఫర్ చేస్తారు. ప్రాజెక్టు అధికారి పోస్టు ఏడాదిన్నరకు పైగా ఖాళీగా ఉండటంతో కింది స్థాయి అధికారులే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. దీంతో సమస్యల పరిష్కారం అరకొరగా జరుగుతుంది. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే గిరిజన దర్బార్‌ల ప్రాధాన్యత కూడా తగ్గింది. ప్రాజెక్టు అధికారులు లేకపోవటంతో అవి నామమాత్రంగానే సాగుతున్నాయి. ఏజెన్సీలో పోడు భూములకు పట్టాలివ్వాలంటే వాటిపై ప్రాజెక్టు అధికారి సంతకం అవసరం. గిరిజన ప్రాంతాల్లో నియామకాలకు కూడా కొంత ఇబ్బంది కలుగుతుంది. ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వారు లేకపోవడంతో అవి నత్తనడకన సాగుతున్నాయి. గత బడ్జెట్లో దాదాపుగా రూ.22 కోట్లు గిరిజనుల సంక్షేమం కోసం కేటాయిస్తే నవంబరు నాటికి కేవలం సగం నిధులు మాత్రమే ఖర్చు చేసినట్లు సమాచారం.

ప్రభుత్వం స్పందించాలి: పూనెం శ్రీనివాస్

గిరిజనుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఐటీడీఏలకు పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారులను నియమించాలని ఆదివాసీ గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇన్‌చార్జీలతో ఐటీడీఏలు నిర్వీర్యం అవుతున్నాయని విమర్శించారు. గిరిజన సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయని, సీఎం కేసీఆర్ స్పందించి ప్రాజెక్టు అధికారుల నియామకం చేపట్టాలని ఆయన కోరారు.

ప్రాజెక్టు అధికారి పోస్టు ఖాళీ

రాష్ట్ర విభజనకు ముందు అప్పటి ప్రభుత్వాలు తెలంగాణ ప్రాంతంలో నాలుగు ఐటీడీఏలను ఏర్పాటు చేశాయి. భద్రాచలం, ఉట్నూర్, ఏటూరినగరంతో పాటు హైదరాబాద్‌లో ఐటీడీఏలున్నాయి. ఇందులో భద్రాచలం, ఉట్నూర్, ఏటూరినగరం ఏజెన్సీ ప్రాంతాలు కాగా, హైదరాబాద్ ఐటీడీఏ మైదాన ప్రాంతానికి చెందినది. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులుగా ప్రభుత్వం ఐఏఎస్‌లను నియమిస్తుంది. అయితే రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏలకు పూర్తిస్థాయి పాలనాధికారులు(ప్రాజెక్టు అధికారులు) లేరు. దాదాపు ఏడాదిన్నరగా ఇన్‌చార్జి అధికారులతో పాలన సాగిస్తున్నారు. దీంతో ఐటీడీఏల్లో డిప్యూటీ డైరెక్టర్లు(డీడీ) ఆడింది ఆట పాడింది పాటగా మారింది పరిస్థితి. ఆయా జిల్లాల కలెక్టర్లు ఐటీడీఏలకు ఇన్‌చార్జిలుగా ఉంటున్నారు. అయితే తమ రోజువారీ విధులను పూర్తి చేయడానికే కలెక్టర్లకు ఒక్కోసారి సమయం సరిపోవడం లేదు. పనిభారం పెరుగుతుండడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఐటీడీఏ వ్యవహారాలపై దృష్టి సారించలేకపోతున్నారు. ఏజెన్సీలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారే బాస్. అటువంటి బాస్ లేకపోవటంతో కిందిస్థాయి అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడం, అర్హులుకు అందించడంలో విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి.

పునర్విభజన తెచ్చిన తంట

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో 10 జిల్లాల తెలంగాణ 31 జిల్లాలుగా రూపాంతరం చెందింది. కొత్త జిల్లాలు ఏర్పడి ఏడాదిన్నర దాటింది. జిల్లాల పునర్విభజన సమయంలో ఒక ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ మండలాలు ఇతర జిల్లాల్లో కలిశాయి. దీంతో ఐటీడీఏ పాలన మరింత కుంటు పడింది. ఖమ్మం జిల్లాను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలుగా విభజించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బయ్యారం, గార్ల మండలాలు ఉమ్మడి మహబూబాబాద్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) జిల్లాలోకి వెళ్లాయి. ఈ రెండు మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాలు. దీంతో ఆయా మండలాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నిరుద్యోగులకు మూడు వేల భృతి


- **వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు**
- **కేటీఆర్ చెప్పేవన్ని బడాయి కబుర్లు**
- **టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**
- **నిరుద్యోగ చైతన్య యాత్ర ప్రారంభం**
- **కేసీఆర్ వ్యతిరేఖ శక్తులను ఏకం చేస్తాం**
- **కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా**

హైదరాబాద్, ఫిబ్రవరి 6(మనం ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు మూడ వేల రూపాయల భృతి ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్యర్యంలో మంగళవారం చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్రను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాతో కలిసి ఉత్తమ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ 49 రోజుల పాటు సాగే ఈ యాత్ర రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జరుగుతుందన్నారు. ఈ యాత్ర ద్వారా నిరుద్యోగ యువతలో చైతన్యం తీసుకువస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. తెలంగాణ ఏర్పడి నాలుగు సంవత్సరాలైనా ఒక్క డీఎస్సీ కూడా ఎందుకు వేయలేదో కేసీఆర్ చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాల్లో పది శాతం ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. ఎప్పుడు బడాయి కబుర్లు చెప్పే కేటీఆర్ మాత్రం సూటూ బూటు వేసుకుని విదేశాల్లో విహరిస్తున్నారని ఉత్తమ్ విమర్శించారు. తాము చేసేవే చెబుతామని, చెప్పిన వాటిని అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు. కేసీఆర్ నిరుద్యోగులను నిలువునా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల త్యాగాలతోనే తెలంగాణ ఏర్పడిందన్న విషయాన్ని కేసీఆర్ మరిచిపోయారని, ఆయన కుటుంబం బాగుంటే అంతా బాగుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్కతో పాటు పలువురు యువజన నాయకులు పాల్గొన్నారు.

కోదండ్‌రామ్ అంటే కాంగ్రెస్‌కు గౌరవం..



కేసీఆర్ వ్యతిరేక శక్తులను ఏకం చేస్తామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా అన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన కాంగ్రెస్ బీసీ సాధికారత కమిటీ సమావేశంలో కుంతియా ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చని, పొత్తులకు గురించి పీసీసీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కోదండ్‌రామ్ అంటే కాంగ్రెస్‌కు గౌరవమన్నారు. టీడీపీతో పాటు పలు పార్టీల చెందిన ముఖ్య నేతలు ఈ వారంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. నాగం జనార్థన్‌రెడ్డి విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. స్థానిక నేతలతో మాట్లాడిన తర్వాతే చేరికలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రవాస గల్ఫ్ ఎన్నారైల కోసం ఈ నెల 12 నుంచి కాంగ్రెస్ బృందం కువైట్‌లో పర్యటించనుందన్నారు. గల్ఫ్‌లో క్షమాభిక్ష(ఆమ్నెస్టీ) పథకంలో 30వేల మంది కార్మికులు దేశానికి రావడానికి ఎదురు చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉచితంగా టికెట్‌లు అందించాలని డిమాండ్ చేశారు సీఎం కేసీఆర్ కువైట్‌కు ప్రత్యేక అధికార బృందాన్ని పంపించి ఎన్నారై పాలసీ ప్రకటించాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. బీసీల అభ్యున్నతి అంటూ కేసీఆర్ ఎన్నికల సమయంలో మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. పీసీసీ సాధికారిత కమిటీ చైర్మన్ నాగయ్య మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీలు ఎలా మోసపోతున్నారనే విషయంపై నివేదిక రూపొందిస్తున్నామని తెలిపారు. బీసీల సమస్యలపై 90రోజుల పాటు పర్యటిస్తామని కాంగ్రెస్ నేత మహేష్‌గౌడ్ తెలిపారు. బీసీలకు రూ. 25వేల కోట్లు ఇస్తామన్నా కేసీఆర్ తమ హామీని విస్మరించారన్నారు.



స్టడీ సర్కిల్‌లో అక్రమాలు: ఉత్తమ్

తెలంగాణ స్టడీ సర్కిల్ లో జరుగుతున్న అక్రమాలపై సిఐడి విచారణ జరిపించాలని టీపీసీసీ అధ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోచింగ్ కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం స్టడీ సెంటర్ ను సందర్శించిన ఉత్తమ్ విద్యార్థుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఏడు కోట్ల రూపాయల వరకు నిధులు దుర్వినియోగం చేశారని, ఆయనపై దీనిపై సీఐడీతో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సివిల్ సర్వీస్‌లకు కోచింగ్ ఇచ్చే కేంద్రంలోనే అవినీతి జరుగుతున్నందున ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఉత్తమ్ వెంట వి.హన్మంతరావు, పొన్నం ప్రభాకర్ తదితర నాయకులు ఉన్నారు.

'కేసీఆర్ ప్రగతి-ప్రాంగణం' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): రెండు దశబ్దాలపాటు స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన కేసీఆర్, తెలంగాణ సమాజానికి అవసరమైన పథకాలను రూపొందించారని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి కొనియాడారు. బంగారు తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. భూపాలపల్లి డిపోకు చెందిన బస్సు కండక్టర్ బొట్ల మహర్షి రచించిన 'కేసీఆర్ ప్రగతి-ప్రాంగణం' పుస్తకాన్ని సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలపుడు ఇవ్వని హామీలను, పథకాలను కూడా రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేస్తున్నారని చెప్పారు. పుస్తక రచయిత మహర్షిని మహేందర్‌రెడ్డి అభినందించారు.



సీఎస్‌ను కలిసిన ఆర్టీసీ ఎండీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6, (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని టీఎస్ ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీ.వీ రమణారావు మాట్లాడుతూ... సంస్థ పురోభివృద్ధి కోసం సీఎస్ సహకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎండీతోపాటు సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్, జాతీయ మాజీ వాలీబాల్ క్రీడాకారులు కిరణ్‌రెడ్డి ఉన్నారు.

సాంకేతిక అందిపుచ్చుకోవాలి

- **పోలీసులకు సీపీ సందీప్ శాండిల్య సూచన**
- **సాంకేతిక అంశాలపై శిక్షణ కార్యక్రమం**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): మారుతున్న కాలనికి అనుగుణంగా నేరాల నియత్రణకు ప్రపంచంతో పోటిపడెలా ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం నేర విచారణలో సవాళ్ళు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల విశ్లేషణ వంటి అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశంలో సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఇందులో సీపీ సందీప్ శాండిల్యా మాట్లాడుతూ.. రోజురోజుకూ సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని తెలిపారు. ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. అందుకే ఆధునిక పోలిసింగ్‌లో భాగంగా పోలీసులు వివిధ చట్టలతో పాటు టెక్నాలజీపై కూడా అవగాహన పెంచుకోవడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డేటా అనాలసిస్, సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్స్ వంటి అంశాలపై ఉబర్ సంస్థకు చెందిన ఎల్ఈఆర్టి (లా ఎన్ఫోర్స్ మెంట్ రెస్పాన్స్ టీమ్) అవుట్ రీచ్ మెంబర్ అభిషేక్ అవగాహన కల్పించారు. అలాగే సైబర్ క్రైమ్స్ కు సంబంధించిన వివిధ కేస్ స్టడీలను వివరించారు. కంప్యూటర్లను వైరస్ నుంచి ఎలా రక్షించుకోవాలి, అప్ డేటెడ్ గా ఎలా ఉండాలో తెలిపారు. ర్యాన్సమ్ వేర్, ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాకింగ్, బిట్ కాయిన్, డాటా ఎన్‌క్రిప్షన్ (బిట్ కాయిన్)ల డార్క్ వెబ్, టోర్ బ్రౌజర్, హ్యాకర్లు బిట్ కాయిన్‌ల కోసం హ్యాకింగ్ కి ఎందుకు పాల్పడతారు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్ షానవాజ్ ఖాసీం, సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ జానకీ షర్మిళ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ నిధులు ఇవ్వండి

- కొత్త రహదారి ప్రాజెక్టులకు కేటాయించండి
- కేంద్ర మంత్రి గడ్కరీకి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కేంద్ర నితిన్ గడ్కరీకి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గతంలో కేంద్రం ప్రకటించిన జాతీయ రహదార్లకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో గడ్కరీతో మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, జితేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, సీతారాంనాయక్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల కేంద్ర మంత్రికి ఓ వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్వహణకు కేంద్రం ఇస్తున్న గ్రాంటు ఏమాత్రం సరిపోవట్లేదని, ఆ గ్రాంటును తక్షణమే పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు కేంద్రం ప్రకటించిన 25 నూతన జాతీయ రహదార్లకు (3155 కి.మీ) అదనంగామరో 1207 కి.మీ నిడివి గల 11 రహదార్లను జాతీయ రహదార్లుగా బదలాయించాలని కోరు. అంతర్రాష్ట్ర అనుసంధాన పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.190.10 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు అందజేశారు. ఇందులో నిర్మల్ జిల్లా లో బైంసా-పెద్దపల్లి రోడ్డు (59 కోట్లు), భద్రాద్రికొత్తగుడెం జిల్లాలో లక్ష్మీనగరం-లక్ష్మీపురంరోడ్డు (51 కోట్లు), ఖమ్మం జిల్లాలో ఖానాపురం- గన్నవరం రోడ్డు (12.40 కోట్లు), ఖమ్మం జిల్లాలో మిట్టపల్లి-ఉట్కూర్ (వ్యా) పెద్ద కోరికొండ (33 కోట్లు), భద్రాద్రికొత్తగుడెం జిల్లాలో ములకలపల్లి-వెంకటాపురం రోడ్డు (34.70 కోట్లు),నకిరేకల్ - మల్లంపల్లి జాతీయ రహదారి 365పై జమాన్లపల్లి-మంగలవారిపేట సెక్షన్‌లో 33 కి.మీ నిడివి గల రహదారిపై అటవీ అనుమతుల కొరకు నిలచిన రోడ్డు విస్తరణ పనులకు అనుమతులు మంజూరు చేయాలని అభ్యర్థించారు.జడ్చర్ల - దేవరకొండ సెక్షన్ జాతీయ రహదారి 167పై రహదారి పనులు విస్తరణకు రూ:114.23 కోట్ల ప్రతిపాదనలు అందజేశారు. అలాగే, హైదరాబాద్ పట్టణం చుట్టూ ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నిర్మాణానికి (సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - జగదేవ్‌పూర్ - భువనగిరి - చౌటుప్పల్ - ఇబ్రహీంపట్నం - చేవెళ్ళ - శంకరపల్లి- కంది-338 కి.మీ.)కు నిధులు (338 కి.మీ) మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఔటర్ రింగ్ రోడ్డు ఆవల హైదరాబాద్ చుట్టూ నిర్మించ తలపెట్టిన 338 కిలోమీటర్ల రహదారికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న సంగారెడ్డి, గజ్వేల్, భువనగిరి, కంది, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, తదితర ప్రాంతాలను కలుపుతూ ఈ రహదారిని నిర్మిస్తామని ఆయన గడ్కరీకి వివరించారు. అంతర్రాష్ట్ర అనుసంధాన పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.190.10కోట్లు నిధులివ్వాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ఇప్పటివరకూ కేంద్ర ప్రకటించిన 25 కొత్త జాతీయరహదార్లకు సంబంధించి 3155 కిలోమీటర్లకు అదనంగా మరో 1207కిలోమీటర్లు గల 11రహదార్లను జాతీయ రహదార్లుగా బదలాయించిందేకు అనుమతించాల్సిందిగా తుమ్మల విజప్తిచేశారు. గడ్కరీని కలిసిన వారిలో ఎంపీలు బి వినోద్‌కుమార్, జితేందర్‌రెడ్డి, సీతారాం నాయక్, నగేష్, అధికారులు ఉన్నారు.

బోధనపై దృష్టిపెట్టండి

- టెన్త్ ఫలితాలు సంతృప్తికరంగా లేవు
- హైదరాబాద్ వెనుకంజ ఎందుకు?! నాయిని



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు అధిక ప్రాధాన్యతనిచ్చి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, అందుకు అనుగుణంగా ఉత్తమ విద్యాబోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. నూతన ప్రభుత్వంలో డీఆర్సీ లేనందున ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ మేరకు పనులు జరుగుతున్నాయి, ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై మంత్రులు, అధికారులతో హోంశాఖ మంత్రి నాయిని మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగా లేవని, విద్యాశాఖాధికారులు బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ పదో తరగతి ఫలితాల్లో పురోగతి కనిపించడం లేదని రాష్ట్ర పశు సంవర్ధనశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. డీఈవోతో సహా విద్యాశాఖలోని సీనియర్ అధికారులు వారానికి కనీసం రెండు సార్లు క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి టీచర్ల పనితీరును పరిశీలించాలన్నారు. 59 జీవో కింద క్రమబద్ధీకరించాల్సిన స్థలాలకు సంబంధించి వసూలు చేయాల్సిన మిగిలిన రుసుముపై కటాఫ్ డేట్ నిర్ణయించి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గాల నిధుల నుంచి రూ.2.5 కోట్ల విద్యాసంస్థల అభివృద్ధికి కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఆదేశించారు. నాలుగేళ్లుగా జిల్లా పదో తరగతి ఫలితాల్లో చివరిస్థానంలో ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితా రాణా చెప్పారు. ఈ ఏడాది ఆ పరిస్థితి ఎదురు కావద్దనే ఉద్దేశంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

పరిశుభ్రత కోసమే స్వచ్ఛసర్వేక్షన్


భారతదేశంలోనే అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో ఒకటైన హైదరాబాద్ పరిశుభ్రంగా ఉండాలనే నినాదంతో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో స్వచ్ఛ్ సర్వేక్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో ఈ నెల 12న నిర్వహించనున్న స్వచ్ఛ్ సర్వేక్షన్ కార్యక్రమంలో దాదాపు 15 వేల మంది విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, పోచంపల్లి హ్యాండ్లూమ్ ఇండియా అంబాసిడర్ రేష్మి ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 10 నుంచి జరుగనున్న డల్లాస్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్-2018లో పాల్గొనేందుకు వెళ్తున్న కాలేను సింధు తపస్విని నాయిని అభినందించారు.

ఎస్టీలను మోసం చేస్తున్నారు: చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 6(మనం ప్రతినిధి): మాటలతో ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్‌కు గిన్నీస్ బుక్ రికార్డుల్లో చోటు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. సబ్‌ప్లాన్ చట్టం కింద కేటాయించిన నిధులను గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించకుండా ఇతర కార్యక్రమాలకు మళ్లించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. మంగళవారం, హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో చాడ మాట్లాడుతూ.. సబ్‌ప్లాన్ అమలు కోసం, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సబ్‌ప్లాన్ కోసం 2016-17లో కేంద్రం రూ. 5035 కోట్లు కేటాయించిందని, కానీ అందులో ఖర్చు చేసింది మాత్రం రూ.1800 కోట్లు మాత్రమేనని ఆయన తెలిపారు. అటు మోదీ, ఇటు కేసీఆర్ ఎస్టీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్, ఇప్పటికీ నెరవేర్చకుండా మోసం చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై పార్లమెంట్ మార్చ్ నిర్వహించి కోటి సంతకాలతో వినతిపత్రం ఇస్తామని సీపీఐ నేత గుండ మల్లేశ్ తెలిపారు.

అన్యాయం జరిగినా నోరు విప్పరా

- కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 6(మనం ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగినా తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు నోరు విప్పడం లేదో చెప్పాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మిత్రపక్షం అయినప్పటికీ టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క అంశాన్ని ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకున్నా టీఆర్ఎస్ మౌనంగా ఉందని, ఇది రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెట్టడమే అన్నారు. టీఆర్ఎస్, బీజేపీకి మధ్య కుదిరిన రహస్య ఒప్పందం ఏంటో చెప్పాలన్నారు. ఖమ్మం జిల్లాలో వేముల శ్రీనివాస్, నల్లగొండలో బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులను సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోనియా ఇచ్చిన తెలంగాణలో అధికారాన్ని అనుభవిస్తున్న టీఆర్ఎస్ నేతలు ప్రజలను పట్టించుకోవడంలేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం టీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారని ఆరోపించారు.

మనకు నిధులు సముచితమే

- గతం కంటే ఐదు శాతం నిధులు ఎక్కువ
- చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌కు రూ.5 కోట్లు
- అవసరమైతే ఇతర నిధులు మళ్లిస్తాం
- రైల్వే బడ్జెట్‌పై దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్



హైదరాబాద్, ఫిబ్రవరి 6(మనం ప్రతినిధి): దక్షిణ మధ్య రైల్వేకు 2017-18 బడ్జెట్‌లో కేంద్రం సముచితమైన నిధులు కేటాయించిందని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. రైల్వేకు సంబంధించి బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాల కేటాయింపులను ఆయన మంగళవారం విలేకరులకు వివరించారు. తెలంగాణకు 2016-17లో రూ. 1729 కోట్లు కేటాయించగా ఈసారి 5 శాతం అదనంగా రూ. 1813 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఏపీకి గత బడ్జెట్‌లో రూ. 3406 కోట్లు కేటాయించగా ఈసారి 8శాతం అధికంగా రూ. 3670 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీని తగ్గించేందుకు చర్లపల్లి వద్ద నిర్మించ తలపెట్టిన సాటిలైట్ టెర్మినల్‌కు కేవలం రూ. 5కోట్లు కేటాయించారని చెప్పారు. అలాగే.. ప్రాజెక్టుల మధ్య నిధులు సర్దుబాటు చేసే అధికారాన్ని జనరల్ మేనేజర్లకు అప్పగించారన్నారు. చర్లపల్లి టెర్మినల్ నిర్మాణానికి రూ. 5 కోట్లు సరిపోని పక్షంలో వేరే ప్రాజెక్టు నుంచి నిధులు మళ్లిస్తానని ఈసారి బడ్జెట్ ప్రయాణికుల భద్రతకు పెద్ద పీట వేశారని ఆయన చెప్పారు.

ఎంఎంటీఎస్‌కు మొండి చెయ్యి

ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి(33కి.మీ) వరకూ ఎంఎంటీఎస్ రెండో దశ పనుల కోసం రూ. 21.25 కోట్లను కేటాయించారు. యాదాద్రి వరకూ ఎంఎంటీఎస్ పొడిగింపు పనులకు రూ. 330 కోట్లు అవసరమవుతాయని ఇదివరకే అంచనా వేశారు. ఈ అత్తెసరు నిధులతో పొడిగింపు పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తెలంగాణ ప్రాజెక్టులు కేటాయింపులు

అక్కన్నపేట్-మెదక్ మధ్య 17 కిలోమీటర్ల కొత్త లైను 2012-13లో మంజూరయింది. 2018-19లో ఈ లైన్ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం తాజా బడ్జెట్‌లో రూ. 130 కోట్లు కేటాయించారు. మనోహరాబాద్-కొత్తపల్లి(150కి.మీ) మధ్య నిర్మిస్తున్న కొత్త లైన్ కోసం కేవలం రూ. 125 కోట్లు, మునీరాబాద్-మహబూబ్‌నగర్(246కి.మీ) మధ్య కొత్త లైన్ కోసం రూ. 275 కోట్లు, భద్రాచలం-సత్తుపల్లి(56కి.మీ) మధ్య కొత్త లైన్ కోసం 120 కోట్లు, కాజీపేట్-బల్లార్ష(202కి.మీ) మధ్య మూడో లైన్ నిర్మాణం కోసం రూ. 301 కోట్లు కేటాయించారు. సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ ప్రాజెక్టు కోసం రూ. 250 కోట్లు, కాజీపేట-విజయవాడ మధ్య మూడో లైన్ కోసం రూ. 60 కోట్లు, పెద్దపల్లి-లింగంపేట్ జగిత్యాల్-నిజామాబాద్ (178కి.మీ) లైన్ విద్యుదీకరణ కోసం రూ. 113.60 కోట్లు, మౌలాలి వద్ద వెల్డింగ్ ప్లాంట్ అభివద్ధికి రూ. 7.71 కోట్లు, కాజీపేట్ వద్ద పీరియాడిక్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్ అభివృద్ధికి రూ.200 కోట్లు, మౌలాలి వద్ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సంస్థ కోసం రూ. 5 కోట్లు కేటాయించారు.

రాష్ట్రంలో కొత్త లైన్లు..

పటాన్‌చెరు-సంగారెడ్డి-జోగిపేట్-మెదక్(95కి.మీ)
నిజామాబాద్-నిర్మల్-ఆదిలాబాద్ (125కి.మీ)
మానకొండూర్-హుజూరాబాద్ అండ్ ఎల్కతుర్తి (60కి.మీ)
బైపాస్ లైన్లు(221కి.మీ)
పెద్దపల్లి-కాజీపేట్
వికారాబాద్-వాడి(కర్ణాటక)
పగిడిపల్లి-భువనగిరి
విష్ణుపురం-జాన్‌పహాడ్
భువనగిరి-శంకరపల్లి
నిజామాబాద్-ముద్‌ఖేడ్-పర్భాని (మహారాష్ట్ర)



ట్రిపుల్ తలాక్‌తో ముస్లింలకు నష్టం

- కేంద్రం కుట్ర పన్నింది: టీఎస్ టీడీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): ట్రిపుల్ తలాక్ బిల్లుతో ముస్లింలు నష్టపోయే ప్రమాదమున్నదని టీటీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. బిల్లులో పేర్కొన్న అంశాలు ముస్లిం స్త్రీల హక్కులను హరించేలా ఉన్నాయని ఆరోపించారు. తాజుద్దీన్ అధ్యక్షతన ట్రిపుల్ తలాక్ బిల్లుపై మంగళవారం చర్చాగోష్ఠి జరిగింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొఫెసర్ అఖిల, కామోషి, ప్రొఫెసర్ రఫిక్ ఉన్నీసా, ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులు అస్మా జహెరా ఇందులో పాల్గొన్నారు.ట్రిపుల్ తలాక్‌ను కేంద్రం ముస్లింలపై చేస్తున్న కుట్రగా తాజుద్దీన్ అభివర్ణించారు. రాజ్యసభలో ట్రిపుల్‌తలాక్ బిల్లును వ్యతిరేకించిన టీడీపీకి జహెరా కృతజ్ఞతలు తెలిపారు.

17న హైదరాబాద్‌కు అన్నా హజారే రాక

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం ప్రత్యేక ప్రతినిధి): రైతు ఉద్యమంతో పాటు లోక్‌పాల్, లోకాయుక్తా అమలు చేయాలన్న డిమాండ్‌తో సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే మార్చి 23న ఢిల్లీలో సత్యాగ్రహ దీక్ష చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 17న సర్పంచ్‌ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సన్నాహక సభ జరగనుంది. ఈ సభకు అన్నా హజారే హాజరవుతారని సర్పంచ్‌ల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అందోల్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నారు.

పొంగిన 'గణపసముద్రం'

- 'సప్త సముద్ర'కు పునర్జన్మ
- ఘనపురంలో నీటి ఊట
- వనపర్తిలో 'మిషన్ కాకతీయ' అద్భుతం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: దాదాపు మూడు దశాబ్దాల తర్వాత వనపర్తి జిల్లా 'గణప సముద్రం' పొంగి పొర్లుతున్నది. వందేళ్ళలో మూడోసారి మత్తడి దుంకడమే గణపసముద్రం విశేషం. ఇప్పుడు ఫిబ్రవరిలో ఎండాకాలం ముఖద్వారం దగ్గర ఈ అద్భుతం ఆవిష్కతమైంది. కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి మొదటిసారి ఘనపురం బ్రాంచ్ కెనాల్ కు సాగునీటిని విడుదల చేయడంతో గణపసముద్రం అలుగుపారుతున్నది. మిషన్ కాకతీయ 2 దశ కింద గణప సముద్రం ఫీడర్ చానల్ మరమ్మతులు చేపట్టి, పూడిక తొలగించి దాన్ని పునరుద్ధరించడం వల్ల ఈ విజయం సాధ్యమైంది.కరెంటు, మోటార్లు లేకుండానే కృష్ణా జలాలు పొలాల్లో ప్రవహిస్తున్నవి. గణపసముద్రం చెరువు నిండడంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగరే జలసంపద కూడా అనూహ్యంగా పెరిగింది. దీంతో గణపసముద్రం పరిసరాల్లో పాతాళగంగ ఉబికి వస్తున్నది.నీళ్ళు ఊటలా పెల్లుబుకుతున్నవి. నిన్న మొన్నటివరకు దాదపు 600 మీటర్లకు పైగా భూతల్లిని తొలచినా బోర్లలో నీళ్ళు వచ్చేవి కాదు. గణపసముద్రం పరిసర ప్రాంతాలలోని దాదాపు 200 బోర్లు రీచార్జ్ అయ్యాయి. గణపసముద్రం చెరువు దిగువ భాగాన ఉన్న ప్రాంతాల్లో 10 మీటర్లు తవ్వకుండానే భూగరే జల సంపద లభిస్తోంది..వనపర్తి నియోజకవర్గంలో 2016 -17 లో 74 చెరువులను మిషన్ కాకతీయ మొదటి దశ కింద చేపట్టి కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా నింపి 12, 399 ఎకరాలకు సాగునీరందించారు.2017-18లో 246 చెరువులను మిషన్ కాకతీయ రెండో దశ కింద చేపట్టి 22,539 ఎకరాలకు సాగునీరందించారు. వనపర్తిలోని రంగ సముద్రం, గోపాల సముద్రం,శంకరమ్మ సముద్రం, మహబూపాల సముద్రం, రాయసముద్రం, కృష్ణ సముద్రం, వీరసముద్రం కింద వీటి పరిధిలో దాదాపు 10 వేల ఎకరాలుకు సాగు నీరు అందేది. 600 ఎకరాలకు నీరు అందేలా కృష్ణ సముద్రం చెరువును నిర్మించారు. కొత్తకోటలో ఉన్న ఈ చెరువును బీమాలో చేర్చారు. బీమా నుండి వచ్చే నీటిని ముందుగా శంకర సముద్రంలో నింపి తర్వాత కృష్ణ సముద్రాన్ని నింపుతారు. దీంతో సంకిరెడ్డిపల్లి, రాయనిపేట గ్రామాలతో పాటు 10 గ్రామాలకు తాగు, సాగు నీరందుతోంది. సప్తసముద్రాల్లో మరొకటి రంగ సముద్రం. ఇది పెబ్బేరు మండలంలోని శ్రీరంగాపూర్లో ఉంది. దీని ఆయకట్టు దాదాపు 3000 ఎకరాలకు సాగు నీరు అందించేది. వనపర్తి సంస్థానాదీశుల కాలంలో కొల్లాపూర్ సురభీ వంశస్తులు దీన్ని నిర్మించారు. కాగా ఈ చెరువును బీమాకు లింకు చేయడంతో 20 వేల ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాలకు తాగునీరు అందుతోంది. కొత్తకోట మండలంలోని కానాయిపల్లి దగ్గర ఉండే శంకరసముద్రాన్ని 160 ఏళ్ల కిందట శంకరమ్మ పాలనలో నిర్మించారు. ఈ చెరువు కింద 2,700 ఎకరాల ఆయకట్టు ఉంది. దీన్ని గతంలో జలయజ్ఞంలో భాగంగా బీమా ద్వారా నీరందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పనులు పూర్తైతే దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశాలు ఉన్నాయి. కాగా,గణపసముద్రం మత్తడి దుంకడం అనే విషయం రైతులు కలలో కూడా ఊహించనిదని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజనరెడ్డి అన్నారు.కల్వకుర్తి పనులను వేగంగా పూర్తి చేయడానికి రేయింబవళ్ళు కృషి చేస్తూ గణపురం బ్రాంచ్ కెనాల్ కు నీటి విడులపై చొరవ తీసుకున్న మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.








వైద్య ఆరోగ్య శాఖ పథకాలు భేష్

- కేసీఆర్ కిట్ల పథకం వెరీవెరీ స్పెషల్
- కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతి సుదాన్ ప్రశంసలు



హైదరాబాద్, ఫిబ్రవరి 6: ''కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణలో అమలు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ పథకాలు సూపర్. అందులో కేసీఆర్ కిట్ల పథకం వెరీ వెరీ స్పెషల్. రాష్ట్ర ప్రభుత్వ పథకాలే కాదు, కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా అద్భుతంగా అమలు చేస్తున్నారు అంటూ కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతి సుదాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. కేంద్రం నుంచి ఎయిమ్స్ సహా మరిన్ని నిధులు ఇవ్వడానికి, తగిన ప్రోత్సాహం అందించడానికి ఆమె సానుకూలంగా స్పందించారు. మంత్రి లక్ష్మారెడ్డిని సచివాలంలో మంగళవారం ఆమె కలిశారు. రాష్ట్రంలో అమలవుతున్న వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ పథకాలపై మంత్రితో సమీక్షించారు. అలాగే వైద్య మంత్రి రాష్ట్రం తరపున కేంద్రానికి పలు ప్రతిపాదనలు చేశారు ఎయిమ్స్ రాష్ట్రానికి ఇవ్వడానికి అధికారికంగా ఎలాంటి సమస్యలు లేదని, విషయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని వివరించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న సిద్దిపేట, సూర్యాపేట, నల్లగొండ వైద్య కళాశాలలకు మరిన్ని నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. కాలేజీల్లో నేషనల్ పూల్ కింద యూజీ, పీజీ సీట్ల పెంపు, వైద్య విద్య అభివృద్ధి, పరిశోధనలకు తగిన ప్రోత్సాహం కూడా అందిస్తామన్నారు. స్పెషాలిటీ సీట్ల అవసరం కూడా ఉందని మంత్రి చెప్పారు. రాష్ట్రానికి మరికొన్ని మాతాశిశు హాస్పిటల్స్‌ను ఇస్తామన్నారు. వెల్‌నెస్ కేంద్రాల నిర్వహణ తీరు తెన్నులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆధునాతన ఆపరేషన్ థియేటర్లు, ఇతర పరికరాలు, సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం తరపున తగిన ప్రోత్సాహం అందే విధంగా చూడాలని మంత్రి కేంద్ర కార్యదర్శి సూడాన్కి చెప్పారు. రెండో ఎఎన్ఎంల వేతనాల పెంపు, రెగ్యులరైజేషన్ సమస్యలను మంత్రి కేంద్ర కార్యదర్శి దృష్టికి తెచ్చారు. కేసీఆర్ కిట్ల పథకానికి ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకం కింద నిధులు ఇవ్వాలని, వెల్ నెస్ సెంటర్లకు ఆయుష్ సేవలు కూడా అందే విధంగా కేంద్రంచొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. క్లినికల్ ట్రయల్స్‌కు జాతీయస్థాయిలో ఒకే నిబంధనలుండేలా చూడాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ కింద దేశ వ్యాప్తంగా ఒకే రేట్లు, హాస్పిటల్స్ గ్రేడింగ్స్, క్లినికల్ కేర్ స్థాయిలను నిర్ణయిస్తే బాగుంటుందని కూడా మంత్రి చెప్పారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, ఫిబ్రవరి 7

జమిలి హింసలు


రాజ్య హింస, ప్రైవేట్ హింసలు ఉత్తరప్రదేశ్‌లో రాజ్యమేలుతున్నాయి. రిపబ్లిక్ డే నాడు కాస్‌గంజ్ మత ఘర్షణలు యాదృచ్ఛిక సంఘటన కానే కాదని, ప్రజల్లో చీలికలు సృష్టించి, మైనారిటీలను భయోత్పాతంలో ముంచెత్తేందుకు పథకం ప్రకారం అమలుచేసిన విద్వేషకాండగాను, పోలీసు యంత్రాంగం పక్షపాతంతో వ్యవహరించిందని హక్కుల సంఘాల నిజనిర్ధారణ కమిటీ సోమవారం ప్రకటించింది. మరోవైపు యోగి ఆదిత్యనాథ్ యూపీ అధికారపీఠంలోకి వచ్చిన నాటి నుంచి జరిగిన 1,142 ఎన్‌కౌంటర్లలో 34 మంది హతమైనట్లు పోలీసు నివేదిక వెల్లడించడంపై ఇప్పటికే యూపీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అదే సమయంలో నోయిడాలో జిమ్ యజమానితో పాటు మరోవ్యక్తిని యూపీ పోలీసు కాల్చిచంపిన ఉదంతంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే నోటీసులు జారీచేసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ రెండురకాల హింసలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ప్రజాస్వామికవాదులు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గుజరాత్‌లో జరిగిన ప్రభుత్వ, ప్రైవేటు హింసలను సమన్వయిస్తూ సాగిన మత విద్వేషకాండ రూపంలోని సోషల్ ఇంజనీరింగ్‌ను ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ యూపీలో సమర్థంగా అమలు చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

1942లో బీహార్‌లోని తిల్హారా మొదలు ఇండియా విభజన సమయంలో పరాకాష్ఠకు చేరిన మతఘర్షణలు స్వాతంత్ర్యానంతరం జెంషెడ్‌పూర్, రూర్కెలా, భివాండీ, ఢిల్లీ, మీరట్, హైదరాబాద్, అహ్మదాబాద్ నుంచి బాబ్రీ మసీద్ విధ్వంసం, అనంతరం ముంబయి, సూరత్, భోపాల్, 2002 గుజరాత్ మత విద్వేషకాండ దాకా సాగిన మారణకాండ స్వభావంలో ఏమీ మార్పు లేదు. చారిత్రకంగా సాగిన ఈ హత్యోదంతాలన్నిటిలోను దుండగులు, సంఘ వ్యతిరేక శక్తులు, పాలకులు, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నాయకుల వైఖరులు ఒకేతీరులో సాగాయి. 2013–14లో ముజఫర్ నగర్ అల్లర్ల అనంతరం ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా అనేకచోట్ల ప్రజల్లో చీలిక తీసుకొచ్చేందుకు పథకం ప్రకారం మత విద్వేషదాడులు జరిగాయి. మెజారిటీ ప్రజలను సంఘటితం చేసి లబ్ధిపొందాలనుకుంటున్న సంఘ పరివార్ శక్తులు చేస్తున్న కుట్ర ప్రజాస్వామిక వాదులు తరచూ విమర్శిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా అదేసమయంలో ఆదిత్యనాథ్ ప్రభుత్వం రౌడీషీటర్లు, సంఘ విద్రోహశక్తులు, జూదగాళ్ళను, చిల్లర నేరస్తులను ఏరివేసేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. 'లొంగిపొండి లేదా రాష్ట్రం విడిచిపొండి' నినాదంతో వివిధరకాల అసంఘటిత నేరస్తులను యూపీ ప్రభుత్వం వేటాడింది. ఒక్క మీరట్ జోన్‌లోనే పోలీసులు అత్యధికంగా 449 ఎన్‌కౌంటర్లు చేయగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆగ్రా (210), బరేలీ (196), కాన్పూర్ (91) జోన్లు నిలిచాయి. ముజఫర్ నగర్ వంటి విద్వేషకాండల వల్ల అపఖ్యాతిని పోగొట్టుకొనేందుకు ఆదిత్యనాథ్ ప్రభుత్వం చిల్లర నేరస్తులను హత్య చేస్తూ రాజ్యహింసను పరిష్కారంగా ఎంచుకుంది. ఈ నేపథ్యంలోనే రిపబ్లిక్ డే నాడు అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విద్యార్థులు ముస్లిం ప్రజలున్న బద్దునగర్ ప్రాంతంలో బైక్ ర్యాలీని పథకం ప్రకారం చేపట్టి, మైనారిటీలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడింది. మైనారిటీల షాపులు, వాహనాలు, మసీదులు లక్ష్యంగా విధ్వంసకదాడులు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన పోలీసు దాడులు కూడా మైనారిటీలు లక్ష్యంగా సాగాయని నిజనిర్ధారణ కమిటీ నివేదిక ఆరోపిస్తోంది. ఆ తర్వాత మళ్ళీ కాస్‌గంజ్ విభజన రాజకీయాన్ని కప్పిపుచ్చుకునేందకు రాష్ట్ర ప్రభుత్వ అండతో యూపీ పోలీసు యంత్రాంగం మళ్లీ రౌడీషీటర్లు, సాధారణ నేరస్తులను మట్టుబెట్టే కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. మత విద్వేషకాండ పేరుతో సాగే ప్రైవేట్ హింస, అసాంఘిక శక్తుల ఏరివేత పేరుతో సాగే రాజ్యంహింసలను ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఒడుపుగా ఉపయోగిస్తోంది. ఈ విధంగా మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేసి, మెజారిటీల ఓటు బ్యాంకును సుస్థిరం చేసేందుకు ప్రయత్నించే విభజన రాజకీయాలు తాత్కాలికంగా అధికార పార్టీకి లాభదాయకంగా ఉన్నా బహుళత్వ భారతీయ సమాజంలోని సంయమనానికి విఘాతం కలిగిస్తుంది. రాజ్యహింసను విడిచిపెట్టి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించినపుడే పాలకులు దీర్ఘకాలిక ప్రయోజ నాలను సొంత చేసుకోగలుగుతారు.

ఖాప్‌ల కట్టడి

అనధికార, సమాంతర న్యాయవ్యవస్థగా పనిచేస్తున్న ఖాప్ పంచాయితీలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇద్దరు యుక్తవయస్కుల మధ్య జరిగిన వివాహాన్ని చట్టమే నిర్ధారించి, తదనుగుణంగా చర్యలు తీసుకుంటుంది, ఖాప్ పంచాయితీ సమాజంలో నైతికతను కాపాడాల్సిన పనిలేదని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఇష్టపూర్వకంగా ఇద్దరు మేజర్లు వివాహం చేసుకున్నట్లయితే వారిని శిక్షించే హక్కు ఎవరికీ ఉండదని సుప్రీం ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఉత్తర భారతంలోని కొన్ని గ్రామాలలో పెద్ద అభిప్రాయాలకు విరుద్ధంగా వివాహం చేసుకున్న వారిని ఖాప్ పంచాయితీల పేరుతో కొందరు గ్రామపెద్దలు శిక్షిస్తున్న దుర్మార్గాన్ని అరికట్టాలని కోరుతూ శక్తివాహిని అనే స్వచ్ఛంద సంస్థ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు స్పందించింది. అయితే హర్యానాలోని మధ్యయుగాల నాటి నుంచి ఆనాదిగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవడం తమ బాధ్యతగా భావిస్తూ ఆ పెద్దలు మరణశిక్ష సహా అమానవీయ శిక్షలు విధిస్తున్నారని ఆ పిటిషన్ పేర్కొంది. అయితే విచిత్రమేమంటే ఖాప్ పంచాయితీలతో తమకు సంబంధం లేదని, కేవలం వివాహం చేసుకున్న యుక్తవయస్కుల వివాహబంధంపై జరిగే దాడి మాత్రమే న్యాయస్థానం పరిధిలోకి వస్తుందని సీజేఐ దీపక్ మిశ్రా పేర్కొన్నారు. తల్లిదండ్రులు, సమాజం, రాజ్యం ఎవరైనా సరే ఇద్దరు యుక్తవయస్కులు వివాహం చేసుకుంటే అందులో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది.

పరువు హత్యలపై, ఖాప్ పంచాయితీ శిక్షల చట్టపరమైన ప్రామాణికతను ప్రశ్నిస్తూ వాటిని అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ శక్తివాహిని అనే సంస్థ 2010లో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిల్‌పై స్పందించిన సుప్రీంకోర్టు పరువు హత్యల నేపథ్యంలో యువ దంపతుల రక్షణకు సంబంధించి 'సమర్థవంతమైన సూచనలు' చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు అఫిడవిట్‌ను, ఖాప్‌ల తరపు న్యాయవాది వాదన విచారించి, పంచాయత్‌ల పేరిట చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని మేజర్ల వివాహాలను అడ్డుకునే హక్కు వారికి లేదని తీర్పు చెప్పింది. ఆధునికతవైపు దేశం పరుగులు తీస్తున్నప్పటికీ వివాహబంధాల విషయంలో ఇంకా మధ్యయుగాల నాటి సంప్రదాయాలు అనేక ప్రాంతాల్లో యథేచ్ఛగా కొనసాగుతుండడం దారుణం. దేశవ్యాప్తంగా పరువు హత్యలు గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల్లో, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అధికంగా జరుగుతున్నాయని జాతీయ నేర గణాంక సంస్థ వెల్లడించింది. ఈ హింసాత్మక దాడులపై దేశవ్యాప్తంగా వెలువడిన నిరసనల నేపథ్యంలో ఖాప్‌ల కోరలు పీకుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం. కులవ్యవస్థను నిలబెట్టి, తమ సామాజికాధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు పెత్తందారీ శక్తులకు ఖాప్ పంచాయితీలు, పరువు హత్యలు శక్తిమంతమైన సాధనాలుగా ఉపకరిస్తున్నాయి. నిర్భయ చట్టం వచ్చినా మహిళలపై సామూహిక అత్యాచారాలు జరుగుతుండడంలో మార్పు రానట్లు సుప్రీంకోర్టు తీర్పుతో పరువు హత్యలు పూర్తిగా ఆగుతాయని విశ్వసించలేము. మహిళలపై సమాజ దృక్కోణంలో మార్పు రావడం తప్పనిసరి షరతుగా ఉంటుంది.



మంచిమాట



'విజయానికన్నా దానికోసం చేసే ప్రయత్నం చాలా గొప్పది'


జిగ్ జిగ్లర్

మోదీ 'ఆరోగ్య బీమా' ఫలిస్తుందా?

'ఆయుష్మాన్' భారత్ ఆరోగ్యబీమా పథకం కొత్త సీసాలో పాత సారా అని చెప్పుకోవచ్చు. ఈ పథకంవల్ల లబ్ధిపొందే వారు ఇప్పటికే పాత పథకాల వల్ల లబ్ధిపొందుతూనే ఉన్నారు. బడ్జెట్‌కు ముందు చర్చల్లో పన్ను లకు ప్రాధాన్యం ఉండడం సహజంకానీ ఇలా 'ఆరోగ్యం' ప్రధాన భూమిక పోషించడం గతంలో ఎన్నడూ లేదు. అనారోగ్యంతో బాధపడుతున్న 50 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున ప్రయోజనం చేకూర్చేలా పథకం ప్రకటించడం అనూహ్యమే! దీనికి వ్యతిరేకత వ్యక్తంచేయాల్సిన పనిలేదు. ఇలా ప్రకటించడం విస్మయాన్ని కలిగించే అంశం. ఈ పథకం అమలు గురించి వివిధ ప్రసార మాధ్యమాల్లో బడ్జెట్ అంచనాలపై వేర్వేరు కథనాలు వెలువడుతున్నాయి. విశ్లేషణలు మొదలవగానే అనేక అనుమానాలకు, సందేహాలు చోటుచేసుకున్నాయి.

ప్రజలకు అనూహ్య ఆదాయ షాక్‌ల నుంచి రక్షించేందుకుద్దేశించినవే ఆరోగ్య బీమా పథకాలు. ఎలాంటి ముందు హెచ్చరికలు లేకుండా సంభవించే, పెద్దమొత్తం అవసరమయ్యే ఆరోగ్య సమస్యలకు బీమా పథకాల లక్ష్యం. భారత్‌లో ఏటా దాదాపు 60 కోట్ల మంది ఈ ఖర్చులు భరించే స్థితిలో లేక అప్పుల పాలవుతున్నారు. వారిని ఇటువంటి ఉపద్రవాల నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వాల జోక్యం అవసరం. ఆరోగ్య భద్రతపై దేశాలు తమతమ విలువలు, అభివృద్ధి క్రమంలో అనేక దేశాలు ఆరోగ్య బీమా పథకాలను అమలుచేస్తున్నాయి. కెనడా, ఇంగ్లండ్, జపాన్, థాయిలాండ్, శ్రీలంక దేశాలు ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను అందిస్తున్నాయి. అలాగే ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలకు పూర్తి ఖర్చులను భరిస్తున్నాయి. ఏ పౌరుడూ వైద్యఖర్చులు భరించలేని స్థితిలో లేకుండా చూడడం ప్రభుత్వాల బాధ్యత. రోగాల బారిన పడడం వ్యక్తిగతంగా ప్రజల బాధ్యతేనని అమెరికా పరిగణిస్తుంది. అందువల్ల అమెరికన్లు మార్కెట్‌లో లభించే బీమా పథకాలను తీసుకోవాలి. అంతేగాక, చికిత్సకు అయ్యే ఖర్చులో 30 శాతం భరించాలి. అయితే, పేదలకు, వృద్ధులకు సబ్సిడీలను అమెరికా ప్రభుత్వం అందిస్తోంది. సామాజిక బీమాను యూరోపియన్ దేశాలు కూడా అమలు చేస్తున్నాయి. ఇందులో ప్రభుత్వం, ఉద్యోగులు, వ్యక్తులు ఖర్చును భరిస్తున్నారు. 90 శాతం మంది అధికారిక, సంస్థాగత ఉద్యోగులు ఆరోగ్య బీమా తప్పనిసరి అయినప్పుడు ఇటువంటి ఏర్పాట్లు ఫలిస్తాయి. మనదేశంలో 93 శాతం మంది అసంఘటిత కార్మికులు కావడం వల్ల వారికి ఎలాంటి నిర్ణీత ఆదాయం ఉండదు. అలాంటి వారికోసం, పేదల కోసం ప్రభుత్వం వారి ప్రీమియాన్ని కూడా చెల్లించే బాధ్యతను తీసుకుంటోంది. వాణిజ్య బీమా కంపెనీల భాగస్వామ్యంతో ఆ బాధ్యతను దాదాపు 20 రాష్ట్రాల్లో అమలవుతోంది. మూడు రాష్ట్రాలు మాత్రం ప్రభుత్వాలే ప్రభుత్వ నిర్వహణలో ట్రస్టులు ఏర్పాటు చేశాయి. మరో ఐదు రాష్ట్రాలు అటు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాలతో సంయుక్తంగా అమలుచేస్తున్నాయి. 2008లో బీపీఎల్ కుటుంబాలకు 30 వేల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించేలా రాష్ట్రీయ స్వాస్థ్ బీమాయోజన (ఆర్‌ఎస్‌బీవై) ఏర్పాటుచేశారు.

ప్రభుత్వం ఎంతమొత్తంలో బీమా సౌకర్యం కల్పిస్తుందో అంచనాలు లేకపోయినప్పటికీ కొన్ని సర్వేల లెక్కల ప్రకారం ప్రభుత్వం (కేంద్రం, రాష్ట్రాలు కలిసి) ప్రభుత్వ ఉద్యోగుల (కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం–సీజీహెచ్‌ఎస్) కోసం ఏడాదికి 20 వేల రూపాయలను ఖర్చుచేస్తున్నాయి. అదే సంఘటిత రంగంలో పనిచేస్తున్న వారి కోసం, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికోసం ప్రభుత్వ నిర్వహణలోని బీమా పథకాలను (రాష్ట్ర ఉద్యోగబీమా పథకం. – ఈఎస్ఐఎస్) అమలుచేస్తున్నాయి. 2013–14లో వివిధ ఆరోగ్య పథకాలకు అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేట్ వ్యక్తులు 32,308 కోట్ల రూపాయలు ప్రీమియం కింద చెల్లించారని అంచనా. ఇదే 2004లో 3,661 కోట్ల రూపాయలుంది.



> ప్రస్తుతం ప్రకటించిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం కొత్తదేమీ కాదు, పాత పథకాల వంటిదే! ఒక్క హామీ ఇచ్చిన బీమా మొత్తంలో మాత్రం తేడా ఉంది. ఈ పథకం బీపీఎల్ కిందకు వచ్చేవారికి మాత్రమే. ద్వితీయ, తృతీయ చికిత్సలకోసం ఆసుపత్రుల్లో చేరిన వారికి ఈ పథకం వర్తిస్తుంది. దీన్ని 60-40 నిష్పత్తిలో రాష్ట్రాలు భరిస్తాయి. ఒకకోణంలో ఈ పథకం మంచిదే. దేశంలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చూస్తే కొంతమేరకు సాధ్యాసాధ్యాలపై అనుమానాలు వ్యక్తమవుతాయి.

ప్రస్తుతం ప్రకటించిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం కొత్తదేమీ కాదు, పాత పథకాల వంటిదే! ఒక్క హామీ ఇచ్చిన బీమా మొత్తంలో మాత్రం తేడా ఉంది. ఈ పథకం బీపీఎల్ కిందకు వచ్చేవారికి మాత్రమే. ద్వితీయ, తృతీయ చికిత్సలకోసం ఆసుపత్రుల్లో చేరిన వారికి ఈ పథకం వర్తిస్తుంది. దీన్ని 60–40 నిష్పత్తిలో రాష్ట్రాలు భరిస్తాయి. ఒకకోణంలో ఈ పథకం మంచిదే. దేశంలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చూస్తే కొంతమేరకు సాధ్యాసాధ్యాలపై అనుమానాలు వ్యక్తమవుతాయి. ఆర్‌ఎస్‌బీవైపై మదింపు సర్వేలు పరిశీలిస్తే, 5.9 కోట్ల కుటుంబాల్లో 3.6 కోట్ల కుటుంబాలు మాత్రమే వినియోగించుకున్నాయి. ఆరోగ్య పథకాలను అమలుచేయడానికి జాతీయ హామీ అథారిటీని నియమించవలసినఅవసరం ఉన్నది. ఈ సంస్థ ద్వారా అనవసరంగా ఆసుపత్రుల్లో చేరడాన్ని తగ్గించడం, నాణ్యతా పర్యవేక్షణ తదితర చర్యలను చేపట్టవచ్చు. వైద్యులు, సిబ్బంది కొరత, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు లేకపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ పెట్టుబడులకు ఈ పథకం సరైనదని భావించడం పొరపాటు. దేశంలో 200 వెనకబడిన జిల్లాల్లో ఆసుపత్రులు ఏర్పాటుచేయక ప్రభుత్వానికి తప్పనిసరి పరిస్థితి. అలా కాకపోతే ప్రైవేట్ ఆసుపత్రులు లాభాలోచన లేకుండా కొన్ని ప్రోత్సాహకాలు ఇవ్వవలసి ఉంటుంది. పథకం అమలు సక్రమంగా ఉండాలంటే డిమాండ్‌కు అనుకూలంగా సౌకర్యాలు కూడా కల్పించవలసి ఉంది. ఆరోగ్య పథకం అంశంలో ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల పరిస్థితికి దక్షిణాది రాష్ట్రాలకు ఎంతో వ్యత్యాసం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఆరోగ్యపథకాల అమలులో పోటీపడుతున్నాయి. ఏబీహెచ్ఐ కిందకు వచ్చే లబ్ధిదారుల్లో సగంమంది ఇప్పటికే లబ్ధిపొందుతున్నారు. పథకాన్ని మరింత విస్తృతపరచడానికి నిధుల కొరత అడ్డంకిగా ఉంది. ఆసుపత్రులకు ఔట్‌పేషెంట్‌గావచ్చేవారికి కూడా బీమా కల్పించవలసి ఉంది. ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆదాయ కారణాలతో పేదలు వెనకాడతారు. అందువల్ల ఔ ట్ పేషెంట్లకు కూడా బీమా సౌకర్యం కల్పించడం అవసరం. వారికి ఉచిత పరీక్షలు, ఉచిత మందులు, ఉచిత చికిత్స వంటివి కల్పిస్తే పథకం మరింత ప్రయోజనకరం కాగలదు. ఏబీహెచ్ఐ పథకం ముందడుగు చర్యే. పథక రూపకల్పన, పునరాకృతికి తెచ్చే బాధ్యత మంత్రులపై ఉన్నది. ఈ పథకం అమలుకు కేటాయించిన బడ్జెట్ సమర్థవంతంగా సమకాలీకరణ చేయాలి. అమలు చర్యలు వెంటాడుతూనే ఉంటాయి, కానీ సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కంటే తమిళనాడు, కర్ణాటక,కేరళ రాష్ట్రాలకు ఈ అంశంలో మంచి అనుభవం ఉంది. ప్రీమియాలను పెంచడంలో కేరళ, తమిళనాడు చురుకుగా ఉన్నాయి. రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో మాత్రం మరింత అధ్యయనం చేయవలసి ఉంటుందని భావించవచ్చు. బీమా పథకం విధానంలోను, నిర్మించడంలోను ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అప్పుడే 2025 నాటికి అనుకున్న తీరానికి చేరుకోగలం.

◆ **కె.సుజాతారావు**
కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ కార్యదర్శి

నక్షత్రాలు

కవిత

దోసెడు జలంబు దీర్చు దప్పిక
ఘటము నిండేనుండు క్షీరము దీర్చదు గదా
జనయిత్రి మీదనేని భక్తి దేవునుండు వ్యర్థము గదా
జనని గర్భాశయమిచ్చు శాంతము గర్భగుడి నివ్వునా.?
జన్మనిచ్చిన జననిసేయు సేవ జగన్మాత సేయునా.?
లోగిలుండు అంబను విస్మరించి దైవంబు స్మరించుట.!!!

పాలు-కల్లు నొక్కనుండు గాని స్వభావము వేరు గదా.!
తల్లి-మరుతల్లి నొక్కటేగాని జూపు ప్రేమ వేరు గదా .!!
ఆకారం నొక్కటైనను నిచ్చు ఫలం నొక్కటై నుండదే ..!!
అంబగడుపు గాల్చి జగదాంబకు నైవేద్యము ఫలితమివ్వునా?
అయ్యమీదనేని బత్తి శివయ్య మీదెందుకు ?
అయ్యాంబను సేవించని వాడికి
దైవంబు పూజించు నర్హతనుండదు గదా .!!!

– **అఖిలాశ**, బెంగుళూరు
072595 11956

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily,
D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor,
Green lands, opp. Green park Hotel,
Hyderabad, 500016, Telangana.

యువత భవిత పట్టని పాలకులు

యువతరం నడుం కడితే దరిద్రం దేశం నుంచి దాటేదాక తరిమి వేయబడుతుంది. ఈ దేశానికి విలువైన ఆస్తి యువతరమే. యువత ఎక్కువ కలిగిన మన దేశానికి ఇదొక వరం. యువతరానికి ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలు, వృత్తి నిపుణులుగా ఎదగాలంటే వీరికి తగినంత శిక్షణ అవసరం. సుశిక్షితులైన వారుగా యువతను తయారు చేస్తే వారి జీవితాల్లో ఉజ్వల వెలుగులు నింపుకుని, దేశంతో పాటు, ప్రపంచంలో అగ్రగామిగా పేరు గడించేలా చేయడం ఖాయం. దేశ జనాభాలో యువకులు (18–35) ఏళ్ళ మధ్య వయస్సు గల ఓటర్లు 65 శాతానికి పైబడి ఉన్నారు. 135.3 కోట్ల జనాభా కలిగిన మనదేశంలో ఏటా 1.2 కోట్ల మంది యువకులు ఉద్యోగాల కోసం వివిధ అర్హతతో వేటలో ఉన్నారు. వీరిలో అత్యధికులు అర్హతకు తగిన నైపుణ్యాలు, శిక్షణలు లేక వృత్తినిపుణులుగా రాణించలేకపోతున్నారు. నైపుణ్యాల లేమిని గమనించి పాలకులు నైపుణ్యాల అభివృద్ధికై, మంత్రిత్వశాఖను, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. 2022 నాటికి 15 కోట్ల మందికి నైపుణ్యాలతో కూడిన శిక్షణ అందించాలని ఈ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, అవసరాలకు అనుగుణంగా విస్త రించ లేకపోతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతా ల యువతలో విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో సమభావం పాటించాలి. గ్రామీణ యు వతకు ప్రత్యేక స్థానాన్ని (శిక్షణను), కల్పించాల్సి ఉంది. నేడు విద్యావిధానంలో మార్కుల పోటీలో డిగ్రీ పొందడం వరకే సరిపోతుంది. వారు ఉద్యోగాల కోసం మార్కెట్‌లో వచ్చేసరికి కనీస ప్రాథమిక అర్హతలను అందుకోలేకపోతున్నారు. దీనివలన నైపుణ్యాలు లేని నిరుద్యోగ యువకుల కర్మాగారంగా భారతదేశం మారబోతుంది. పాలకులు ఇలా యువతకు ఉద్యోగ, ఉపాధి, దారులు చూపకపోతే, దేశంలో అంతర్గత అశాంతి, యువతలో నైరాశ్యం ఆవేశకావేశాలుతోడై ఆత్మహత్యలు, హత్యలు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారే ప్రమాదం ఉంది.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా పాలకులు, పార్టీలు మారినా యువజన విధానాల పేరుతో ఎన్ని పథకాలు, నిధులు ఖర్చు చేసినా నిరుద్యోగం మాత్రం యువత నెత్తిన వేలాడుతున్న కత్తిలా ఉంది. ఏ దేశ నిర్మాణానికైనా యువతరమే కీలకం. అపారమైన మానవ వనరులకు నిలయం మన దేశం. యువజనులే అధికంగా ఉన్నా మానవ వనరుల అభివృద్ధిలో అట్టడుగు స్థానంలో ఉంది. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' నివేదిక ప్రకారం గ్లోబల్ హ్యూమన్ క్యాపిల్ ఇండెక్స్‌లో భారతదేశం మూడోస్థానంలో ఉంది. మనకన్నా చిన్న దేశాలైన శ్రీలంక, నేపాల్‌లు ముందంజలో ఉన్నాయి. ఉన్నత డిగ్రీలు ఉన్నవారిలో 75 శాతం మందికి ఉద్యోగ నైపుణ్యాలు లేవని కార్పోరేటు రంగాలు నిరుద్యోగులను వారి గడపదాటకుండా గెంటివేస్తున్న సంఘటనలను చూస్తున్నాం. దేశంలో నిత్యకృత్యంగా మారిన ఆత్మహత్యల్లో సగానికి పైగా 30 ఏండ్ల లోపువారే? ఇది కాదనలేని నిజం. నిరక్షరాస్యత, పేదరికం, ఆకలి, అనారోగ్యం, ఆర్థిక అసమానతలు, ఎటుచూసినా కానరాని మంచి భవిష్యత్తు, చివరికి చేసేది ఏమి లేక బాధలో యువతరం కొట్టుమిట్టాడుతున్నారు. దేశ పార్లమెంటులోని 543 లోక్‌సభ సభ్యుల్లో కేవలం 12 మంది సభ్యులు మాత్రమే 30 ఏళ్ల లోపు వారున్నారు. (2.2 శాతం) వీరు కూడా రాజకీయ నాయకుల కుటుంబాలకు చెందినవారే. పాలనలో యువతకు తీరని అన్యాయం జరుగుతుందనడానికి ఇదే నిదర్శనం.



ఆశించిన ఉద్యోగాన్ని పొందినవారు విలాసాలే జీవిత పరమావధి అనే భావన వీడాలి. ఉపాధి దొరకక, గుడ్డిలో మెల్లలా ఏదో ఒక ఉద్యోగం పొందినవారు జీతాన్నే జీవితంగా భావిస్తూ ప్రక్కవారి సమస్యలతో సంబంధం లేని విధంగా వ్యవహరించరాదు. ఉద్యోగం లేక విఫలమైనవారు వారి జీవితాల్ని చేజేతులారా అంతమొందించు కోవడాన్నే జీవిత లక్ష్యంగా భావిస్తున్న తీరునుండి మేలుకోవాలి. మన చేతిలో లేని జనన, మరణాల మధ్యనున్న విలువైన జీవిత కాలాన్ని మన ఆధీనంలోకి తెచ్చుకొని, హుళ ప్రయోజనాలను సమాజానికి అందివ్వడం అభి నంద నీయమని నేటి యువత తెలుసుకోవాలి. శక్తి అనేది డబ్బులో లేదు. మంచితనం, పవిత్రత, యువత, మహిళల్లో ఉందన్నాడు స్వామి వివేకానందుడు. యువత ప్రతిపనిలోనూ ఆచరణాత్మక అమలు కనబర్చాలి. ఆచరణ లేని పాలకుల విధానాల వల్లే దేశం పూర్తిగా భ్రష్టు పట్టిందని గమనించండి. యౌవ్వనోత్సవం పరవల్లు తొక్కుతున్నప్పుడే మీ భవిష్యత్తును నిర్దేశించు కోండి. జగమంతా వ్యాపారామయమైంది. పబ్లి సిటికి యువత ఆకర్షితమౌతూ వాస్తవాలను గ్రహించక భ్రమలో బ్రతుకును ఎల్లదీస్తున్న తీరునుండి మేల్కొనాలి.

రాబోయే ఎన్నికల గురించి ఆలోచించే నాయకులకన్నా రాబోయే యువతరం భవితపై శ్రద్ధ చూపాలి. అధికారంలో ఉన్నంత మాత్రాన్నే గొప్పవాళ్ళు కాలేరు. పాలకులు యువతను సక్రమ మార్గాన నడిపించి, స్వార్థరహిత సమ సమాజాన్ని నిర్మించాల్సింది పోయి యువశక్తి ని నిర్వీర్యం చేస్తున్నారు. యువత భవితను తీర్చిదిద్దకుండా నిర్లక్ష్యానికి గురిచేస్తే యువత ఆగ్రహానికి పాలకులు బలికాక తప్పదు.

◆ **మేకిరి దామోదర్**
వరంగల్,
9573666650

ఆదాయపు పన్నులో లొసుగులు

మన లేఖలు

రాజ్యాంగంలోని అధికరణం 14 అందరి పట్లా సమత్వంగా వ్యవహరించాలని ఆదేశిస్తోంది. కానీ ఆదాయపు పన్ను చెల్లింపు విధానాన్ని గమనించినట్లయితే సమత్వానికి తిలోదకాలిచ్చినట్లుగా అనుమానం కలుగుతోంది. ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31 ల మధ్య గల 12 నెలల కాలంలో పౌరులు సంపాదించిన ఆదాయంపై కేంద్ర ప్రభుత్వానికి ఆదాయపు పన్నును చెల్లించాలి. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచకపోవడం వలన ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఉన్న ఆదాయపు పన్ను చెల్లింపు విధానాన్నే ఈ ఆర్థిక సంవత్సరానికి ఉంచుతున్నట్లు తెలిపారు. 'అయితే ఆదాయపు పన్ను చెల్లింపు విధానాన్ని పరిశీలిద్దాం.

1. సంవత్సరానికి 2,50,000 సంపాదించిన వారికి ఆదాయపు పన్ను లేదు. భాగానే ఉన్నది.
2. సంవత్సరానికి 2,50,001 నుంచి 5,00,000 వరకు సంపాదించిన వారు అయిదు శాతం ఆదాయం పన్నును చెల్లించాలి. భాగానే ఉన్నది.

03 సంవత్సరానికి 5,00,001 నుంచి 10,00,000 వరకు సంపాదించిన వారు ఇరువై శాతం ఆదాయపు పన్ను చెల్లించాలి. ఇక్కడ సంవత్సరానిక్కి 5,00,000 సంపాదించిన వారి నుంచి 5 శాతం '' పన్నును వసూలు చేస్తున్నప్పుడు కేవలం 5,00,000 మించి ఒక రూపాయి, రెండు రూపాయలు, వంద, రెండు వందల రూపాయలు ఇలా వందల, వేల రూపాయలు సంపాదించిన వారి నుంచి 20 శాతం ఆదాయపు పన్నును వసూలు చేయడం అన్యాయం కదా! రెండోది ఒకటే సారి 5 శాతం ఆదాయపు పన్ను చెల్లింపు నుంచి 20 శాతం ఆదాయపు పన్నును పెంచడం సమతుల్య ఆర్థిక చెల్లింపులకు విరుద్ధం కాదా! 4. సంవత్సరానికి 10,00,001 నుంచి ఆపై ఎన్ని రూపాయలు సంపాదించినప్పటికీ 30 శాతం ఆదాయపు పన్ను చెల్లించాలి. ఆదాయపు పన్ను చెల్లింపు విధానం అన్యాయంగా, అసమంజసంగా, అప్రజాస్వామికంగా ఉన్నదా? లేదా? పౌరుల సంపాదనలో 20 శాతం, 30 శాతం ఆదాయపు పన్నును చెల్లించుచున్న వేతన జీవులు/ఉద్యోగులు సంవత్సరంలో దాదాపు రెండు నెలల వేతనాన్ని కోల్పోతున్నారు./ కాబట్టి ఆదాయపు పన్ను చెల్లింపు విధానం లక్షాధికారులకు ప్రతికూలంగాను, కోటీశ్వరులకు అనుకూలంగాను ఉన్నది.

– **మేరుగు రాజయ్య**
కేంద్ర కార్యదర్శి,
సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)

కనీస మద్దతు గారడీ

- డాక్టర్ జి.వి. రామాంజనేయులు

సముఖం



కనీస మద్దతు ధరను లెక్కించడంలో ప్రభుత్వం సరైన పంథాను అనుసరించడం లేదని, దీని వల్ల తెలుగు రాష్ట్రాల రైతులు భారీగా నష్టపోతున్నారని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, సుస్థిర వ్యవసాయ కేంద్రం కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ జి.వి.రామాంజనేయులు అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ 2018ని ప్రవేశ పెట్టిన నేపథ్యంలో డాక్టర్ జి.వి.రామాంజనేయులుతో **'ముద్ర'** జరిపిన సంభాషణ ఇది.

ముద్ర: 'కనీస మద్దతు ధర' అనే మాట వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు తుది పరిష్కారమవుతుందా?

డాక్టర్ జి.వి. రామాంజనేయులు: కచ్చితంగా అవుతుంది. అయితే కనీసమద్దతు ధరను లెక్కగడుతున్న ప్రక్రియ రైతులకు ఉపయుక్తంగా లేదు. సేద్యానికి అయ్యే ఖర్చులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ముడి సరుకు దొరుకుతుందా, లేదా వంటి ఉపరితల అంశాల్నే పరిగణనలోకి తీసుకుని లెక్కలు కడుతున్నారు. రైతుల పెట్టుబడికి సంబంధించిన అన్ని ఖర్చుల్నీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇంతకు మునుపు అంటే 1960ల్లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, వారి కుటుంబాల్లో పిల్లల చదువులు అన్నింటికీ ప్రభుత్వమే బాధ్యత వహించేది. దాని వల్ల రైతుకు జీవన వ్యయం తక్కువగా ఉండేది. తరువాతి కాలంలో ప్రభుత్వాల వైఖరిలో మార్పులు రావడం వల్ల రైతు జీవన వ్యయం పెరిగింది. ధర నిర్ణయించే విధానం ఈ పెరిగిన జీవన వ్యయానికి సంబంధించిన అంశాలన్నింటినీ క్రోడీకరించేదిగా లేదు. అందుకే స్వామినాథన్ కమిషన్ పెట్టుబడికి అదనంగా యాభైశాతాన్ని చేర్చుతూ కనీస మద్దతు ధరను నిర్ణయించాలని సూచించింది. అయితే వ్యవసాయంలో చెల్లించిన ఖర్చు అంటే కూలీలకు, తదితర అవసరాలకు చెల్లించిన వ్యయాన్ని మాత్రమే అంటే 'ఎ2' ఖర్చుల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని కనీస మద్దతు ధరను నిర్ణయిస్తున్నారు. రైతుల సొంత భూమి, కుటుంబ సభ్యుల శ్రమ, తదితర ఖర్చుల్ని కలుపుకుని 'సి2' ఖర్చుల ప్రాతిపదికన కనీస మద్దతు ధరను నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసింది. మన తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయానికి అయ్యే ఖర్చు, మిగతా రాష్ట్రాలతో పోల్చితే చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే కనీస మద్దతు ధరను నిర్ణయించేటపుడు అన్ని రాష్ట్రాల్లో అయ్యే వ్యావసాయిక వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని, సగటున లెక్కగడతున్నారు. దాని వల్ల తెలుగు రాష్ట్రాల రైతులకు అన్యాయం జరుగుతోంది. అంతేగాక తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పాదక ఖర్చును తగ్గించడం, రైతు జీవన వ్యయాన్ని తగ్గించడం వంటి చర్యల్ని రాష్ట్రప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దాంతో తెలుగు రైతులు భారీగా నష్టపోతున్నారు.

ముద్ర: రబీ పంటలకు 1.5 శాతం కనీస మద్దతు ధర ప్రకటించామని, అలాగే ఖరీఫ్ పంటలకు కూడా ఉత్పత్తి వ్యయానికన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువగా కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నట్టు అరుణ్ జైట్లీ తన బడ్జెట్ 2017- 2018 ప్రసంగంలో పేర్కొన్నారు. కానీ రబీ పంటలకు కనీస మద్దతు ధర లభించినట్టయితే రైతులు ఎందుకోసం ఆందోళనలు చేపట్టాల్సి వచ్చింది?

డాక్టర్ జి.వి. రామాంజనేయులు: ప్రభుత్వం ఊరికే ఇలాంటి మాటలు చెబుతోంది. ఇవన్నీ వాస్తవాలు కావు. కనీస మద్దతు ధరను అన్ని రకాల ఖర్చుల్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయించడం లేదు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం క్వింటాలుకు 1866 రూపాయలు చెల్లించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 2,158 రూపాయల కనీస మద్దతు ధరను చెల్లించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరాయి. అయితే కేంద్రప్రభుత్వం మాత్రం 1,495 రూపాయల్ని మాత్రమే కనీస మద్దతు ధరగా ప్రకటించింది. దాన్ని లెక్కగట్టడంలో కూడా అవకతవకలున్నాయి. తాము చేస్తున్న తప్పిదాల్ని గుర్తించకుండా కనీస మద్దతు ధరను మేమిస్తున్నాం అంటే సరిపోదు. తెలుగు రాష్ట్రాల్లో కౌలు రైతులు ఎక్కువ, కౌలు కూడా ఎక్కువే. మిగతా రాష్ట్రాల్లో ఎ2, ఎఫ్ఎల్ (చెల్లింపులు జరపనక్కర్లేకుండా వ్యవసాయానికి అయిన పూర్తి ఖర్చు)ఖర్చుల్ని కలిపి ఇస్తున్నారు. మన రాష్ట్రాల్లో ఈ పరిస్థితి లేదు.

ముద్ర: పేద, దళిత, నిమ్న వర్గాలకు భూమి నివ్వకుండా ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలన్నీ నేతి బీరకాయ చందమే కాదా?

డాక్టర్ జి.వి. రామాంజనేయులు: తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది భూమి లేని వాళ్ళే రైతులుగా ఉంటున్నారు. ఇక్కడ భూమి ఉన్న వాళ్ళు వ్యవసాయం చేయరు, వ్యయసాయం చేసే వారికి భూమి ఉండదు. తెలంగాణలో దాదాపు 15 లక్షల మంది, ఆంధ్రప్రదేశ్‌లో 27 లక్షల మంది రైతులు ఉన్నారు. కౌలు సేద్యానికి ఖర్చు మరింత పెరుగుతుంది. కౌలురైతులకు ఆంధ్రప్రదేశ్‌లో 3,437 రూపాయలు, తెలంగాణలో 4,136 రూపాయలు కనీస మద్దతు ధర అడిగితే, కేంద్రం 1550 రూపాయలు ఇచ్చింది. రాష్ట్రంలో 4,135 రూపాయలు గిట్టుబాటు కాని పరిస్థితిలో ఉన్నప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని 'ఇంత ఇవ్వు, అంత ఇవ్వు' అని అడగడంతో సరిపెట్టుకోకూడదు కదా, వ్యావసాయిక వ్యయాన్ని తగ్గించే చర్యల్ని కూడా ప్రభుత్వం చేపట్టాలి. సమగ్రమైన భూపంపిణీ అన్నది కనిపించడం లేదు.

ముద్ర : భారతీయ వ్యవసాయరంగాన్ని సమస్యల్లోకి నెడుతున్న అంశాలేమిటి? భూతాపం లేదా ధరలు తగ్గిపోవడం లేదా మార్కెటింగ్ సమస్య.., వీటిలో ఏది ఎక్కువగా వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తుంది?

డాక్టర్ జి.వి. రామాంజనేయులు: ఈ మూడు కూడా దేశంలో వ్యవసాయరంగాన్ని ప్రభావితం చేస్తాయి. పెట్టుబడి ఖర్చు పెరగడం వల్ల రైతుకు ఆర్థిక ఆదాయం రావడం లేదు. మార్కెట్ ధర పెరగదు కాబట్టి గిట్టుబాటు ధర రాదు. బ్యాంకుల నుంచి రుణాలు అందవు, దాంతో రైతు ప్రైవేటు రుణాల మీద ఆధారపడాల్సి వస్తుంది. భూతాపం వంటి సమస్యల వల్ల కరవు ప్రాంత రైతులు ప్రైవేటు రుణాల బారిన పడి మరింతగా నష్టపోతున్నారు. అలా నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం కూడా సజావుగా అందడం లేదు. అంతేగాక ఖర్చు, కష్టనష్టాలు ఎక్కువగా ఉండే పంటల్ని పండిస్తున్నారు. దిగుబడి కోసం ఇది జరుగుతోంది. ఉదాహరణకు తెలంగాణలో పత్తి సాగునే తీసుకుందాం, దీని వల్ల రాష్ట్రంలో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులు ఎక్కువగా పత్తిని పండించకుండా చేయగలిగితే నష్టాన్ని నివారించవచ్చు. ఈ పని ప్రభుత్వమే చేయాలి. ఒక హెక్టారు పత్తి పంటకు 27 వేల రూపాయల భీమాను ప్రీమియంగా చెల్లించాలి. దీనిలో రైతు ఐదువేల రూపాయలు చెల్లిస్తాడు. మిగతా మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. దాదాపు 17 లక్షల ఎకరాలకు ఇలా ప్రీమియం చెల్లించుకుంటూ పోతే లాభపడేది భీమా కంపెనీలే.

ముద్ర: హరిత విప్లవం భారతీయ వ్యవసాయరంగమ్మీద ఎలాంటి ప్రభావాన్ని చూపించింది?


డాక్టర్ జి.వి. రామాంజనేయులు: హరిత విప్లవం వచ్చిన సందర్భం వేరు, దాన్ని ముందుకు తీసుకు వెళుతున్న సందర్భం వేరు. కరవు, ఆహారలేమి వంటి సమస్యల్ని అధిగమించడానికి వచ్చిన హరిత విప్లవం వల్ల రసాయనాలు, భూగర్భ జలాల వినియోగం వంటివి ఎక్కువయ్యాయి. కానీ అలా ఉత్పాదకతను అనూహ్య స్థాయిలో పెంచాల్సిన అవసరం ఇప్పుడు తీరిపోయింది. అయితే హరిత విప్లవంలో అనుసరించిన ప్రక్రియల్నే కొనసాగించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి, రసాయనాల వాడకం వల్ల భూ సారం తగ్గిపోతోంది, ఆహారం విషతుల్యమై పోయింది.

ముద్ర: కొన్ని అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 146 గ్రామాలకు ఒక వ్యవసాయ మార్కెట్ ఉంది, ఉత్తరప్రదేశ్‌లో ప్రతి 17 గ్రామాలకు ఒక వ్యవసాయ మార్కెట్ ఉంది. ఇలాంటి పరిస్థితిలో రైతు తాను పండించిన కూరగాయల్లాంటి తొందరగా పాడై పోయే ఉత్పత్తుల్ని తగిన సమయంలో మార్కెట్‌కి తరలించే అవసరాన్ని తీర్చడానికి దేశంలో ఇంకా ముప్ఫైవేల వ్యవసాయ మార్కెట్లను స్థాపించాల్సి ఉంటుందని ఆ అంచనాలు చెబుతున్నాయి. ఈ దిశగా ప్రభుత్వ విధానాలు ఎలా ఉండాలి?

డాక్టర్ జి.వి. రామాంజనేయులు: ఈ దిశగా ప్రభుత్వం ఇంతవరకు చేసిందేమీ లేదు. ఆపరేషన్ గ్రీన్ అని బడ్జెట్‌లో అన్నారు. వేచి చూడాలి. ఎన్ని మార్కెట్లని పెంచినా రైతుకు పండించిన పంటను తానే అమ్ముకునే స్వేచ్ఛ లేదు. ఎందుకంటే, ప్రైవేటు రుణాల్ని ఆశ్రయిస్తున్నారు కాబట్టి, ఆ రుణదాతలే ప్రత్యక్షంగా రైతు ఉత్పత్తుల్ని అమ్ముకుని, అప్పుకు జమ చేసుకుంటుంటారు.

ముద్ర: తెలంగాణలో రైతుల ఆత్మహత్యల పట్ల ప్రభుత్వ వైఖరి బాధ్యతాయుతంగా ఉందా?

డాక్టర్ జి.వి. రామాంజనేయులు: ఈ



విషయంలో ప్రభుత్వ వైఖరి ఎంతమాత్రం బాధ్యతాయుతంగా లేదు. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తరువాత 3,400 రైతు ఆత్మహత్యలు జరిగాయి. ప్రభుత్వం వాటిని గుర్తించడంలో విఫలమైంది. ప్రభుత్వం సమస్యల్ని గుర్తించాలి.

ఇంటర్వ్యూ : పసుపులేటి గీత



బాధితుల మీదే నిందలు

కె.సజయ, సామాజిక విశ్లేషకులు, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్



ముద్ర: ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఈ బడ్జెట్ న్యాయం చేసిందా? అలాంటి కుటుంబాలకు అందవలసిన సహాయం ఎలా ఉండాలి?

కె.సజయ: బడ్జెట్‌లో రైతు ఆత్మహత్యల ప్రస్తావనే లేదు. ఇలా రైతు ఆత్మహత్యల్ని నిర్లక్ష్యం చేయడమంటే వ్యవసాయరంగ సంక్షోభాన్ని గుర్తించడానికి ఏకమొత్తంగా నిరాకరించడమేనన్న మాట. రైతు ఆత్మహత్యలన్నవి ఇవాళ ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమైన విషయం కాదు. ఇది దేశవ్యాప్త సమస్య. ఎన్నో సంస్థలు ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఎందరో పనిచేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో అయితే గత రెండేళ్ళలో జరిగిన ఆత్మహత్యల పట్ల ప్రభుత్వ వైఖరి సంతృప్తికరంగా లేదు. కేంద్ర బడ్జెట్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాల్ని ఎలా ఆదుకుంటారన్న విషయాన్నే ప్రస్తావించలేదు. రైతు ఆత్మహత్యల అంశాన్ని తీసుకుంటే, ఇది చాలా ఇతర విషయాలతో ముడిపడి ఉంటుంది. దేశంలో 68 శాతం మహిళా రైతులు ఉన్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువ మంది ఉన్నారు. రైతు ఆత్మహత్యల్ని గుర్తించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోంది. వీళ్ళని ఆదుకోవడానికి ప్రత్యేక పథకాలు ఉండాలి. మహిళలే కుటుంబ యజమానులైనప్పుడు అన్ని పథకాల్లో వారికి ప్రత్యేక స్థానమివ్వాలి. ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ తమ కుటుంబంలో జరిగింది వ్యవసాయ సంబంధిత ఆత్మహత్యేనని నిరూపించుకోవడానికి ఈ ఒంటరి మహిళలు చాలా ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి ఉంటుంది. మంత్రి స్థాయి నుంచి ఎంఆర్‌వో స్థాయి వరకు ఈ మహిళల్ని రైతులుగానే గుర్తించరు.



నిరాశే మిగిలింది

- ఆశాలత, మహిళా రైతుల హక్కుల వేదిక



ముద్ర: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లాంటివి నిజంగా రైతుల సమస్యలకు సరైన పరిష్కారాలవుతాయా, బడ్జెట్‌లో మహిళా రైతులకు న్యాయం జరిగిందని భావిస్తున్నారా?

ఆశాలత: గ్రామీణ మహిళలు వ్యవసాయంలో నిర్వహించే కీలక పాత్రను ఎకనమిక్ సర్వే 2018 నివేదిక వివరించింది. గృహావసరాల కోసం సహజవనరుల్ని మహిళలు వినియోగిస్తుంటారని, వాటిలోని వైవిధ్యానికి, వనరుల సమగ్ర నిర్వహణకు మహిళలే బాధ్యత వహిస్తుంటారని, అలాంటి మహిళలకు భూమి, నీరు, వ్యవసాయ రుణాలు, సాంకేతికత వంటివి మరింత చేరువ చేయాలని ఆ నివేదిక అభిప్రాయ పడింది. అయితే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మహిళా రైతుల ప్రస్తావనే లేదు. బడ్జెట్ మహిళా రైతుల్ని నిరాశకు గురిచేసింది. నిజానికి ఇది తప్పుడు లెక్కల బడ్జెట్. రైతు వితంతువులకు, బడుగు, బలహీన వర్గాల మహిళలకు భూవసతి కల్పించాలని మేం డిమాండ్ చేస్తూనే ఉన్నాం. ఈ దిశగా ఎలాంటి స్కీమ్ లేదు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు విషయానికి వస్తే, దాని కోసం ఎనభై వేల ఎకరాల్ని సేకరిస్తున్నారు. భూసేకరణలో కూడా అక్రమాలు జరుగుతున్నాయి. అయితే భూసేకరణలో ప్రధానంగా నష్టపోతున్నది మహిళలే.

నగదు బదిలీ పరిష్కారం కాదు

- కిరణ్ విస్సా, రైతు స్వరాజ్య వేదిక



ముద్ర: రైతులకు ఇప్పుడిస్తున్న సబ్సిడీలన్నింటినీ రద్దు చేసేసి, వాటి స్థానంలో ప్రత్యక్ష ఆదాయ బదిలీ (డైరెక్ట్ ఇన్‌కమ్ ట్రాన్స్‌ఫర్) కింద ఒక్కో రైతు కుటుంబానికి యాభై వేల రూపాయలను అందించగలిగితే, రైతుల్ని ఆదుకుని, వారి ఆత్మహత్యల్ని నిరోధించవచ్చునన్న వాదన వినబడుతోంది, దీనిపై మీ అభిప్రాయాన్ని చెప్పండి. కనీస మద్దతు ధర రైతాంగ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందా?

కిరణ్ విస్సా: నిజానికి తెలంగాణ ప్రభుత్వం ఎకరానికి నాలుగువేల రూపాయల సబ్సిడీని ఇస్తానంటోంది. అంటే సగటున ఒక రైతు కుటుంబానికి రెండున్నర ఎకరాలు ఉంటే, ఆ కుటుంబానికి పదివేల రూపాయలు రావచ్చు. అయితే యాభై వేల రూపాయలు అనేది కాస్త ఎక్కువే. నగదును బదిలీ చేయడం ద్వారా వ్యవసాయరంగ సంక్షోభం సమసి పోదు. అన్ని వాణిజ్య రంగాలకు మద్దతుగా ఏఏ వ్యవస్థలు ఉన్నాయో, అలాంటి వ్యవస్థలే వ్యవసాయానికి కూడా అన్నుదన్నుగా ఉండాలి. వ్యవసాయం అనేది ఒక ఆర్థిక విషయం. దానికి అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది.

పదం

కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సిఎసిపి): ఇది వ్యవసాయ రంగానికి సంబంధించిన భారతప్రభుత్వ సంస్థ. ఈ వికేంద్రీకృత సంస్థను 1965లో 'అగ్రికల్చరల్ ప్రైసెస్ కమిషన్' పేరిట ప్రారంభించారు. అయితే 1985లో దీని పేరును కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (వ్యావసాయిక వ్యయ, ధరల సమాఖ్య)గా మార్చారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా వ్యవసాయదారులను ప్రోత్సహించేందుకు, ఉత్పాదనా సామర్థ్యాన్ని పెంచేందుకుగాను వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరలను నిర్ణయించడంలో క్రియాశీలక పాత్రను నిర్వహించే ఉద్దేశంతో ఈ సంస్థను ప్రారంభించారు. ప్రస్తుతం ప్రొఫెసర్ విజయ్‌పాల్ శర్మ ఈ సంస్థకు అధ్యక్షునిగా ఉన్నారు.


పథం



వ్యవసాయానికి అంతిమ లక్ష్యం పంటల్ని పండించడం కాదు, మానవ సంస్కారాన్ని ఫలవంతం చేయడమే దాని అంతిమ లక్ష్యం'

- మసనోబు ఫుకువోకా, ప్రకృతిసేద్య నిపుణుడు, తాత్వికుడు

సేద్యమంటేనే భయమేస్తోంది..



నల్లగొండ జిల్లా నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన శేఖర్‌రెడ్డి వ్యవసాయ సాగుకోసం చేసిన అప్పులు తీర్చలేక 2016 సంవత్సరంలో ఆత్మహత్య చేసుకున్నాడు. శేఖర్‌రెడ్డికి భార్య పద్మ, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. శేఖర్‌రెడ్డి తనకున్న నాలుగెకరాలతో పాటు మరో నాలుగెకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. తన నాలుగెకరాల్లో మూడు ఎకరాల విస్తీర్ణంలో నిమ్మతోట సాగు చేయగా, కౌలుకు తీసుకున్న నాలుగెకరాలతో పాటు తన ఎకరంలోనూ పత్తి పంట సాగు చేశాడు. కాలం కలిసి రాక ప్రతి ఏటా పెట్టిన పెట్టుబడి రాకపోగా అప్పులే మిగిలాయి. మరోవైపు నిమ్మకాయకు సరైన ధర రాకపోయేది. నిమ్మ చెట్లను నీళ్లు కట్టేందుకు ప్రతి సంవత్సరం ఎండాకాలంలో నీటి వసతి సరిగా లేక బోరు వేయాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో పంటల సాగు కోసం రూ.12లక్షల వరకు అప్పు చేశాడు. ఓవైపు అప్పు తీర్చే మార్గం కానరాక.. మరోవైపు అప్పిచ్చిన వారు తెల్లవారక ముందే ఇంటిముందుకొస్తుండడంతో అవమానం భరించలేక తన పంట పొలంలోనే పురుగుల మందు తాగి 2016 ఫిబ్రవరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రస్తుతం వ్యవసాయమంటేనే పద్మ వణికిపోతోంది. భర్త చనిపోయిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం తరపునుంచి ఏ సాయం అందలేదు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతుంది.

- సి.హెచ్.పద్మ, నకిరేకల్, నల్లగొండ జిల్లా

వ్యవసాయంతోనే ముందుకు..


నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన సైదమ్మ భర్త వ్యవసాయ సాగుకు చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి 2012లో ఆత్మహత్య చేసుకున్నప్పటికీ తాను మాత్రం వ్యవసాయాన్నే నమ్ముకుంది. సైదమ్మ భర్త సైదులు తనకున్న ఐదెకరాల్లో మూడెకరాల్లో పత్తి, రెండెకరాల్లో వరి సాగు చేసేవాడు. తరచూ బోరుమోటారు కాలిపోయేది, బోర్లలో పుష్కలంగా నీరు లేక వరి పంట ఎండిపోయేది. దీనికి తోడు పత్తి పంటకు గిట్టుబాటు ధర రాక పెట్టిన పెట్టుబడులు వెళ్లేవి కావు. పంటల సాగుకు ఒక్క నాలుగేళ్ల కాలంలోనే రూ.8 లక్షల అప్పు మిగిలింది. ఇంటి చుట్టూ అప్పులోళ్లు తిరిగిపోతుండడం తో 2012 డిసెంబర్‌లో తన పత్తి చేను కోసం తెచ్చిన పురుగుల మందు సేవించి విగత జీవిగా మారాడు. దీంతో భార్య సైదమ్మతో పాటు ముగ్గురు కూతుళ్లు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.

సైదమ్మకు ఏటూ చూసినా వ్యవసాయం తప్ప మరో మార్గం కన్పించలేదు. ఏదిఏమైనా వ్యవసాయాన్నే నమ్ముకుని ముందుకుసాగింది.

-సైదమ్మ, కేతేపల్లి, నల్లగొండ

- ఇంటర్వ్యూలు : బాదిని నర్సింహ

మెరుపు



అమెరికా బాటలో సౌదీ!

- 12 రంగాల్లో విదేశీ ఉద్యోగులపై నిషేధం
- ఈ ఏడాది నుంచే 7 రంగాల్లో అమలు
- వచ్చే ఏడాది మిగతా ఐదు రంగాల్లో..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: అమెరికన్లకే ఉద్యోగాలంటూ ట్రంప్ అనుసరించిన బాటలోనే సౌదీ అరేబియా పయనిస్తోంది. తాజాగా తమ పౌరులకే కంపెనీలు ఉద్యోగాలు కట్టబెట్టేలా ఒత్తిడి పెంచేందుకు, నిరుద్యోగం తగ్గించేందుకు 12 కీలక రంగాల్లో విదేశీయులు పనిచేయడాన్ని నిషేధం విధించనుంది. ఇందుకు సంబంధించిన విధానానికి ఆ దేశ కార్మిక మంత్రి అలీ బిన్ నసీర్ అల్ ఘఫీస్ ఆమోదముద్ర వేశారని 'ప్రభాత్ ఖబర్' పత్రిక వెల్లడించింది. ఈ విధానం ప్రకారం.. ఈ ఏడాది సెప్టెంబరు 11 నుంచి నాలుగు రంగాల్లో, నవంబరు 9 నుంచి ఏడు రంగాల్లో నిషేధం అమలులోకి రానుంది. వచ్చే ఏడాది జనవరి 7 నుంచి మిగతా ఐదు రంగాల్లో నిషేధాజ్ఞలు అమలులోకి రానున్నాయి. మొత్తంగా ఈ పరిణామా సౌదీలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 1.2 కోట్ల మంది విదేశీయులపై పెనుప్రభావం చూపనుంది. వీరిలో అత్యధికులు తక్కువ వేతనాలతో కూడి వివిధ వృత్తుల్లో పనిచేసే కార్మికులే కావడం గమనార్హం. సౌదీలో పనిచేసి పొట్టపోసుకుంటున్న 30 లక్షల మందికి పైగా భారతీయులపైనా ఈ ఉత్తర్వులు ప్రభావం చూపనున్నాయి. 12 రంగాల్లో విదేశీ ఉద్యోగులు పనిచేయడాన్ని కార్మిక, సామాజిక సంక్షేమ మంత్రిత్వ శాఖ దశలవారీగా నియంత్రిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కార్లు-మోటార్‌బైక్ షోరూములు, రెడీమేడ్ క్లాత్ స్టోర్స్, గృహోపకరణ, ఫర్నీచర్, గడియారాలు, కళ్లజోళ్లు, వైద్య పరికరాలు,, భవన నిర్మాణ సామాగ్రి, ఆటో విడిభాగాలు, కార్పెట్, స్వీట్ షాపుల్లో విదేశీ ఉద్యోగులు పనిచేయడంపై నియంత్రణలు అమల్లోకి రానున్నాయి.



నను ముట్టకురో..

- మరోసారి ట్రంప్‌కు చేయి అందించని మెలానియా

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేయి అందించడం.. అందుకు ఆయన సతీమణి మెలానియా మీడియా ముందే నిరాకరించడం.. గతేడాది రెండుసార్లు ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైన విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ అదే సీన్ రిపీట్ అయ్యింది. ఈ సారి స్వదేశంలోనే తన ఇంటి ముందే ఎదురైంది. ట్రంప్, మెలానియాతో కలిసి సోమవారం ఓహియో బయల్దేరారు. ఆ సమయంలో విమానం ఎక్కేందుకు శ్వేతసౌధం నుంచి ఇద్దరూ కలిసి వస్తుండగా.. ట్రంప్ మెలానియా చేతిని పట్టుకుని నడిచేందుకు ప్రయత్నించారు. కానీ మెలానియా ఆయనకు చేయి అందించలేదు. ఆమె తన చేతులను కప్పేసేలా పొడవాటి ఓవర్‌కోట్ ధరించడంతో మెలానియా చేయిని ట్రంప్ అందుకోలేకపోయారు. కాసేపు ప్రయత్నించినా చేయి అందకపోవడంతో ఇద్దరూ విడివిడిగా నడుచుకుంటూ వెళ్లిపోయారు.ఇదంతా మీడియా కంటికి చిక్కింది. ఈ వీడియోను ఎన్‌బీసీ న్యూస్ తన ట్విటర్‌లో షేర్ చేసింది. ఇంకేముంది దీన్ని చూసిన నెటిజన్లు విపరీతంగా కామెంట్లు పెడుతున్నారు. గతేడాది మేలోనూ ట్రంప్‌కు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఇజ్రాయిల్ పర్యటన సందర్భంలోనూ ట్రంప్ దంపతులు విమానం దిగగానే అక్కడి అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అంతా నడుచుకుంటూ కారు వరకు వెళ్లారు. ఆ సమయంలో మెలానియా కాస్త వెనుక ఉండటంతో ట్రంప్ ఆమెకు చేయి అందించారు. అప్పుడు మెలానియా వద్దు అన్నట్లుగా ట్రంప్ చేయిని తోశారు. ఈ ఘటన అప్పట్లో వైరల్‌గా మారింది.

జాదవ్‌పై మరిన్ని అభియోగాలు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6: పాకిస్థాన్‌లో గూఢచర్యం కేసులో మరణ శిక్ష పడిన భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌పై మరిన్ని అభియోగాలు మోపినట్టు ఆ దేశ మీడియా వెల్లడించింది. ఉగ్ర వాదం, విద్రోహక చర్యలకు సంబంధించిన పలు కేసుల్లో జాదవ్‌ను విచారిస్తున్నట్టు పేర్కొంది. జాదవ్‌పై నమోదు చేసిన గూఢచర్యం కేసు విచారణ మాత్రమే పూర్తయిందని, మిగిలిన కేసులు నడుస్తున్నాయని డాన్ పత్రిక ఓ కథనం ప్రచురించింది. సమాచారం కోసం 13 మంది భారత అధికారులను సంప్రదించగా, వారు సహకరించడం లేదని వెల్లడించింది. కాగా భారత అధికారుల పేర్లను వెల్లడించలేదు. జాదవ్‌కు సంబంధించిన నేవీ సర్వీసు ఫైల్, పెన్షన్, బ్యాంకు ఖాతా వివరాలను పాక్ కోరినట్టు ఆ పత్రిక పేర్కొంది. ఆయన ముబారక్ హుసేన్ పేరుతో పాస్‌పోర్టు పొందినట్టు తెలిపింది. గత ఏప్రిల్‌లో పాకిస్థాన్ సైనిక కోర్టు జాదవ్ (47)కు ఉరిశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఇరాన్ గుండా పాక్‌లోకి జాదవ్ ప్రవేశించాడని, 2016 మార్చిలో భద్రత బలగాలు ఆయన్ను అరెస్ట్ చేశాయని ఆ దేశ అధికారులు చెప్పారు. కాగా పాక్ ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. జాదవ్‌కు ఉరిశిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ భారత్ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసులో తుది తీర్పు వెలువడాల్సివుంది.

బూటకపు ఎన్‌కౌంటర్..
ఏడుగురు పోలీసులకు జీవితఖైదు

- ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ. ఫిబ్రవరి 6: ఓ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో సస్పెన్షలో ఉన్న ఏడుగురు ఉత్తరాఖండ్ పోలీసులకు ఢిల్లీ హైకోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. అంతేకాక, సస్పెన్షన్‌కు గురై జీవిత ఖైదు అనుభవిస్తున్న మరో పదిమందిని విడుదల చేసింది. రణబీర్‌సింగ్ అనే 22 ఏళ్ల ఎంబీఏ విద్యార్థి 2009, జూన్ 3న ఏడుగురు పోలీసుల చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి 2014, జూన్ 9న ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును న్యాయమూర్తులు ఎస్.మురళీధర్, ఐఎస్.మెహతా కూడిన బెంచ్ సమర్థించింది. గజియాబాద్‌కు చెందిన రణ్‌బీర్‌సింగ్ 2003 జూలై 9వ తేదీన దోపిడి కోసం డెహ్రాడూన్‌కు వచ్చాడని, రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో బందోబస్తు నిర్వహిస్తుండగా తమలో ఒకరి సర్వీసు రివాల్వర్ ఎత్తుకుపోయాడని పోలీసులు కోర్టుకు తమ వాదనలు వినిపించారు. అయితే రణ్‌బీర్‌సింగ్ ఉద్యోగంలో చేరడానికి డెహ్రాడూన్ వచ్చాడని సీబీఐ కోర్టుకు తెలియజేయడమే కాకుండా నిందితుల వాదన కట్టుకథ అని తేల్చింది.

'బంగారు' బ్యాక్టీరియా!

బెర్లిన్, ఫిబ్రవరి 6: భార లోహాల నుంచి బంగారాన్ని వెలికి తీసే బాక్టీరియాను శాస్త్రవేత్తలు గుర్తించారు. రాగి, బంగారం వంటి లోహాలతో కూడిన మట్టిలో ఉండే బాక్టీరియం సి.మెలిడురాన్స్ జీవక్రియలపై జర్మనీలోని మార్టిన్ లూథర్ యూనివర్సిటీ హల్ విట్టిన్‌బర్గ్, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశోధించారు. మట్టిలో నిక్షిప్తమై ఉండే లోహాలు విషవాయువులను విడుదల చేస్తాయి. ఈ పరిస్థితుల నుంచి దాన్ని అది కాపాడుకునే క్రమంలో సి.మెలిడురాన్స్ బాక్టీరియా కొన్ని రసాయన చర్యలను ప్రేరేపిస్తుంది. రాగి, బంగారం రెండూ కలిసి ఉండే భార లోహాలతో జరిగే రసాయన చర్యలో బాక్టీరియా కణాలు రాగిని దానికి తీసుకుని.. అతి చిన్న పరిమాణంలో బంగారు పరమాణువులు విడుదలయ్యేలా చేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

మీరెటు పక్కా?





(మొదటిపేజీ తరువాయి)

ప్యాకేజి టన్నెల్ పనులు, సర్జిపుల్ పంప్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్జికల్ పంప్ హౌస్, టన్నెల్ నిర్మాణ పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులకు మంత్రి పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు.రిజర్వాయరులో మిగిలిన పనులకు సంబంధించిన పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని కోరారు. నిర్ణీత సమయంలోపు అన్ని పనులు పూర్తి చేసి నీళ్లు అందించేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి సూచించారు. రైతు సంక్షేమం, అభివ ద్ధి ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. స్వయంగా రైతు బిడ్డ అయినందున ముఖ్యమంత్రి కేసీఆర్ కు రైతుల బాధలు, సాధక- బాధకాలు అన్ని తెలుసని హరీశ్ రావు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఆసియాలోనే మరెక్కడా లేని విధంగా అనంతగిరి రిజర్వాయరులో 95 మీటర్ల ఎత్తు, 56 మీటర్ల వెడల్పుతో ఓపెన్ సర్జిపుల్ పంప్ హౌస్ నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి తీసుకునే రెండు టీఎంసీల నీటిలో ఒక టీఎంసీ నీటిని ఎస్సారెస్పీ నుంచి నిజామాబాదు, వరంగల్, యాద్రాద్రి జిల్లాలకు సాగు నీరు అందిస్తామని మంత్రి వివరించారు. మరో టీఎంసీ నీటిని పైకి తెచ్చి అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను నింపి వాటి ద్వారా రాజన్న-సిరిసిల్లా, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు సాగు నీరు అందిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా సిద్దిపేట- రాజన్న- సిరిసిల్లా జిల్లా సరిహద్దులో నిర్మిస్తున్న అనంతగిరి, రంగ నాయక సాగర్ ప్రాజెక్టు పనులను ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తి అయ్యాయని, ఇంకా 60వేల క్యూబిక్ మీటర్ల మట్టి పని మిగిలి ఉన్నదని, గ్రామస్థుల సహకారంతో 3 బండ్ పనులు పూర్తి చేశామని మంత్రి వివరించారు. అనంతగిరి రిజర్వాయరు విషయంలో సబ్ స్టేషన్ కావాలని, దానిపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడుతామని మంత్రి పేర్కొన్నారు.భూ నిర్వాసితులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉన్నదని, ఇళ్లకు నష్ట పరిహారాన్ని అందజేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాలు, సూచనలతో నిర్వాసితుల కోరిక మేరకు ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణాలు సైతం చేపడుతున్నామని ఆయన చెప్పారు. నిర్వాసితులకు శాశ్వత ఆదాయ వనరులు కల్పించేలా ప్రభుత్వం తరపున గట్టి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రి వెంట కాళేశ్వరం సీఈ హరిరాం, ఎస్ఈ వేణు, ఈఈ ఆనంద్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.



రెండు వారాల్లో 'టీడీఎన్'

(మొదటిపేజీ తరువాయి)



శాఖతోపాటు, ఐటి శాఖ పరిధిలో కొనసాగుతున్న పలు కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ మంగళవారం బషీర్ బాగ్ లోని టీఎస్ఐఐసీ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఐటీ శాఖ పరిధిలోని టీ-ఫైబర్, టీ- వర్క్స్, టీ-క్లౌడ్ వంటి కార్యక్రమాల పురోగతిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహేశ్వరం మండలంలోని 4 నాలుగు గ్రామాల్లో టీడీఎన్ నెట్‌వర్క్స్ పనులు కొనసాగుతున్నాయని, ఇవి పూర్తయితే ఈ-హెల్త్, ఈ-ఎడ్యుకేషన్, ఈ -గవర్నెనెన్స్ రంగాల్లో టీ-ఫైబర్ ప్రాజెక్టు ద్వారా రానున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఇంటింటికి ఇంటర్నెట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రానున్న వరల్ ఐటీ కాంగ్రెస్ సదస్సులో ఈ నెట్ వర్క్ ద్వారా ప్రదర్శిస్తామని మంత్రి తెలిపారు. వచ్చే వారం ఈ- నెట్‌వర్క్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఐటి శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌కు మంత్రి సూచించారు. టీ-వర్క్స్ డిజైన్లకు తుది ఆమోదం లభించిందన్నారు. ఈ డిజైన్ల మేరకు టీ-వర్క్స్ మొదటి దశ జూన్ నాటికి పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. టి-క్లౌడ్ ఏర్పాటు కోసం ఐటి శాఖ చేపడుతున్న పనిని మంత్రి సమీక్షించారు. టీ-క్లౌడ్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇలాంటి కార్యక్రమం చేపట్టిన దేశాలు, లేదా రాష్ట్రాలుంటే వాటి అనుభవాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్కు పైన సమీక్షించారు. ఇప్పటికే పార్కుకు పర్యావరణ శాఖ అనుమతులు లభించాయని అధికారులు తెలిపారు. పార్కు లే అవుట్ పూర్తి అయిందని, పలు రోడ్లు, నీటి సౌకర్యాల తాలుకు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. నీటి సౌకర్యం అందించేందుకు అవసరం అయిన 50 కోట్ల నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని తెలిపారు. మెగా టెక్స్ టైల్ పార్కులో అవసరం అయిన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ 20 ఎకరాల స్థలాన్ని కోరినట్లు మంత్రికి అధికారులు తెలిపారు. పార్కు పనులు వేగంగా పూర్తి చేయాలని, ఇప్పటికే పార్కులలో పెట్టుబడులకు అంగీకరించిన కంపెనీల పనులు క్షేత్ర స్థాయిలో ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. కంపెనీలతో కలసి పనిచేస్తున్నామని, టెక్స్ టైల్ పార్కు పనులు సకాలంలో పూర్తి అవుతాయని అధికారులు తెలిపారు. పార్కు పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు స్థానిక ఎమ్మెల్యే ధర్మారెడ్డి సహకారం తీసుకోవాలని టీఎస్ఐఐసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డ్రైపోర్టుల ఏర్పాటుపైన సమీక్షిస్తూ వాటి ఏర్పాటు కోసం ఇంతకు ముందు గుర్తించిన భువనగిరి, జహీరాబాద్, జడ్చర్ల లాంటి ప్రాంతాలతోపాటు రాష్ట్రానికి నలు వైపుల ఉన్న మరిన్ని ప్రాంతాలను పరిశీలించాలన్నారు. టీఎస్ఐఐసీ చేపట్టిన మెడికల్ డివైసెస్ పార్కు పురోగతి పైన సమీక్షించిన మంత్రి ఇప్పటికే అక్కడ 9 కంపెనీలకు అనుమతులు ఇచ్చామన్నారు. దీంతోపాటు దండు మల్కారంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ ఎంఎస్ఎంఈ పార్కు, జహీరాబాద్ నిమ్జ్, మెగా ఫుడ్ పార్కు, సీడ్ పార్కుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహా రెడ్డి, టీ-ఫైబర్ ఎండీ సుజయ్ కారంపూరి, పరిశ్రమలు, ఐటి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆడపడుచుల ఆరళ్లు

(మొదటిపేజీ తరువాయి)

విగతజీవులై తేలారు. చెరువు పక్కన పాదరక్షలు కనిపించడంతో అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు సిబ్బందితో అక్కడికి చేరుకున్న కీసర సీఐ, ఎస్ఐలు- మృతదేహాలను వెలికితీశారు. వారిని గుర్తించిన తర్వాత బంధువులకు సమాచారం తెలిపారు. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారనే నెపంతో అత్త, ఆడబిడ్డలు పెట్టే ఆరళ్లు భరించలేకనే రమేశ్ కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపిస్తూ వారు ఆందోళనకు దిగారు. ఈ ఉదంతంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.

'బలి'గొన్నది అతడే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతంలో నివసించే రాజశేఖర్ భార్య చాలాకాలం నుంచీ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో అతడు పలువురు మంత్రగాళ్లను ఆశ్రయించి వారు చెప్పిన క్షుద్రపూజలు చేయించినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో 20 రోజుల కిందట మామ నర్సింగ్‌రావుతో కలసి కరీంనగర్‌లోని గిరిజన తాండాలోగల మంత్రగాడి వద్దకు వెళ్లాడు. అతడు వారితో మాట్లాడిన తర్వాత కొన్ని పూజలు చేసి, నరబలి ఇస్తే రాజశేఖర్ భార్య ఆరోగ్యం బాగుపడుతుందని గట్టిగా చెప్పాడు. ఆ మాటలు నమ్మిన వీరిద్దరూ అతడు కోరిన సొమ్ము ఇచ్చేందుకు అంగీకరించి, సగం అడ్వాన్సుగా అందజేశారు. అలాగే నరబలి కోసం అదే గిరిజన తండాలో ఒక దళారి సాయంతో ఓ మూడునెల్ల చిన్నారిని కొనుగోలు చేశారు. ఈ నెల 1న పౌర్ణమి, అరుదైన చంద్రగ్రహణం ఉండటంతో మామ నర్సింగ్ రావు, కరీంనగర్ మంత్రగాడి సహాయంతో కుటుంబ సభ్యులనంతా కూర్చోబెట్టి మరీ నరబలి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించాడు. అటుపైన పాప తలను ఒక రోజంతా ఇంటిపైన ఉంచితే రాజశేఖర్ భార్య అనారోగ్యం త్వరలో దూరమవుతుందని మంత్రగాడు చెప్పాడు. ఆ మేరకు బలి అనంతరం చిన్నారి తలను డాబాపై ఉంచి, మొండాన్ని పొదల్లో పారేశారు. ప్రస్తుతం చిన్నారి మొండెం కోసం పోలీసులు అన్వేషణ ప్రారంభించారు. ఇప్పటికే వారం దాటిపోయిన నేపథ్యంలో మొండెం లభ్యమవుతుందా అన్నది సందేహాస్పదంగా ఉంది. పథకం ప్రకారం దారుణానికి పాల్పడిన రాజశేఖర్, అతడి కుటుంబసభ్యులు ఏమీ ఎరుగనట్లు పోలీసులకు ఫోన్‌చేసి తమ ఇంటి డాబాపై పసిపాప తల గురించి సమాచారం ఇచ్చారు. అయితే, కుటుంబసభ్యులను పలువిధాలుగా పోలీసులు ప్రశ్నించినపుడు వారు పొంతనలేని సమాధానాలిచ్చారు. దీంతో వారికి అనుమానం బలపడి లోతుగా ప్రశ్నించడంతో మరిన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ మేరకు రాజశేఖర్‌తోపాటు మామ నర్సింగ్ రావును, మంత్రగాడిని, దళారిని, ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. అయితే, నేరం అంగీకరించిన రాజశేఖర్ చిన్నారి మొండెం ఎక్కడ పడేసిందీ ఎందుకు చెప్పలేదన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

టార్గెట్.. సీఎం సీట్



(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి గానూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అనుమతి కోరేందుకు మంగళవారం ఢిల్లీకి పోయారు. రెండు రోజుల క్రితమే ఢిల్లీకి చేరుకున్న వెంకటరెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి ఏఐసీసీ నాయకులను కలుస్తున్నట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగానే వచ్చే ఎన్నికల్లో నల్లగొండ శాసన సభ స్థానానికి పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. ఆ స్థానం నుంచి బొడ్డుపల్లి శ్రీనివాస్ సతీమణి లక్ష్మిని పోటీకి దించాలని భావిస్తున్నారు. దీనిపై కూడా ఆయన రాహుల్‌తో చర్చించనున్నారు. శ్రీనివాస్ సతీమణిని పరామర్శించేందుకు నల్లగొండకు రాహుల్‌ను రప్పించే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. మరోపక్క శ్రీనివాస్ హత్యపై పెద్ద ఎత్తున ఆందోళన చేయడం ద్వారా, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోమటి రెడ్డి నిర్ణయించుకునారు. ఈ సానుభూతి ప్రభావం నాలుగైదు నియోజక వర్గాలపై ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కంచుకోట లాంటి నల్లగొండ నియోజక వర్గాన్ని బొడ్డుపల్లి శ్రీనివాస్ సతీమణికి కేటాయించి , తాను మునుగోడు నుంచి పోటీ చేయాలని కోమటి రెడ్డి భావిస్తున్నారు. దీని వల్ల రాజకీయంగా సానుకూలత మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. టీఆర్ఎస్ హత్యారాజకీయాలకు నిరసనగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని అనుకుంటున్నారు. రాజీనామా చేసి పాదయాత్ర చేస్తే దాని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని, టీఆర్ఎస్ హత్యారాజకీయాలను ప్రజల్లోకి బాగా తీసుకుపోవడానికి రాజీనామా పవర్‌ఫుల్ అస్త్రంగా పని చేస్తుందని ఏఐసీసీ పెద్దలను ఒప్పించనున్నారు. దీని వల్ల కాంగ్రెస్ కార్యకర్తల్లోనూ మనో ధైర్యం పెరుగుతుందని, ఎన్నికల్లో అధికార పార్టీని ధీటుగా ఎదుర్కోనేందుకు అవకాశం ఉంటుందని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చెప్పనున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉండటంతో పాటు బొడ్డుపల్లి లక్ష్మికి నల్లగొండ సీటు ఇవ్వడం ద్వారా బీసీ ఓటర్లను తన వైపు తిప్పుకోవచ్చని ఆయన ప్లాన్. దీనితో పాటు జిల్లాలో కనీసం నాలుగు నియోజక వర్గాలు తన కనుసన్నల్లోనే ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రకు పార్టీ అధిష్ఠానం అనుమతిస్తే రేవంత్ హవాను కూడా అడ్డుకుని, ఆయనకన్నా బలమైన నాయకుడిగా ఎదిగి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సాధిస్తే సీఎం రేసులోనూ ఉండాలన్నది ఆయన ప్లాన్. మరో పైపు అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎంత ఒత్తిడి చేసినా.. చివరి శ్వాస వరకు తన కోసమే పని చేసిన ఆత్మీయుడైన అనుచరుడి కోసం తన సొంత నియోజక వర్గాన్ని త్యాగం చేశారన్న పేరు సంపాదించడం ద్వారా భవిష్యత్‌లో రాజకీయంగా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని ఆయన భావిస్తున్నారు. 'ఒక్క దెబ్బకు రెండు పిట్టలే' కాదు ఎన్నో లక్ష్యాలు సాధించొచ్చన్న సరికొత్త కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు.

తిండి కోత.. గుండెకు మోత!



ఒక్కసారిగా తగ్గిస్తే అసలుకే మోసం.. గుండె కండరాల కొవ్వు పెరుగుదల

లండన్, ఫిబ్రవరి 6: 'ఇక రాత్రులు అన్నం వద్దు.. ఒక్క చపాతీ చాలు'... ఇలాంటి నిర్ణయాలు అకస్మాత్తుగా తీసుకునే వారికి హెచ్చరిక!! బరువు తగ్గించడానికో.. ఫ్యాట్ పెరగకుండా ఉండాలనో.. ఒక్కసారిగా ఇలా తిండి తగ్గించేస్తే అసలుకే మోసం వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉన్నట్టుండి కేలరీలు తగ్గడం వల్ల గుండె కండరాల కొవ్వు పెరిగిపోయి.. రక్తం సరఫరా చేసే సామర్థ్యం తగ్గిపోతుందని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ పరిశోధకుల పరిశోధనలో తేలింది. గుండె దానికి అవసరమైన శక్తి కోసం కొవ్వును వినియోగించుకోవడంతో ఇలా జరుగుతుందని వారు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, హృద్రోగులు ఇలా ఒక్కసారిగా ఆహారం తగ్గించడం మంచిది కాదని పేర్కొన్నారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ శాస్త్రవేత్త జెన్నిఫర్ రైనర్ ఎనిమిది వారాల పాటు 21 మంది వలంటీర్లపై పరిశోధన చేశారు. సగటు వయసు 52, బీఎంఐ 37 ఉండేవారిని ఆమె ఎంపిక చేసుకున్నారు. వారికి రోజుకు 600 నుంచి 800 కిలో కేలరీల ఆహారాన్ని అందిస్తూ వచ్చారు. అధ్యయనం ప్రారంభించిన తొలి రోజు ఎంఆర్ఐ



స్కానింగ్‌తో పాటు పలు పరీక్షలు చేసి వారి శరీర, పొత్తికడుపు, కాలేయ కొవ్వు శాతాలను లెక్కించారు. తొలి వారం తర్వాత వాటిని తిరిగి లెక్కించగా.. వరుసగా 6, 11, 42 శాతం చొప్పున పడిపోయాయి. కానీ హృదయ కండరాల కొవ్వు మాత్రం ఏకంగా 44 శాతం పెరిగిపోయింది. ఎనిమిదో వారానికి ఇది మరింత పెరిగింది. దీంతో గుండె పనితీరు మందగించి.. రక్తం సరఫరా సామర్థ్యం కూడా తగ్గింది. అయితే దీనిపై మరింత లోతుగా అధ్యయనం జరగాల్సి ఉందని జెన్నిఫర్ అన్నారు. హృద్రోగాలతో ఉన్నవారు వైద్యుల సలహాతోనే తిండి తగ్గిస్తే మంచిదని, ఇతరులు కూడా క్రమేపీ కొంచెం కొంచెం కేలరీలు తగ్గించుకుంటూ రావడం ఉత్తమమని ఆమె సూచిస్తున్నారు.



శ్రీనగర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య

- ఆస్పత్రి వద్ద కాల్పులు.. ఓ పాక్ ఖైదీ పరార్
- ఇద్దరు పోలీసులు మృతి



శ్రీనగర్, ఫిబ్రవరి 6: పోలీసు కస్టడీలో ఉన్న ఓ పాకిస్థాన్ ఖైదీని విడిపించేందుకు లష్కరే తొయిబా ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు. శ్రీనగర్‌లోని శ్రీమహారాజా హరిసింగ్ ఆస్పత్రి వద్ద విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఇద్దరు పోలీసులను చంపి నవీద్ జట్ అనే పాక్‌కు చెందిన ఖైదీని విడిపించుకుని పారిపోయారు. జమ్ము సెంట్రల్ జైలు నుంచి ఆరుగురు ఖైదీలను వైద్య పరీక్షల కోసం మంగళవారం శ్రీనగర్‌లోని మహారాజా హరిసింగ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సాయుధులు అయిన పోలీసులు వీరికి ఎస్కార్టుగా ఉన్నారు. ఆరుగురు ఖైదీల్లో ఒకడైన అబూ హంజల్ అలియాస్ నవీద్‌జట్ తనకు ఎస్కార్టుగా ఉన్న పోలీసులపై దాడి చేశాడు. వారి వద్ద ఉన్న తుపాకీని తీసుకొని కాల్పులు జరిపాడు. అప్పటికే ఆస్పత్రి బయట అతని కోసం వేచి ఉన్న ఉగ్రవాదులు కూడా పోలీసులపై కాల్పులు ప్రారంభించారు. ఈ క్రమంలో నవీద్ జట్ అతని కోసం వచ్చిన ఉగ్రవాదులతో కలిసి పారిపోయాడు. ఈ ఘటన అనంతరం పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు, ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టారు. పోలీసుల అదుపులోంచి పరారైన నవీద్‌ను 2014లో పోలీసులు అరెస్టు చేశారు. కశ్మీర్‌లో జరిగిన పలు ఉగ్రదాడుల్లో నవీద్ కీలక పాత్ర పోషించాడు. 2015లో కశ్మీర్‌లో భద్రత దళాలు జరిపిన దాడిలో మరణించిన లష్కరే తొయిబా నాయకుడు అబూ కాసీమ్‌కు నవీద్ అత్యంత సన్నిహితుడు.

పౌరులపై 'ప్రభుత్వ సమాచార హక్కు'

- ఆధార్‌పై సుప్రీం కోర్టులో కపిల్ సిబల్ వాదన
- దుర్వినియోగంపై సందేహంతో రద్దు చేయలేం
- విచారణ సందర్భంగా జస్టిస్ డీవై చంద్రచూడ్


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దుర్వినియోగం కాగల అవకాశం ఉందన్న భావనతో ఏ చట్టాన్నీ కొట్టివేసే వీలుండదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఆధార్'పై పిటిషన్లను విచారిస్తున్న పంచసభ్య రాజ్యాంగ ధర్మాసనంలోని జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్పష్టం చేశారు. మంగళవారం నాటి విచారణ సందర్భంగా జాతీయ భద్రతకు ఇదొక పటిష్ఠ ఉపకరణమన్న ప్రభుత్వ వాదనను అతిశయోక్తిగా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. పిటిషనర్లలో ఒకరి తరపున ఆయన వాదన వినిపిస్తూ – ''సమాచార భాండాగారాన్ని నియంత్రించే దేశం ప్రపంచాన్నే శాసించగలద''ని ప్రధానమంత్రి మోదీ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆధార్ చెల్లుబాటుకు కోర్టు నిర్ణయిస్తే అది అనేక అంశాలను ప్రభావితం చేస్తుందన్న వాస్తవాన్ని ప్రధాని వ్యాఖ్యలే రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ దుష్ప్రభావం భవిష్యత్తరాలపైనా పడుతుందని సిబల్ వివరించారు. ''ఆధార్ అన్నది ప్రభుత్వానికి సమాచార హక్కు''వంటిదేనని పేర్కొన్నారు. ''సమాచారమే శక్తి అయినప్పుడు, ప్రభుత్వానికి ఆ శక్తిని సంక్రమింపజేస్తే దాన్ని ఎన్నడూ ఎరుగని రీతిలో వాడుకుంటుంది'' అని వాదించారు. నేరం గురించి సమగ్ర సమాచారం లేకుండా ఎవరు ఉగ్రవాది.. ఎవరు అక్రమ ద్రవ్య చలామణీదారు అన్నది ఆధార్ తేల్చజాలదని చెప్పారు. అందువల్ల అది జాతీయ భద్రతకు కీలకమన్న ప్రభుత్వ అతిశయోక్తితో ఏకీభవించలేమని ధర్మాసనానికి తెలిపారు.

సిబల్ వాదనను ఆమోదించని ధర్మాసనం

కపిల్ సిబల్ వాదనను జస్టిస్ చంద్రచూడ్ ఆమోదించలేదు. దుర్వినియోగం కాగలదన్న అనుమానంతో ఏ చట్టాన్నీ రద్దు చేయడం సాధ్యంకాదని సుప్రీం కోర్టు లోగడ పలు సందర్భాల్లో తీర్పులిచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. అయితే, ఆధార్ వ్యవహారం వాటన్నిటికీ భిన్నమైనదని, ఇది ఇప్పటికే దుర్వినియోగం అయిందని సిబల్ బదులిచ్చారు. ఇది నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉందని వాదించారు. కానీ, ఆధార్ చట్టం ఏకపక్షమని నిరూపించగల ఆధారాలతో తమ ముందు కొస్తే రద్దు అవకాశాలను పరిశీలించగలమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ''సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత భరోసా లేని పరిస్థితి ఉంటే.. ఏ స్థాయివరకూ ముప్పును అంగీకరించగలమో, ఏ స్థాయివరకూ అంగీకరించడం వీలుకాదో కోర్టు ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. అయితే, పౌరుడి సమాచారాన్ని దుర్వినియోగం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేకపోయినా, సదరు సమాచారం బహిరంగమైనప్పుడు ప్రైవేటు సంస్థలు/వ్యక్తులు దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. వ్యక్తుల సమాచారం ఇప్పుడు బ్యాంకుల వద్ద, టెలికం సేవాప్రదాతల వద్ద ఉన్నదని, ఒకసారి ఇలా బహిర్గతమైతే ఆ సమాచారాన్ని తిరిగి భద్రం చేయడం సాధ్యం కాదని సిబల్ వివరించారు.

గ్రీన్ కార్డుల జారీ దేశం ప్రాతిపదికన వద్దు

- ప్రతిభే గీటురాయి కావాలన్న అమెరికన్ ఎంపీలు



వాషింగ్టన్, ఫిబ్రవరి 6: ప్రతిభ ఆధారంగానే గ్రీన్ కార్డులు జారీ చేయాలన్న భారతీయ అమెరికన్ల డిమాండ్‌కు మరింత మద్దతు పెరి గింది. ఇందులో భాగంగా ఒక్కో దేశానికి ఇన్ని గ్రీన్ కార్డులు ఇవ్వాలన్న విధానానికి బదులు, కేవలం ప్రతిభ ఆధారంగానే గ్రీన్ కార్డులు జారీ చేయాలన్న ఇండియన్ అమెరికన్స్ డిమాండ్‌కు ఇప్పటికే ఆరుగురు అత్యంత ప్రభావవంతమైన అమెరికన్ ఎంపీలు మద్దతిచ్చారు. ప్రస్తుతమున్న నియమాల కారణంగా అత్యంత నైపుణ్యవంతులైన భారతీయులు, గ్రీన్ కార్డు కోసం 70 ఏళ్లైనా వేచి చూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయని భారతీయ అమెరికన్లు వివరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశోధన, విద్యారంగం ఇలా వివిధ రంగాలకు చెందిన 200 మంది భారతీయ అమెరికన్ నిష్ణాతుల బృందం పలువురు ఎంపీలను వాషింగ్టన్‌లో కలిసి, గ్రీన్ కార్డ్ జారీపై తమ సలహాలు, సూచనలు విన్నవించింది. వర్క్ వీసాలు, పౌరసత్వం ఇచ్చేందుకు అసలు ఎలాంటి నియమ నిబంధనలుంటే బావుంటుందనే అంశంపై తాము కసరత్తు చేస్తున్నట్టు పార్లమెంట్ సభ్యుడు రాన్ ఎస్టేట్స్ వీరికి వివరించారు. కానీ ఏ దేశంలో పుట్టారన్నది ఇందుకు ప్రతిపత్తి కారాదని, ఒకరికి ఏడాదిలోనే వీసా రావచ్చు, మరొక వ్యక్తికి 20 ఏళ్ల సమయం పట్టవచ్చని, దీనికంతా ప్రతిభే తార్కాణంగా ఉంటుందని నొక్కి చెప్పారు. అమెరికాను మరింత గొప్ప దేశంగా మార్చేందుకు సహకరించే ప్రతిభ, నైపుణ్యం ఉన్న వ్యక్తులు మాత్రమే తమకు కావాలని ఎస్టేట్స్ స్పష్టం చేశారు.

పార్లమెంటులో పద'నస'లు

లోక్‌సభలో కొద్దిసేపు గందరగోళం.. రెండుసార్లు వాయిదాపడిన రాజ్యసభ

- మా గొంతు నొక్కుతున్నారు: విపక్షం
- చైర్మన్ వెంకయ్యనాయుడుపై ఆగ్రహం
- 'లిఖితపూర్వక అసంతృప్తి'కి ప్రతిపాదన
- 'తగువిధంగా' వ్యవహరిద్దామని నిర్ణయం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉభయసభల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలన్న డిమాండ్‌తో తెలుగుదేశం, వైఎస్సార్సీపీ సభ్యులు లోక్‌సభలో తీవ్ర ఆందోళనకు దిగారు. ఈ మేరకు సభాధ్యక్ష స్థానంవద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో వారందర్నీ సీట్లలోకి వెళ్లాల్సిందిగా స్పీకర్ సుమిత్రా మహాజన్ పలుమార్లు సూచించారు. అయినా వారు ఆందోళన వీడకపోవడంతో సభను 10 నిమిషాలపాటు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక సభా వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ టీడీపీ, వైసీపీ సభ్యులు కొందరితో మాట్లాడారు. ఆ తర్వాత కూడా వారు ''ఆంధ్రప్రదేశ్‌ను రక్షించాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, సంకీర్ణ ధర్మాన్ని పాటించండి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలి'' అనే ప్లకార్డులతో నినాదాలు కొనసాగించారు.





రాజ్యసభలో ఏకమైన ప్రతిపక్షాలు

రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై నిరసనకు దిగడంతో మంగళవారం రెండు సార్లు వాయిదాపడింది. సభా కార్యకలాపాల్లో భాగంగా తమ గళం వినిపించేందుకు అవకాశమే ఇవ్వడం లేదని అన్ని పార్టీల ఎంపీలు మండిపడ్డారు. పైగా నియమ–నిబంధనలు, పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధంగా సభను వాయిదా వేస్తూ తమ నోరు నొక్కేస్తున్నట్లు ఆరోపించారు. ఉదయం సభ ప్రారంభమైన కొద్దిసేపటికే చైర్మన్ వెంకయ్యనాయుడు సోమవారం నాటి తరహాలోనే ఏకంగా మధ్యాహ్నం 2 గంటలదాకా సభను వాయిదా వేశారు. దీంతో జీరో అవర్‌తో పాటు ప్రశ్నోత్తరాల సమయం కూడా కొట్టుకుపోయినట్లయింది. దీనివల్ల ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం కోల్పోయామని వారు ఆవేదన వెలిబుచ్చారు. తొలి వాయిదా తర్వాత సభ మళ్లీ మొదలుకాగా ఈ అంశాన్ని వారు లేవనెత్తారు. అయితే, దీనిపై చైర్మన్ చాంబర్‌కు వెళ్లి చర్చించాల్సిందిగా అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ కురియన్ సూచించారు. అయితే, కాంగ్రెస్ సభాపక్ష నేత గులాంనబీ ఆజాద్, టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్‌ల నేతృత్వంలో సభ్యులు ఇందుకు తిరస్కరించారు. ''జరిగిందేదో సభలో జరిగింది... దీనిపై సభలోనే చర్చ జరగాలి తప్ప చైర్మన్ చాంబర్‌లో కాదు'' అని ఒబ్రెయిన్ స్పష్టం చేశారు. చైర్మన్ వ్యవహార శైలి సభా సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని ఆజాద్ కూడా వ్యాఖ్యానించారు. ''సభను ఏ ఒక్కరో తమ ఇచ్ఛానుసారం నిర్వహించడం సాధ్యంకాదు. ప్రతి ఒక్కరినీ కనీసం ఒక్క నిమిషమైనా మాట్లాడనివ్వాలి. లోపలా, వెలుపలా కూడా మా గొంతు నొక్కేస్తున్నారు''అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము 267 నిబంధన కింద ఇచ్చిన తీర్మానాన్ని చైర్మన్ అంతకుముందు తిరస్కరించినప్పటికీ దానిపై చర్చకు పట్టుబట్టారు. అయితే, చైర్మన్ నిర్ణయాన్ని తాను మార్చలేనని కురియన్ నిస్సహాయత వ్యక్తం చేశారు. ఆయన సర్దిచెప్పినా సభ్యులు నినాదాలు ఆపకపోవడంతో సభను మధ్యాహ్నం 3 గంటలదాకా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, అంతకుముందు వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం 2 గంటలదాకా వాయిదా వేసిన తర్వాత అధికార, ప్రతిపక్ష సభ్యులు కొద్దిసేపు సభలోనే కూర్చున్నారు. ఆజాద్, ఒబ్రెయిన్, నరేష్ అగర్వాల్ (ఎస్పీ), డి.రాజా (సీపీఐ), జైరాం రమేశ్ (కాంగ్రెస్), ఎన్సీపీ, డీఎంకే తదితర విపక్ష సభ్యులు కాసేపు సమాలోచన చేశారు. ఈ సందర్భంగా పరిస్థితి ఇదేవిధంగా కొనసాగేట్లయితే 'తగువిధంగా వ్యవహరించాల'ని నిర్ణయించారు. అలాగైతే 'సభను బహిష్కరిద్దామా' అని వారిలో ఒకరు అనడం కూడా వినిపించింది. ఇది చాలా అప్రజాస్వామికం. దీనిపై లిఖితపూర్వకంగా చైర్మన్‌కు అసంతృప్తి వ్యక్తం చేయాలని కూడా భావించారు. మరోవైపు సభా నాయకుడైన ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ, బీజేపీ ఎంపీలు కొందరు కూడా తమ స్థానాల్లోనే చాలాసేపు ఉండిపోయారు.



అగ్ని-1 క్షిపణి పరీక్ష విజయవంతం

- ప్రయోగ సంసిద్ధత పరిశీలించిన ఆర్మీ
- 700 కి.మీ లక్ష్యాల ఛేదించే అణు క్షిపణి

బాలాసోర్, ఫిబ్రవరి 6: అణు సామర్థ్యం కలిగిన స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని–1ను భారత్ మంగళవారం విజయవంతంగా ప్రయోగించింది. 700 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదించగల ఈ స్వదేశీ క్షిపణిని ఒడిసా తీరంలోని బాలాసోర్‌లో గల డాక్టర్ అబ్దుల్ కలాం ఐలాండ్ (వీలర్ ఐలాండ్)లోగల ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ప్రయోగించింది. ఉదయం 8.30 గంటలకు చేసిన ఈ పరీక్ష విజయవంతమైందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. అగ్ని–1 నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏ మాత్రం తడబాటు లేకుండా కొనసాగింది. క్షిపణి ప్రయోగం ఆరంభం నుంచి లక్ష్యాన్ని చేరే వరకు దాని మార్గాన్ని అధునాత రాడార్లు, ఎలక్ట్రో ఆప్టిక్ పరికరాలు, యుద్ధ నౌకల సాయంతో గమనించారు. 12 టన్నుల బరువు, 15 మీటర్ల పొడవైన అగ్ని–1 క్షిపణి వెయ్యి కిలోల అణ్వస్త్రాలను మోసుకెళ్లగలదు. ఇది 700 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించగలదు. అగ్ని–1ను రక్షణ పరిశోధన అభివృద్ధి లేబొరేటరీ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) సహకారంతో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లేబొరేటరీ (ఏఎస్ఎల్) రూపొందించింది. భారత ఆర్మీకి చెందిన స్ట్రాటజిక్ ఫోర్సెస్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా దీన్ని మంగళవారం పరీక్షించారు. ఈ సందర్భంగా క్షిపణి ప్రయోగ సంసిద్ధతను క్షుణ్ణంగా పరిశీలించారు.



పాకిస్థాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధం అనంతరం స్వల్ప శ్రేణి క్షిపణి అవసరాలను గుర్తించిన సైన్యం అగ్ని–1 అభివృద్ధికి పూనుకొంది. రూపకల్పన మొదలుపెట్టిన డీఆర్డీవో 15 నెలల్లోనే దీన్ని పూర్తి చేసింది. 1989లో చాందీపూర్ టెస్ట్ రేంజ్ నుంచి మధ్యంతర పరీక్షలు చేపట్టింది. అనంతరం 2002లో పూర్తి స్థాయి పరీక్షలు చేసి విజయం సాధించింది. 2004లో ఇది భారత సైన్యం అమ్ములపొదిలో చేరింది. అనంతరం పలుమార్లు దీన్ని ప్రయోగ సంసిద్ధతపై పరీక్షలు జరిగాయి. 2016 నవంబరు 22న చివరి సారిగా పరీక్షించారు. భారత సైన్యం వద్ద ప్రస్తుతం 334 అగ్ని–1 క్షిపణులు సిద్ధంగా ఉన్నాయి.

మా పని చెత్త సేకరణ కాదు!

- 'వ్యర్థ' నివేదికలు మాకెందుకు?
- కేంద్ర ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం
- వ్యర్థాల నిర్వహణపై 845 పేజీల నివేదిక
- అరకొర సమాచారంపై కోర్టు మండిపాటు
- 3వారాల్లో నిర్దిష్ట వివరాలు ఇవ్వాలని ఆదేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ''మా పని చెత్త సేకరణ కాదు.. సమాచారం లేని 'వ్యర్థ' నివేదికలు మా ముందు పడేస్తారా?'' అంటూ కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణపై పెద్దగా సమాచారం ఏమీలేని 845 పేజీల అఫిడవిట్‌ను సమర్పించడంపై తీవ్రస్థాయిలో మండిపడింది. కేంద్రం తమ ముందు చెత్త పడేసి చేతులు దులుపుకోవడాన్ని సహించబోమని, ఈ అఫిడవిట్‌ను స్వీకరించబోమని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఘనవ్యర్థాల నిర్వహణకు చేపడుతున్న చర్యలు, ఘనవ్యర్థాల నిర్వహణ చట్టం–2016కు అనుగుణంగా రాష్ట్ర స్థాయి సలహా బోర్డులను ఏర్పాటు చేశాయా.. లేదా అనే వివరాలను సమర్పించాలని గత ఏడాది డిసెంబరు 12న కోర్టు ఆదేశించింది. వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో డెంగీ, చికున్‌గున్యా వంటి విషజ్వరాలు ప్రబలి పెద్దసంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయని ఆ సందర్భంగా సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని తాజాగా జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన బెంచ్ మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా కేంద్రం తరపు లాయర్ 845 పేజీల అఫిడవిట్‌ను దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే దీనిపై ఆయా వివరాలకు సంబంధించి ధర్మాసనం ప్రశ్నించగా.. న్యాయవాది వద్ద సమాధానాలు లేవు. కొన్ని రాష్ట్రాలు మాత్రమే నిర్దిష్ట సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో న్యాయమూర్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మీరు మమ్మల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారా? భారీ నివేదికలతో మెప్పించే ప్రయత్నం చేస్తారా? చెత్తంతా తెచ్చి మా ముందు పడేసి తప్పించుకో వాలనుకొంటే సహించబోం. రాష్ట్రాల నుంచి వచ్చి న వివరాలను మీరే చూడలేదు. ఆ నివేదికలన్నీ మేం పరిశీలించాలా? ఇటువంటి నివేదికలను స్వీకరించేదిలేదు'' అని స్పష్టం చేశారు. మూడు వారాల్లోగా నివేదికను సమర్పించాలనిఆదేశించారు.

మాల్దీవ్స్ సుప్రీం సీజే అరెస్ట్

- మరో జడ్జీ కూడా అదుపులోకి..
- దేశంలో ఎమర్జెన్సీ విధింపు..
- అధ్యక్షుడు యమీన్ తీవ్ర నిర్ణయం
- భారత సైన్యం జోక్యం చేసుకోవాలి
- మాజీ అధ్యక్షుడు నషీద్ విజ్ఞప్తి
- ముదిరిన రాజకీయ సంక్షోభం



మాలె, ఫిబ్రవరి 6: మాల్దీవ్స్‌లో సంక్షోభం మరింత ముదిరింది. ఆ దేశ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. మంగళవారం దేశంలో ఎమర్జెన్సీ విధించిన అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్.. అది విధించిన కొన్ని గంటల్లోనే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అబ్దుల్లా సయీద్, మరో జడ్జీని నిర్బంధించారు. వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్‌ను కూడా గృహనిర్బంధం చేశారు. దేశంలో 15 రోజుల పాటు అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్టు అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ప్రకటించారు. అంతర్జాతీయంగా ఒత్తిడి ఎదురవుతున్నా, సుప్రీంకోర్టు ఆదేశించినా రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు అధ్యక్షుడు అబ్దుల్లా నిరాకరించారు. పైగా తీర్పును తిరుగరాయాలని సుప్రీంకోర్టు జడ్జీలకు మూడు లేఖలు రాశారు. లేఖలు పంపిన వెంటనే దేశంలో ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ప్రకటించారు. మాల్దీవ్స్‌లో యమీన్ ఎమర్జెన్సీని విధించడం ఇది రెండోసారి. తనపై హత్యా ప్రయత్నం జరిగినప్పుడు 2015లో కూడా ఆయన ఎమర్జెన్సీ విధించారు. ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని అధ్యక్షుడు రెండు రోజుల్లో పార్లమెంట్‌కు తెలియజేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అయితే పార్లమెంట్‌పై ఇప్పటికే నిరవధిక సస్పెన్షన్ విధించారు. యమీన్‌పై తిరుగుబాటు చేసిన 12మంది ఎంపీల నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం, వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని ఆదేశించడంతో దేశంలో రాజకీయ సంక్షోభానికి తెరలేచింది. రెబల్ ఎంపీలు ప్రతిపక్ష పార్టీతో చేతులు కలిపితే తన అభిశంసనకు అవసరమైన మెజారిటీ వారికి లభిస్తుందన్న భయంతోనే యమీన్ తీర్పును నిరాకరిస్తున్నట్టు తెలుస్తున్నది.

వివాదం మొదలైంది ఇలా..

తన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న 9 మంది అసమ్మతి నేతలను యమీన్ జైలులో పెట్టించారు. అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి వెళ్లిన మరో 12 మందిపై అనర్హత వేటు వేశారు. ఇందుకు సంబంధించిన కేసులను విచారించిన సుప్రీంకోర్టు గత వారం కీలక తీర్పు వెలువరించింది. ''రాజకీయ ఉద్దేశాలతో నషీద్, మరో ఎనిమిది మందిపై నేర విచారణ కొనసాగించారు. ఇది దేశ రాజ్యాంగంతోపాటు అంతర్జాతీయ చట్టాల్ని ఉల్లంఘించడమే'' అని స్పష్టం చేసింది. 12 మంది పార్లమెంటు సభ్యులపై అనర్హతను కోర్టు కొట్టివేసింది. అయితే.. ఈ ఈ తీర్పుతో 85 మంది సభ్యుల మాల్దీవ్స్ పార్లమెంటులో యమీన్ వ్యతిరేక వర్గం ఆధిక్యత పెరిగింది. వారంతా తనపై అభిశంసన తీర్మానం పెట్టేందుకు ప్రణాళిక వేస్తున్నారనే సమాచారం అందడంతో యమీన్ కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. సుప్రీం తీర్పును ఎవరూ పాటించొద్దని ఆదేశాలు జారీ చేశారు. నేతలను విడుదల చేయొద్దని జైళ్ల విభాగానికి సూచించారు. అలా చేస్తే రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు. సోమవారం నుంచి జరగాల్సిన పార్లమెంట్ సమావేశాలను కూడా రద్దు చేశారు.



మాల్దీవ్స్‌లో నెలకొన్న సంక్షోభం సమసేలా భారత సైన్యం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆ దేశ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం శ్రీలంకలో కొలంబోలో ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ విజ్ఞప్తి చేశారు. 1988లో రాజీవ్‌గాంధీ హయాంలో మాల్దీవ్స్ అధ్యక్షుడు గయూమ్‌కు వ్యతిరేకంగా సైనిక కుట్ర జరగబోతున్నదన్న

భారత సైన్యం జోక్యం చేసుకోవాలి: నషీద్

సమాచారం అందుకున్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వం హుటాహుటీన అక్కడికి మన సైన్యాన్ని తరలించి కుట్రదార్లందరినీ నిర్బంధించింది. ఆ ఉదంతం అప్పట్లో రెండు విధాలుగా ప్రకంపనలు రేపింది. ఈ తరహాలోనే మళ్లీ భారత సైన్యం జోక్యం చేసుకోవాలని నషీద్ విజ్ఞప్తి చేశారు. అయితే.. నషీద్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన చైనాతో స్నేహానికి ఎక్కువగా మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో నషీద్ విజ్ఞప్తిపై భారత్ స్పందించే అవకాశాలు లేవని అంటున్నారు.



చాయ్, స్నాక్స్‌కు 68 లక్షలు!

- ఉత్తరాఖండ్ సీఎం ఖాతిర్‌దారీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ప్రభుత్వ అతిథులకు చాయ్, స్నాక్స్ ఇచ్చేందుకు ఏకంగా రూ. 68 లక్షలు ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెచ్చించింది. సర్కారు పెట్టిన ఈ ఖర్చు అందరికీ షాక్ ఇస్తోంది. ఇంతకీ త్రివేంద్ర సింగ్ రావత్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టి ఎంత కాలం అయిందనుకున్నారు? కేవలం 10 నెలలే, అయితే ఇంత తక్కువ సమయంలో అతిథులకు టీ, స్నాక్స్ కోసమంటూ 68 లక్షలు ఖర్చు పెట్టినట్టు లెక్కలు చూపించడం ఇప్పుడు బీజేపీకి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. అతిథుల కోసం ఇప్పటి వరకు రావత్ సర్కారు టీ, స్నాక్స్ కోసం ఎంత ఖర్చు చేసిందో తెలపాలంటూ సమాచార హక్కు చట్టం కింద ఓ వ్యక్తి చేసిన దరఖాస్తుతో ఈ విషయం వెల్లడైంది. ఇందుకు సమాధానమిచ్చిన ప్రభుత్వం, రావత్ గత మార్చి 18న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రూ.68,59,865 ఖర్చు చేసినట్టు వివరించింది. ఇక ఇలాంటి వివాదాల్లో ప్రభుత్వాలు చిక్కుకోవడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం అఖిలేష్ యాదవ్ ప్రభుత్వం కూడా అధికారం చేపట్టాక నాలుగేళ్లలో మంత్రుల టీ, సమోసాల కోసం 9 కోట్లు ఖర్చు పెట్టినట్టు లెక్కలు చూపింది.


• బాలకృష్ణ

72 స్కెచ్‌లు... 60 కోట్ల బడ్జెట్

స్వర్గీయ యన్.టి.ఆర్ బయోపిక్‌ను తెరకెక్కించే సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రీ ప్రొడక్షన్‌లో భాగంగా నటీనటుల ఎంపిక జరుగుతుంది. ఆసక్తికరమైన విషయమేమంటే.. ఇందులో నటించబోయే నటీనటుల కోసం ప్రత్యేకంగా 72 స్కెచ్‌లను గీయించారట తేజ. ఆ స్కెచ్‌లకు తగ్గట్లు, దగ్గరి పోలికలు ఉండేలా నటీనటులను ఎంపిక చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ పుట్టుక నుండి ఆయన సినీ రంగ ప్రవేశం, రాజకీయ రంగ ప్రవేశం చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం ఈ సినిమాలో ప్రధానాంశాలుగా ఉంటాయట. ఈ సినిమాను సాయి కొర్రపాటి, బాలకృష్ణలు నిర్మించనున్నారు. బాలకృష్ణ టైటిల్ పాత్ర పోషించబోతున్న ఈ సినిమా కోసం 60 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టబోతున్నారని ఇండస్ట్రీ టాక్. ఇటీవలే చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న నందమూరి బాలకృష్ణ వీలైనంత త్వరగా సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లాలనే యోచనలో ఉన్నారట.


• నాగార్జున


• ధనుష్

మరో మల్టీ స్టారర్‌కు రెడీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో ఉన్న హీరోల్లో మల్టీస్టారర్ సినిమాలను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నది అక్కినేని నాగార్జున ఒక్కరే. శ్రీకాంత్, నందమూరి హరికృష్ణ, మంచు విష్ణు, కార్తీ... ఇలా ఎవరితోనైనా కలిసి నటించడానికి నాగార్జునకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. తాజాగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నిర్మించే ఓ భారీ చిత్రంలో నానితో కలిసి నటించనున్నారు నాగార్జున. ఈ చిత్రం ఫిబ్రవరి 24న ప్రారంభం కాబోతోంది. ఇదిలా ఉంటే తమిళ్ హీరో ధనుష్ దర్శకత్వంలో నాగార్జున ఓ సినిమా చేయబోతున్నారు. ఈ సినిమాలో ధనుష్‌తో కలిసి నటించబోతున్నారు. తెన్నాండల్ ఫిలింస్ పతాకంపై నిర్మించే ఈ చిత్రంలో నాగార్జున ఓ కీలక పాత్ర పోషించనున్నారు. కథ నచ్చితే ఏ భాషలోనైనా, ఏ హీరోతోనైనా నటించడానికి తాను సిద్ధమని నాగార్జున ఇదివరకే ప్రకటించారు. ప్రస్తుతం రామ్ గోపాల్‌వర్మ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. నానితో చేసే సినిమాతోపాటు ధనుష్ చిత్రాన్ని కూడా ప్రారంభిస్తారని తెలుస్తోంది.


• లావణ్య త్రిపాఠి

తొలి ప్రాధాన్యం తెలుగుకే!

టిపికల్ కమర్షియల్ హీరోయిన్‌గా నటించడం తొలిసారి. కాబట్టి ఎంజాయ్ చేశానంటోంది సొగసరి లావణ్య. ఇంతకు ఈ అమ్మడు అలా ఎంజాయ్ చేస్తూ నటించిన చిత్రం మరేదో కాదు..'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలవుతుంది. సాయిధరమ్ తేజ్, వినాయక్ కాంబినేషన్‌లో సినిమాను సి.కల్యాణ్ నిర్మించారు. ఈ సినిమా గురించి లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ ''వినాయక్‌గారు, సాయిధరమ్ తేజ్‌తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. నేను నటించిన సినిమా విడుదలైన తర్వాత ఫీడ్ బ్యాక్ తీసుకోవడం నాకు అలవాటు. కొందరు పాజిటివ్‌గా చెబితే, మరికొందరు నెగిటివ్‌గా చెబుతారు.. అయితే రెండూ వింటాను. నేను పనిచేసిన ప్రొడక్షన్ హౌస్‌లన్నీ నాతో హ్యాపీయే. నాకు పడలేదని అనిపిస్తే.. ప్రాజెక్ట్ నుండి తప్పుకుంటాను. తమిళంలో ఓ సినిమా నుండి అలాగే తప్పుకున్నాను. పర్టికులర్‌గా కొన్ని సినిమాలే చేయాలని అనుకోను. అన్నీ తరహా సినిమాలు చేయాలని కోరుకుంటాను. హైదరాబాద్ అంటే నాకెంతో ఇష్టం. తెలుగు సినిమాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను. ఎందుకంటే టాలీవుడ్‌ను నా హోం గ్రౌండ్‌లా ఫీలవుతుంటాను'' అన్నారు.

నాలుగోసారి

కోలీవుడ్‌లో లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు నయనతార. ఓ వైపు హీరోయిన్ ఒరియెంటెడ్ మూవీస్ చేస్తూనే.. మరో వైపు అగ్ర కథానాయకులతోనూ జోడీ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే.. తాజాగా అజిత్‌కు జోడీగా నటించేందుకు నయన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అజిత్, దర్శకుడు శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న కొత్త చిత్రం 'విశ్వాసం'లో కథానాయిక పాత్ర కోసం కీర్తి సురేష్, అనుష్క వంటి పేర్లు వినిపించినా.. చివరికి ఆ అవకాశం నయన్ చెంతకు చేరింది. ఇప్పటికే అజిత్, నయన్ మూడు చిత్రాల్లో నటించారు. వాటిలో 'బిల్లా', 'ఆరంభం' ఘనవిజయం సాధించాయి. 'ఏగన్' పరవాలేదనిపించుకుంది. అలాగే దర్శకుడు శివ కాంబినేషన్‌లోనూ అజిత్‌కు ఇది నాలుగో సినిమా. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'వీరమ్', 'వేదాళమ్' మంచి విజయం సాధించాయి. 'వివేగమ్' పర్లేదనిపించుకుంది. మరి తనకు కలిసొచ్చిన కథానాయిక, దర్శకుడుతో అజిత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం అందుకుంటారేమో చూడాలి. ఈ ఏడాదే ఈ సినిమా తెరపైకి రానుంది.


• నయనతార

చరణ్ అన్నయ్యగా...


• నవీన్‌చంద్ర

రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన మొదటి షెడ్యూల్ పూర్తయింది. ఫిబ్రవరి మూడోవారంలో తాజా షెడ్యూల్ ప్రారంభం కానుంది. రక్తచరిత్ర, వివేకం చిత్రాల్లో విలక్షణమైన పాత్రలు పోషించి అందర్నీ మెప్పించిన వివేక్ ఓబరాయ్ ఈ చిత్రంలో విలన్‌గా నటిస్తుండడం విశేషం. అలాగే హీరోయిన్‌గా టాప్ హీరోలందరి సరసన నటించిన స్నేహ ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కి వదినగా నటిస్తోంది. తమిళ హీరో ప్రశాంత్.. చరణ్‌కి పెద్దన్నయ్యగా కనిపిస్తారు. వర్ధమాన హీరో నవీన్ చంద్ర... చరణ్‌కి మరో అన్నయ్యగా నటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా కథ విషయంలోనే కాదు, నటీనటుల ఎంపిక విషయంలోనూ విభిన్నంగా ఆలోచిస్తున్న బోయపాటి శ్రీను తప్పకుండా మరో సూపర్‌హిట్ సినిమా చేయబోతున్నారని ఫిలిం వర్గాలు పేర్కొంటున్నాయి. కైరా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు.

కల్యాణ్‌రామ్ కొత్త చిత్రం


• కల్యాణ్‌రామ్

ఈ తరం నందమూరి హీరోల్లో ఒకరైన నందమూరి కల్యాణ్‌రామ్ ఒకవైపు హీరోగా సినిమాల్లో నటిస్తూనే.. నిర్మాతగా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన కథానాయకుడిగా 'ఎం.ఎల్.ఎ'('అన్ని మంచి లక్షణాలున్న అబ్బాయి') అనే సినిమాతో పాటు 'నా నువ్వే' అనే సినిమాలో నటిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాలకు సంబంధించి విడుదల తేదీలు అధికారికంగా వెలువడనున్నాయి. కాగా ఇప్పుడు నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా మరో సినిమాకు రంగం సిద్ధమవుతుంది. వివరాల్లోకెళ్తే.. 'ఎం.ఎల్.ఎ' సినిమాను నిర్మించిన నిర్మాతలు ఇప్పుడు కల్యాణ్‌రామ్‌తో మరో సినిమాను నిర్మించడానికి రెడీ అవుతున్నారు. ఈ చిత్రానికి 'గ్రీన్ సిగ్నల్' ఫేమ్ విజయ్ మద్దాలి దర్శకత్వం వహించనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక సమాచారం వెలువడుతుంది.


• నిరూప్, అవంతిక

రొమాంటిక్ చలి పోరాటం

ఇటీవల విడుదలైన 'రాజరథం'లోని 'కాలేజ్ డేస్', 'నీలి మేఘమా' పాటలకు ప్రేక్షకుల నుండి మంచి స్పందన వస్తోంది. దర్శకుడు అనూప్ సంగీతంతో, రామజోగయ్యశాస్త్రి సాహిత్యంతో రూపొందిన ఈ పాటలు కనువిందైన దృశ్యాలతో వీక్షకులని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కలర్‌ఫుల్ విజువల్స్‌తో అందంగా తెరకెక్కిన ఈ పాటల చిత్రీకరణ వెనక ఆసక్తికర విశేషాలున్నాయి. ఆ పాటల చిత్రీకరణలో రెయిన్ సీక్వెన్స్ కోసం వాడిన నీరు చాలా చల్లగా ఉండడమే అందుకు కారణం. వణికించేంత చల్లని నీటిలో తడుస్తూ పాటకి తగ్గ ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వారిద్దరూ ఎంతో కష్టపడాల్సి వచ్చింది. 'కట్' చెప్పగానే చిత్ర బృందం నిరూప్, అవంతికల మీద వేడి నీళ్ళు పోసి, బ్లాంకెట్ కప్పాక కానీ మాములు స్థితికి వచ్చేవారు కాదు. తర్వాతి రోజు షూటింగ్‌కి ఇబ్బంది రాకూడదని జ్వరంతోనే షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇంత శ్రమపడి చేశారు కాబట్టే 'రాజరథం' ట్రైలర్, పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. తమ మొదటి ప్రయత్నంలోనే ఉత్తమ నిర్మాణ విలువలతో మంచి సినిమాని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్న 'రాజరథం' టీమ్‌ని అభినందించాల్సిందే. అజయ్‌రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న 'రాజరథం' ఫిబ్రవరి 16 నుండి ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.


• తాన్యా హోప్

ఉపేంద్ర జతగా...

విభిన్నమైన సినిమాలు చేయడంలో ముందుండే కన్నడ హీరో ఎవరంటే వెంటనే గుర్తుకొచ్చే పేరు ఉపేంద్ర. ఈయన హీరోగా నటించిన 'రా!','ఆ' వంటి సినిమాలు తెలుగులో అనువాద చిత్రాలుగా విడుదలై మంచి విజయాలను సాధించాయి. అలాగే తెలుగులో 'కన్యాదానం', 'సన్నాఫ్ సత్యమూర్తి' వంటి స్ట్రయిట్ చిత్రాల్లో నటించి మెప్పించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన ఉపేంద్ర ఇప్పుడు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. ఎలక్షన్స్ లోపు ఉపేంద్ర ఓ సినిమాలో మాత్రమే హీరోగా నటిస్తానని ప్రకటించారు. ఆ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయట. ఈ సినిమాలో ఉపేంద్ర సరసన తాన్యా హోప్ హీరోయిన్‌గా నటించనుంది. తెలుగులో 'అప్పట్లో ఒకడుండేవాడు', 'పటేల్ సర్' వంటి చిత్రాల్లో తాన్యా హోప్ నటించి అలరించింది.


• చిత్రా శుక్ల

మరో అవకాశం

సినిమా రంగంలోకి గెలుపోటములకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంటారు. ఎవరైనా హీరోయిన్ నటించిన సినిమాలు మంచి విజయాలు సాధిస్తే, ఆమెకు గోల్డెన్ లెగ్ హీరోయిన్‌గా పట్టం కట్టేస్తారు. దాంతో ఆ అమ్మడుకి అవకాశాలు క్యూ కడుతుంటాయి. అదే సక్సెస్‌లు లేని కథానాయికల విషయంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా వుంటుంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలైన 'రంగుల రాట్నం' సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఈ చిత్రంలో కథానాయికగా నటించింది చిత్రా శుక్ల. ఆ సినిమా కంటే ముందు శ్రీ విష్ణుతో 'మా అబ్బాయి' చేసింది. అది కూడా ఆశించిన విజయం సాధించలేదు. అయితే ఈ రెండు సినిమాల్లో ఆమె లుక్స్ పరంగా ఆకట్టుకోవడంతో ఈ ఛాన్స్ దక్కిందని కొంతమంది చెబుతున్నారు. అయితే ఆమెకు ఈ ఛాన్స్ ఇచ్చిన దర్శకుడు మరెవరో కాదు.. రీమేక్ చిత్రాల స్పెషలిస్ట్ భీమనేని శ్రీనివాసరావు. అల్లరి నరేష్, సునీల్ హీరోలుగా ఆయన తెరకెక్కిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్‌లో ముగ్గురు కథానాయికలకు చోటు ఉండగా.. వారిలో ఒకరిగా పూర్ణ నటిస్తుంటే... మరో నాయికగా నందిని రాయ్ ఎంపికైంది. తాజాగా మూడో నాయికగా చిత్రా శుక్లని ఎంచుకుంది చిత్ర బృందం. మరి ఈ చిత్రంతోనైనా చిత్ర దశ, దిశ మారుతుందేమో చూడాలి.

టీడీపీ ఉక్కిరిబిక్కిరి

- నేతలకు అర్థంకాని బీజేపీ వ్యూహం
- దుమ్మెత్తిపోస్తున్న కొందరు నేతలు
- తమకు మద్దతుగా మరో శిబిరం
- పార్లమెంటులో ఎంపీల తీవ్ర నిరసన
- జైట్లీ సమాధానం నైతిక విజయమేనా
- ఎన్నికల్లో పొత్తు ఉంటుందా.. లేదా
- చివరివరకు వేచి చూసే యోచన

(మనం- అమరావతి): కేంద్ర బడ్జెట్ అనంతర పరిణామాలలో బీజేపీ వ్యూహాన్ని అర్థం చేసుకోలేక టీడీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కొంతమంది నేతలు తమపై దుమ్మెత్తి పోయడం, మరికొందరు మాత్రం వీరతాళ్లు వేయడం చూస్తుంటే అసలేం చేయాలో.. ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అర్థం కాక తెలుగుదేశం అధిష్ఠానం తలపట్టుకుంటోంది. ఎన్టీఆర్ కుమార్తె, చంద్రబాబుకు బద్ధ వ్యతిరేకి అయిన పురందేశ్వరి టీడీపీ వ్యతిరేక శిబిరంలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడైన హరిబాబు, మరికొందరు మాత్రం చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవలి వరకు క్రియాశీల రాజకీయాల్లో ఉండి, ఇప్పుడు రాజ్యాంగ పదవిలో ఉన్నా తరచు ఆంధ్రప్రదేశ్ సందర్శనకు వస్తూనే ఉన్న వెంకయ్య నాయుడి ఆశీస్సులు సైతం చంద్రబాబు నాయుడికి ఉన్నాయని ప్రచారం ఉంది. కేంద్రబడ్జెట్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ పార్లమెంటులో తమ ఎంపీల నిరసనలు.. దానికి కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, పియూష్ గోయల్ సమాధానం ఇవ్వడంతో తాము విజయం సాధించామనే టీడీపీ భావిస్తోంది. పైగా ఈ అంశంపై ప్రతిపక్ష వైసీపీ గానీ.. ఇప్పుడిప్పుడే తెర్పెకి వస్తున్న జనసేన గానీ స్పందించకపోవడంతో మొత్తం మైలేజి తమకు మాత్రమే దక్కుతుందని సంబరపడుతోంది. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్వయంగా సమాధానం ఇవ్వడం తమ ఒత్తిడి ఫలితమేనని టీడీపీ ఎంపీలు చెబుతున్నారు.

వేచి చూసే ధోరణి

పోలవరం ప్రాజెక్టుకు బ్రేకులు పడినప్పుడు ఖిన్నుడైన చంద్రబాబు అదే వాతావరణం ఇప్పటికీ బీజేపీ నుంచి ఎదురవుతుండటంతో ఇటీవల ''వద్దనుకుంటే ఒక దండం పెట్టి వెళ్లిపోతాం'' అని వ్యాఖ్యానిస్తుండటం అంతిమపోరాటానికి సంసిద్ధమైనట్టుగానే కనిపిస్తోంది. కానీ టీడీపీ వర్గాలకు ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం మేరకు చంద్రబాబు బీజేపీ కూటమి నుంచి వైదొలగితే వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద ఉన్న కేసులన్నింటినీ క్లియర్ చేసి.. వైఎస్ఆర్‌సీపీతో పొత్తు పెట్టుకునేందుకు మోదీ-షా ద్వయం సిద్ధపడుతోందన్న సమాచారంతో చంద్రబాబు సైతం వేచి చూసే వైఖరినే అవలంబిస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడేవరకు ఇలాగే కొనసాగితే.. జగన్ మీద ఉన్న అవినీతి మరకలను బీజేపీ తన చేతులతో తుడిచేంత ధైర్యం చేయకపోవచ్చని చంద్రబాబు భావిస్తున్నట్లు ఎన్టీఆర్ భవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చంద్రబాబుతో పొత్తు ఉంటే ఆయన ఇచ్చినన్ని సీట్లు తీసుకోక తప్పదని.. అదే జగన్ అయితే తమ మాటకు ఎదురు చెప్పకపోవడంతో పాటు.. తమకు 'అన్నివిధాలుగా' సహకరిస్తారని బీజేపీలోని ఒక బలమైన వర్గం జగన్‌తో పొత్తుకు పార్టీ అగ్ర నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం ఉంది. పార్లమెంట్‌లో ఇలానే నిరసనలు కొనసాగిస్తూ ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం రోజున తటస్థ వైఖరిని అవలంభించాలనే ఎత్తుగడతో టీడీపీ ఉన్నట్లు చెబుతున్నారు. వీలైతే వాకౌట్ కూడా సంసిద్ధంగా ఉండేందుకు కూడా సంసిద్ధమవుతున్నారు.

చంద్రబాబు వ్యూహమేంటో

ఈ సంవత్సరాంతంలో 'జమిలి' ఎన్నికల ప్రచారం నేపథ్యంలో తాజాగా తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న వైఖరి రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు తెరతీసింది. ''రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేయండి.. అంతేతప్ప నియోజకవర్గాల పునర్విభజన ఊసే ఎత్తొద్దు'' అని చంద్రబాబు చేసిన దిశానిర్దేశం వెనుక పకడ్బందీ వ్యూహమే కనిపిస్తోంది. మీడియా, సోషల్ మీడియా ప్రభావంతో కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎలాంటి అదనపు సాయం అందలేదనే భావన ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో నెలకొంది. చంద్రబాబు కేంద్రంతో కఠినంగా వ్యవహరించలేకపోతున్నారనే విమర్శలు కూడా పలువర్గాల్లో ఏర్పడటంతో నష్టనివారణ చర్యలు చేపట్టిన చంద్రబాబు ఓ దశలో కేంద్రంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడ్డారు. తనపై ఎలాంటి కేసులు పెడతారో చూస్తా అన్నట్టుగా నర్మగర్భంగా వ్యాఖ్యానించటం ద్వారా బీజేపీ నాయకత్వానికి బాహాటంగా సవా లు విసిరారు. అకాలీదళ్, శివసేన మద్దతు.. ప్రత్యేకించి మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ కుమారుడు నరేష్ గుజ్రాల్ బహిరంగ మద్దతు కూడా చంద్రబాబుకు నైతికంగా బలం చేకూరేలా చేసింది.



ఉంచుతారా.. తెంచుతారా?

- ఎలాంటి స్పష్టత ఇవ్వని టీడీపీ- బీజేపీ
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న కమలం
- బాబు టార్గెట్‌గా వీర్రాజు వ్యాఖ్యలు
- అవినీతిపరుడంటూ తీవ్ర విమర్శలు
- ఆయనపై స్పందించద్దన్న చంద్రబాబు
- టీడీపీ కోర్టులోకి బంతినెట్టిన బీజేపీ
- పొత్తుపై వాళ్లతోనే చెప్పించే వ్యూహం

(మనం ప్రతినిధి, అమరావతి): బీజేపీ అధిష్ఠానం రాష్ట్రంలో ఒకవైపు టీడీపీ నేతలకు లాలిపాట పాడుతూ.. మరోవైపు గోల గోల చేస్తోంది. బడ్జెట్ అనంతర పరిణామాలలో భాగంగా టీడీపీ కేంద్రమంత్రులు రాజీనామా చేస్తారన, పొత్తు కటీఫ్ అని కథనాలు వచ్చినా.. బీజేపీ ప్రత్యక్షంగా పొత్తు ఉండాలని గానీ, టీడీపీ గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని గానీ తమ నాయకులకు చెప్పలేదు. ఈనెల ఒకటో తేదీన పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షాను కలిసినప్పుడు కూడా బీజేపీ నేతల్లోని రెండు వర్గాల వారికి టీడీపీతో సంబంధాలు కొనసాగించడం / తెంచుకోవడంపై ఎలాంటి సూచనలు అందలేదు. అయితే.. పార్టీని బలోపేతం చేసే విషయంలో మాత్రం ఎక్కడా రాజీ పడాల్సిన అవసరం లేదని మాత్రం స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. బహుశా అందుకేనేమో.. బీజేపీ ఫైర్‌బ్రాండ్ నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఒక అడుగు ముందుకేసి టీడీపీపై విరుచుకుపడుతున్నారు. ఏకంగా సీఎం చంద్రబాబునే ఆయన టార్గెట్ చేశారు. రెండెకరాల రైతు లక్షల కోట్లు ఎలా సంపాదించాడని కర్నూలులో ప్రశ్నించిన వీర్రాజు.. చంద్రబాబు అవినీతి గురించి చెప్పాల్సింది ఇంకా ఉందని రాజమండ్రిలో ముక్తాయింపు ఇచ్చారు. దీంతో తెలుగుదేశం నేతలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. వీర్రాజు దిష్టిబొమ్మల దహనం, ఆయన వైసీపీ ఏజెంటని ముద్రవేయడం లాంటివి జరుగుతున్నాయి. ఈలోపు స్వయంగా చంద్రబాబు తమ జిల్లాల నాయకులందరికీ సోము వీర్రాజు వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేదని.. ఆయన దిష్టిబొమ్మలు కూడా తగలబెట్టొద్దని చెప్పారు.

కానీ వీర్రాజు మాత్రం తన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని చెబుతున్నారు. సోము వీర్రాజు ఆషామాషీ నాయకుడేం కాదు. పార్టీ రాష్ట్ర నేతల్లో ముఖ్యుడు, ఎమ్మెల్సీ కూడా. ఎప్పటికప్పుడు పార్టీ గొంతును వినిపించడంతో పాటు.. కేంద్రం రాష్ట్రానికి అందిస్తున్న సహకారాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతుంటారు. ఒకవిధంగా చెప్పాలంటే.. ఆయన బీజేపీ అధిష్ఠానం సృష్టించిన పాత్ర. ఎప్పటికప్పుడు తన పాత్రను సమర్థంగా నిర్వహించడంలో ఆయన విజయం సాధించారు. ఇలాంటి నేపథ్యంలో సోము వీర్రాజు ఆరోపణలను కేవలం ఆయన వ్యక్తిగత వ్యాఖ్యలుగా మాత్రమే తీసుకోవడం అంటే.. అంతకు మించిన మూర్ఖత్వం మరొకటి ఉండదు.

బీజేపీ వ్యూహమేంటి..!

రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ అధిష్ఠానం రెండు ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. యథాతథంగా గతంలోలాగే టీడీపీతో పొత్తు పెట్టుకోవడం ఒకటి.. వైసీపీతో కలిసి 2019 ఎన్నికలకు వెళ్లడం మరొకటి. ఈ రెండింటి లాభనష్టాలపై అంచనాకు వచ్చి.. టీడీపీయే నిర్ణయం తీసుకునేలా బంతిని వారి కోర్టులోకి నెట్టేసే ప్రయత్నాలు బీజేపీ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఒకవేళ టీడీపీ తనంతట తానుగా పొత్తు రద్దు చేసుకుంటే.. వైసీపీతో బీజేపీ పొత్తు ఖాయమైనట్లే. అలా కాకుండా టీడీపీ పొత్తు కొనసాగించాలనుకుంటే ఎక్కువ సీట్లు డిమాండు చేయొచ్చు. అందుకే ఒకవైపు చంద్రబాబుతో సంధి చర్చలు జరుపుతూనే.. మరోవైపు వేడి తగ్గకుండా సోము వీర్రాజు, పురందేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణలను ఎగదోస్తూ వారితో వేడి పెంచుతోంది. పురందేశ్వరి సైతం తెలుగుదేశం పార్టీకి సాధికారికంగా సమాధానాలు చెప్పడానికే రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఉండటం, దానికి తోడు విద్యావంతురాలు కావడంతోపాటు స్వయానా ఎన్టీఆర్ కుమార్తె కావడంతో ఆమె చేసే వ్యాఖ్యలు సాధికారంగా ఉంటాయని చెబుతారు. చెప్పాల్సిందంతా చెబుతూనే ఎక్కడా టీడీపీ - చంద్రబాబు పేరు ఎత్తకపోవడం ఆమె ప్రత్యేకత.

ఠాక్రేకు ఫోన్‌పై సీరియస్

మహారాష్ట్రలో శివసేన-బీజేపీలకు అసలు పొసగటం లేదు. ఈ నేపథ్యంలో శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో చంద్రబాబు మాట్లాడారని ఒక ఇంగ్లీషు పత్రిక కథనం ప్రచురించింది. అదంతా అబద్ధమని టీడీపీ నేతలు చెబుతున్నా, బీజేపీ పెద్దలు మాత్రం దీన్ని తీవ్రంగానే పరిగణించినట్టు తెలిసింది. ఎప్పుడు ఏ అడుగు వేయాలో బాగా తెలిసిన చంద్రబాబుకు, వ్యూహరచనలో దిట్ట అయిన అమిత్ షా కు మధ్య జరుగుతున్న దోబూచులాట ఏ పరిణామాలకు దారితీస్తుందో వేచిచూడాలి.

బెయిల్ పొందిన నేరగాళ్లపై నిఘా

- జామీనుదారులపైనా ఓ కన్నేయండి
- నేర నియంత్రణపై దృష్టి: డీజీపీ
- ఏబీసీడీ, ఐపీఎస్ అవార్డుల ప్రదానం



అమరావతి, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో నేరాల కట్టడికి కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు నిరంతరం గట్టి నిఘా పెట్టాలని డీజీపీ ఎం.మాలకొండయ్య సూచించారు. ఇందులో భాగంగా బెయిలుపై విడుదలైన నేరస్థులు, పెరోలుపై ఉన్నవారిని ఎప్పుడూ ఓ కంట కనిపెట్టి ఉండాలని పేర్కొన్నారు. అలాగే నేరస్థులకు జామీనుదారులుగా ఉండే వారిపైనా నిఘా ఉంచాలని చెప్పారు. మంగళవారం మంగళగిరిలోని డీజీపీ క్యాంపు కార్యాలయంలో డీజీపీ అధ్యక్షతన పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఏబీసీడీ (అవార్డ్ ఆఫ్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్), ఐపీఎస్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ పోలీసు అధికారులు, సిబ్బందికి కీలక సూచనలు చేశారు. వివిధ కేసులలో నిందితులతో పాటు పాత నేరస్థులపైనా పోలీసులు పటిష్టమైన నిఘా ఉంచాలని చెప్పారు. ఆ నేరస్థులు తిరిగి నేరాలు చేయకుండా నియంత్రించాలన్నారు. నేరస్థలను పట్టుకోవటమే కాకుండా సరైన సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టడం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. వివిధ నేరాల సామాజిక కోణం గురించి ముందుగానే అంచనా వేసి సామాన్యులకు ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నేరస్థుల జియో ట్యాగింగ్ మరింత పటిష్టంగా అమలు చేయాలని డీజీపీ మాలకొండయ్య పేర్కొన్నారు.

4.4 కోట్లు కాదు.. 2 కోట్లే!

- ఎస్వీబీసీ నిధుల దుర్వినియోగం.. హైకోర్టులో ఒప్పుకొన్న సీఈవో

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (మనం లీగల్ ప్రతినిధి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న ఎస్వీబీసీ (శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్) నిధుల స్వాహా కేసులో ఆ చానల్ సీఈవో, పూర్వపు జర్నలిస్టు ఎ.వి.నర్సింహారావు హైకోర్టులో అడ్డంగా దొరికిపోయారు. పిటిషనర్ ఆరోపణల్లో ఉన్నట్లుగా రూ.4.4 కోట్లు దుర్వినియోగం కాలేదని, రూ.2.02 కోట్లేనని చెప్పుకొచ్చారు. అది కూడా ప్రోగ్రామ్‌కు చెందిన ఖర్చులో మాత్రమే జరిగిందని విజిలెన్స్ నివేదిక చెబుతోందని స్వయంగా సీఈవో తరపు న్యాయవాది సురేందర్‌రావు చెప్పారు. దాంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.2.02 కోట్లంటే మీరు తక్కువ మొత్తంగా భావిస్తున్నారా, దుర్వినియోగం జరిగిన మొత్తం ఎంతైనా అది నేరమే అవుతుందని చానల్ సీఈవోపై మండిపడింది. పిటిషనర్ కోర్టుకు రావడం వల్ల ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. టీటీడీ లాంటి సంస్థల్లో ఈ తరహా దుర్వినియోగం జరిగితే అది చిన్న మొత్తమేనని, పిటిషనర్ కక్ష పూరితంగా కేసు వేశారని చెప్పడం సబబు కాదని స్పష్టం చేసింది. సీఈవోపై వచ్చిన ఆరోపణలపై కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఏపీ సర్కార్‌తోపాటు టీటీడీని బెంచ్ ఆదేశించింది. నర్సింహారావు అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసినా ప్రభుత్వంగానీ, టీటీడీగానీ పట్టించుకోవడం లేదని, ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. మంగళవారం దీన్ని విచారించిన కోర్టు.. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవో, ఎస్వీబీసీ ఎండీలతోపాటు వ్యక్తిగత హోదాలో ఎస్వీబీసీ చానల్ సీఈవో నర్సింహారావులకు నోటీసులిచ్చింది. విచారణను రెండు వారాలపాటు వాయిదా వేసింది.

తుళ్లూరు భూ అక్రమాలు నిజమే

- కానీ తప్పులను వెంటనే గుర్తించాం
- ఆన్‌లైన్ రికార్డులలో సరిచేశాం
- సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్



విజయవాడ, ఫిబ్రవరి 6 (మనం న్యూస్ ప్రతినిధి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి కోసం చేపట్టిన భూ సమీకరణ రికార్డుల్లో అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనని సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. అయితే ఆన్‌లైన్ రికార్డుల్లో చోటుచేసుకున్న తప్పులను వెంటనే గుర్తించి సరిదిద్దామని ఆయన వివరించారు. మంగళవారం సీఆర్డీఏ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఆర్డీఏ పరిధిలోని తుళ్లూరు మండలం మందడం గ్రామంలో జరిగిన భూ కుంభకోణం అవకతవకలను ముందుగానే గుర్తించామని పేర్కొన్నారు. మందడం గ్రామంలో భూ సమీకరణకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియలో జరిగిన తప్పులను వెంటనే కనిపెట్టామన్నారు. భూమిలేని వ్యక్తి రాజధానికి ఎకరం జరీబు భూమిని ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి సొమ్ము చేసుకొన్న విషయాన్ని ఆన్‌లైన్ రికార్డుల పరిశీలనలో తేలిందని, వెంటనే దాన్ని సవరించామని వెల్లడించారు. కంప్యూటర్ ఆపరేటరే ఈ పనికి పాల్పడ్డాడని నిర్ధారించి, అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎకరం స్థలానికి సృష్టించిన నకిలీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశామన్నారు. ఇందులో ఇతర ఉద్యోగుల పాత్రపై దర్యాప్తు జరుగుతోందని, మరో మూడు రోజుల్లో దీనిపై నివేదిక రానుందని చెప్పారు. కాగా, భూ సమీకరణలో తమ పొలాలను ప్రభుత్వానికి ఇచ్చిన రైతులకు లా టరీ ద్వారా ప్లాట్లు కేటాయించినట్లు వివరించారు. 26 వేల మంది రైతుల సమక్షంలో లాటరీ తీశామని, ఇప్పటివరకు జరిగిన కేటాయింపుపై ఒక్క ఫిర్యాదు కూడా లేదని శ్రీధర్ పేర్కొన్నారు. సీఆర్డీఏ వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచామని, పారదర్శకంగా కేటాయింపులు జరుగుతున్నాయని చెప్పారు.

దళితుల అభ్యున్నతికి పెద్దపీట

- 3 ఏళ్లలో 28 వేల కోట్లు ఖర్చు: ఆనందబాబు



గుంటూరు, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): దళితులకు ఆర్థిక సహకారాన్ని అందించడమే టీడీపీ లక్ష్యమని, దళితుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పెద్దపీట వేస్తున్నారని మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్ వద్ద గుంటూరు, కృష్ణా, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల ఎస్సీ లబ్ధిదారులకు 51 కోట్ల రూపాయల కార్లు, ట్రాక్టర్లు, భూకొనుగోలు పథకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 13 జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళిత వర్గాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్సీ సబ్‌ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు వివరించారు. గత మూడున్నరేళ్లలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ. 28 వేలకోట్లు ఖర్చు చేశామన్నారు. అన్ని దళితవాడల్లో 5,300 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 1380 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ ఏడాది ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 2034 కోట్లు మేర రుణాలు మంజూరుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు.

పునర్విచారణ ప్రారంభం

- ఆయేషా మీరా హత్య కేసు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): సంచలనం సృష్టించిన బీ ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణ ప్రారంభమైంది. హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం సిట్ అధికారి, విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్ బృందం విచారణ ప్రారంభించింది. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని దుర్గా లేడీస్ హాస్టల్‌ను వారు పరిశీలించారు. సిట్ బృందంతో పాటు పోలీస్, రెవెన్యూ అధికారులు కేసు పూర్వాపరాలను మళ్లీ వెలికితీస్తున్నారు. 2007 డిసెంబరు 27న ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కాలేజీ బీ ఫార్మసి మొదటి సంవత్సరం విద్యార్థిని ఆయేషా మీరా దారుణ హత్యకు గురైంది. ఇబ్రహీంపట్నం -హైదరాబాదు రహదారిలో దుర్గా హాస్టల్‌లో ఉంటూ కాలేజీకి వెళ్లేది. ఈ కేసులో దోషిగా తేలిన కృష్ణా జిల్లా నందిగామ ప్రాంతానికి చెందిన సత్యం బాబుకు యావజ్జీవ శిక్ష పడింది. కాగా కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో సత్యంబాబు నిర్దోషిగా విడుదలయ్యాడు. అసలు నిందితులను పట్టుకోవాలంటూ కొందరు సామాజిక కార్యకర్తలు హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. పునర్విచారణ చేయాలని న్యాయస్థానం ఆశ్రయించింది. దీంతో విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

మా సమస్యలు పట్టవా?

- అర్చక సిబ్బంది ఆవేదన.. శాంతియుత నిరసన



విజయవాడ, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): కనీస వేతనాలు లభించక తాము ఎన్నో అగచాట్లకు గురవుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థల వేతన అర్చక, ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ మంగళవారం విజయవాడలో శాంతియుత నిరసనకు దిగింది. ఆలయ అర్చకులు, దేవాలయ నిర్వాహక సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కమిటి రాష్ట్ర కన్వీనర్ విత్తనాల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2015 పీఆర్‌సీ స్కేల్ ప్రకారం వేతనం చెల్లించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. 1997లో సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రభుత్వం తమ జీత భత్యాల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని వీరు కోరుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలను గత నవంబర్‌లో సీఎంవోలోని అధికారులతో చర్చలు జరుపగా, తమ సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగానే ఉన్నప్పటికీ, దేవాదాయ శాఖ అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తూ తాత్సారం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన అర్చకులు, సిబ్బందితో పాటు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కృష్ణాజిల్లా కన్వీనర్ బీవీ రమణరావు, అర్చక వేదిక జిల్లా కన్వీనర్ అక్షయ లింగ శర్మ, సిబ్బంది విభాగం రాష్ట్ర అధ్యక్షులు పగడాల శివ మోహన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.


2 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం

- నెల్లూరులో నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

ఉదయగిరి, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి మండలం కొత్తపల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు దాడులు చేసి నలుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసి, దాదాపు రూ. 2 కోట్లు విలువైన 88 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి స్విఫ్ట్ కారు, రెండు బైకులు, 6 సెల్‌ఫోన్లు, రూ. 3,150 నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగల బరువు 2,010 కిలోలు ఉంటుంది. పోలీసులు స్మగ్లర్లను పట్టుకోవడానికి ప్రయత్నించగా.. వాహనంతో ఢీకొట్టించబోయి కర్రలు, రాళ్లతో ఎదురుదాడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

విజిలెన్స్ నివేదిక ఇవ్వండి

- తిరుమలలో వ్యాపారాలపై టీటీడీకి హైకోర్టు ఆదేశం




తిరుమల కొండపై వ్యాపారులు చట్ట ప్రకారం వ్యవహరిస్తున్నారో లేదో, విజిలెన్స్ తనిఖీల్లో ఏయే విషయాలు తెలిశాయో వివరించాలని టీటీడీని హైకోర్టు ఆదేశించింది. తిరుమల కొండపై వ్యాపారులు, హోటల్స్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారని, బిల్లులు కూడా ఇవ్వడం లేదని పేర్కొంటూ చిత్తూరు నుంచి పరిహార సేవా సమితి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం కోర్టు మరోసారి విచారణ జరిపింది. లీజు పూర్తయినా కొంత మంది వ్యాపారాలను టీటీడీ అధికారులు కొనసాగిస్తూ వారికి మద్దతు ఇస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని బెంచ్ టీటీడీని బెంచ్ ప్రశ్నించగా జరిమానా సొమ్ము వసూలు కోసమే ఓ హోటల్‌ను గడువు ముగిసినా కొనసాగిస్తున్నామని తెలిపింది. అధిక ధర, బిల్లులు ఇవ్వకపోవడంపై కొండకు వచ్చే భక్తులు చేసే ఫిర్యాదులను నమోదు చేసేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను త్వరలో వినియోగంలోకి తెస్తామని టీటీడీ లాయర్ చెప్పారు. ఈ వివరాలను పరిశీలించిన ధర్మాసనం విచారణను రెండు వారాలు వాయిదా వేసింది.

విశాఖ ఉక్కుపీఠంపై 'సిటు'

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్ బ్యూరో): ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కు కర్మాగారం గుర్తింపు కార్మిక సంఘంగా సిటు ఎన్నికైంది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో సిటు 198 ఓట్ల తేడాతో ఇంటక్‌పై విజయం సాధించింది. మొత్తం 11,544 ఓట్లకు గాను 11,103 మంది ఓటింగ్‌కు హాజరయ్యారు. 13 కార్మిక సంఘాలు పోటీ చేయగా స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిటు) 3784 ఓట్లు సాధించింది. విశాఖ స్టీల్ ఎంప్లాయీస్ కాంగ్రెస్ (ఇంటక్) 3586 ఓట్లతో ద్వితీయ స్థానంలో, విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 3234 ఓట్లతో మూడో స్థానంలో నిలిచాయి.

ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత శివప్రసాద్ మృతి



విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్ బ్యూరో): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ (అధ్యక్షుడు) కార్యవాహ్ (కార్యదర్శి)గా పనిచేసిన సీనియర్ నేత, ఆంధ్రా విశ్వవిద్యాయలం విశ్రాంత సంస్కృత ఆచార్యులు దెందులూరి శివప్రసాద్ (83) మరణించారు. మంగళవారం విశాఖలో ఆయన గుండెపోటుతో మృతి చెందారు. 1935లో జన్మించిన శివప్రసాద్ 1955 నుంచి ఆర్ఎస్ఎస్‌లో చురుగ్గా పనిచేశారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు అయిన ఆయన 19 నెలలు జైలులో గడిపారు. విశాఖలోని ప్రతిష్టాత్మక బీవీకే పాఠశాలల స్థాపనలో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల విశాఖ ఎంపీ హరిబాబు, బీజేపీ సీనియర్ నేత పీపీ చలపతిరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నౌక విడుదల.. సెయిలర్లు క్షేమం

- నౌకలో విశాఖ వాసి సతీశ్ కూడా

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్ బ్యూరో): దక్షిణాఫ్రికా బెనిన్ తీరం నుంచి బయలుదేరి.. వారం రోజుల క్రితం అదృశ్యమైన నౌకను హైజాకర్లు విడిచిపెట్టారు. ఇందులో సెయిలర్‌గా పనిచేస్తున్న విశాఖకు చెందిన సతీశ్ క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందింది. విశాఖ ఎంపీ హరిబాబు చొరవతో విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ నౌక ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నించడంతో ఫలితాన్నిచ్చింది. మంగళవారం ఉదయం హైజాకర్లు నౌకను విడిచిపెట్టారని సుష్మా స్వరాజ్ ట్విటర్ ద్వారా సమాచారం అందించారు. సాయంత్రానికి నౌక క్షేమంగా సమీపంలోని పోర్టుకు చేరుకొంది. 52 కోట్ల రూపాయల విలువచేసే 13,550 టన్నుల గ్యాసోలిన్‌తో బయలుదేరిన నౌక జనవరి 31వ తేదీన హైజాక్‌కు గురైంది. ఇందులో 22 మంది భారతీయ సెయిలర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆగని డీసీఐ ప్రైవేటీకరణ

- వాటాల విక్రయానికి కేంద్రం ఆమోదం

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్ బ్యూరో): విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)ను ప్రైవేటీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. డీసీఐలోని 73.47% ప్రభుత్వ వాటాలను విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్రానికి చెందిన ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా పార్లమెంటులో షిప్పింగ్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని వెల్లడించారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు డీసీఐలో వాటాలను విక్రయిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇటీవల డీసీఐ లాభాలు బాగా తగ్గడంతో దాన్ని ప్రైవేటీకరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం నిరుడు మార్చిలో ప్రకటించింది. అప్పటి నుంచి డీసీఐ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. తాజా ప్రకటనతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

పడి లేచిన సూచీలు

సెన్సెక్స్ భారీ పతనాన్ని చూసినా.. తర్వాత కాస్త తెప్పరిల్లింది, నిఫ్టీదీ అదే పరిస్థితి



ముంబయి: అంతర్జాతీయ మార్కెట్ల పతన ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపైన కూడా చూపించింది. బొంబాయి స్టాక్ ఎక్చేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి మంగళవారం 561.22 పాయింట్లు కోల్పోయి గత నెల రోజుల్లో ఎన్నడూ ఎరుగనంత కనిష్ఠ స్థాయిలో 34,195.94 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ ఏడాది జనవరి 5న అది 34,153.85 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ తిరిగి అంత బలహీన స్థితిలో ముగియడం ఇదే మొదటిసారి. నేషనల్ స్టాక్ ఎక్చేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి నిఫ్టీ కూడా 168.30 పాయింట్లు కోల్పోయి 10,498.25 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ జనవరి 3న 10,443.20 పాయింట్ల వద్ద ముగిసింది. మంగళవారం నిఫ్టీ ఇంచుమించుగా తిరిగి అంతే కనిష్ఠ స్థాయిలో ముగిసింది.

నిజానికి, సెన్సెక్స్ ఇంట్రా-డే లో చూసిన 33,482.81 పాయింట్ల, నిఫ్టీ 10,276.30 పాయింట్ల పతన స్థితుల నుంచి కోలుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్ స్థితిని ప్రభుత్వం పట్టించుకుంటుందని ఆర్థిక శాఖ కార్యదర్శి హాస్ముఖ్ అధియా ప్రకటించిన తర్వాత, మార్కెట్లు కుప్పకూలిన స్థితి నుంచి కాస్త తెప్పరిల్లాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) రేపు పరపతి విధా న సమీక్షా సమావేశం జరుపనుంది. లిక్విడిటీని తగ్గించేట్లుగా అది నిర్ణయం తీసుకోవచ్చనే భయాలు దేశీయ సెంటిమెంట్‌ను నీరుగార్చాయి. తాత్కాలి డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐ) రూ. 1263.57 కోట్ల విలువ చేసే షేర్లు విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 1163.64 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేశాయి.

ఎదురీదిన కంపెనీలు



మార్కెట్ల పతనం ఒకపక్క కొనసాగుతూండగా, కొన్ని కంపెనీల షేర్ల ధరలు పెరిగాయి. 30కి పైగా కంపెనీల షేర్ల ధరలు గత 52 వారాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. భారతి ఎయిర్‌టెల్, టాటా స్టీల్ వంటి బ్లూచిప్‌ల షేర్ల ధరల్లో పెరుగుదల విస్తృతంగా చూస్తే మార్కెట్ పతనాన్ని కొంత వరకన్నా నిరోధించగలిగాయి. బుధవారం లావాదేవీలు మొదలవడంతోనే, సెన్సెక్స్ సుమారు 1275 పాయింట్లు కోల్పోయి 34,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రపంచ మార్కెట్లలో సాగిన అమ్మకాలు దానికి ప్రధాన కారణం. అయితే, మంగళవారం ఇక కొద్ది గంటల్లో ట్రేడింగ్ ముగుస్తుందనగా, మార్కెట్లు మళ్ళీ ఊపిరి పోసుకున్నాయి. సూచీలు కోల్పోయిన పట్టును తిరిగి కొంత సంపాదించుకోగలిగాయి. పోలారిస్ కన్సల్టింగ్ అండ్ సర్వీసెస్‌తో సహా దాదాపు 32 కంపెనీల షేర్ల ధరలు 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. సెన్సెక్స్ లోని 30 కంపెనీల్లో నాలుగు (టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, లార్సెన్ అండ్ టూబ్రో, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్) సంస్థల షేర్లలో పెరిగిన స్థితిలో లావాదేవీలు సాగాయి.

కనిష్ఠ స్థితిలో 200 స్టాక్‌లు

మరోపక్క, బి.ఎస్.ఇలో 200 లకు పైగా కంపెనీల షేర్ల ధరలు గత 52 వారాల్లో ఎన్నడూ ఎరుగనంత కనిష్ఠ స్థాయిలకు పడిపోయాయి.

రూ. 9.6 లక్షల కోట్లు హుష్‌కాకి

స్టాక్ మార్కెట్లలో రక్తపాతం మదుపరుల సంపదను మూడు రోజుల్లో రూ. 9.6 లక్షల కోట్ల మేరకు తుడిచిపెట్టేసింది.

పెరిగిన పన్ను చెల్లింపుదార్లు


న్యూఢిల్లీ: పెద్ద సంఖ్యలో పన్ను చెల్లింపుదార్లను వ్యవస్థలోకి తీసుకొచ్చామని, దీంతో వారి మొత్తం సంఖ్య 8 కోట్లకు చేరిందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సి.బి.డి.టి) చైర్మన్ సుశీల్ చంద్ర వెల్లడించారు. ప్రత్యక్ష పన్నుల సంస్కరణలను ప్రభుత్వం పటిష్ఠపరచిందని ఆయన మాటల ఆంతర్యంగా భావించాల్సి ఉంటుంది. ఏ ఆదాయ పన్ను అధికారి తన విచక్షణ మేరకు కేసును చేపట్టడానికి వీలు లేదని, మొత్తం కేసులలో 0.5 శాతం కేసులను మాత్రమే పరిశీలనకు ఆదాయ పన్ను శాఖ చేపడుతుందని సుశీల్ తెలిపారు. ''ప్రత్యక్ష పన్నుల్లో, చాలా సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రత్యక్ష పన్నుల సంస్కరణలను మేం ఏకీకృతం చేశాం. పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరిగింది'' అని ఆయన అసోచామ్ ఇక్కడ మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వెల్లడించారు. పన్ను అధికారికి, అస్సెసీలకు మధ్య మధ్యవర్తిత్వాన్ని ఆదాయ పన్ను శాఖ తగ్గిస్తోందని ఆయన తెలిపారు. ''ఏ ఆదాయ పన్ను అధికారీ అతను లేదా ఆమె విచక్షణ మేరకు కేసులను చేపట్టడానికి లేదు. సి.బి.డి.టి చైర్మన్‌గా నేను కూడా నా విచక్షణ ఉపయోగించి ఏ కేసునూ చేపట్టడానికి లేదు'' అని సుశీల్ అన్నారు. ఆదాయ పన్ను ఫారాల ఎలక్ట్రానిక్ అస్సెస్‌మెంట్‌ను ఆదాయ పన్ను శాఖ 2017 సెప్టెంబర్‌లో ప్రారంభించిందని, ఇంతవరకు ఈ-అస్సెస్‌మెంట్ ద్వారా 60,000 కేసులు పరిశీలించారని ఆయన చెప్పారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వద్ద 15 లక్షల కంపెనీలు నమోదు కాగా, కేవలం 7 లక్షల కంపెనీలు మాత్రమే పన్ను రిటర్నుల ఫారాలు దాఖలు చేస్తున్నాయని సుశీల్ అన్నారు. ప్రభుత్వం 2018-19 కేంద్ర బడ్జెట్‌లో 45 వస్తువులపై కస్టమ్స్ సుంకాన్ని పెంచిందని, 5 వస్తువులపై తగ్గించిందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారి వనజ ఎన్. శర్మ చెప్పారు. ''ఆ నిర్ణయానికి ఇది సరైన సమయం. ఎందుకంటే, ఆ వస్తువులన్నింటినీ భారతదేశంలోనే అద్భుతంగా తయారు చేసుకోవచ్చు. వాటిలో చాలా భాగం వస్తువులు మధ్య, చిన్న, సూక్ష్మ తరహా సంస్థలకు సంబంధించినవి'' అని ఆమె అన్నారు.

పసిడి ధర పైపైకి



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో ఈక్విటీల ధరలు ఘోరంగా పతనమవడంతో, పసిడి ధర పది గ్రాములు రూ. 31,600లకు పెరిగింది. ఇది గత 14 నెలల్లో దానికి గరిష్ఠ స్థాయి. పెళ్ళిళ్ళ సీజన్ డిమాండ్‌ను తట్టుకునేందుకు స్థానిక నగల వ్యాపారుల నుంచి కూడా గట్టి డిమాండ్ ఉండడంతో బంగారం ధర పెరిగింది. వెండి ధర కూడా కిలో రూ. 40,000లకు తిరిగి చేరుకుంది. పరిశ్రమలు వెండి కొనుగోళ్ళు ఎక్కువగా జరపడం దాని ధర పెరగడానికి కారణమని చెబుతున్నారు. స్టాక్ మార్కెట్ల పతనంతో మదుపరులకు బంగారం సురక్షితమైన మదుపు మార్గంగా తోచింది.

సెన్సెక్స్ | ఫిబ్రవరి 2018 | 6




పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	0.06	టాటా మోటార్స్	-5.45
		టీసీఎస్	-3.58
		కోటక్ బ్యాంకు	-2.70
		హీరో మోటార్	-2.69
		ఇన్ఫోసిస్	-2.62

నిఫ్టీ | ఫిబ్రవరి 2018 | 6





పెరిగినవి	%	తగ్గినవి	%
బజాజ్ ఫైనాన్స్	3.56	లుపిన్	-5.68
ఐసీఐసీఐ బ్యాంకు	0.30	టాటా మోటార్స్	-5.14
ఐషర్	0.15	హెచ్‌సీఎల్ టెక్	-3.96
టాటా స్టీల్	0.07	టెక్ మహీంద్రా	-3.55
		టీసీఎస్	-3.41

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్





ఆధారం: వరల్డ్ గోల్డ్ కౌన్సిల్

బొగ్గు ఉత్పత్తిపై సందేహాలు

కోల్‌కతా: విద్యుచ్ఛక్తి డిమాండ్‌లో వృద్ధి అకస్మాత్తుగా పెరగడం, కోల్ ఇండియా నుంచి బొగ్గు ఉత్పత్తి పేలవంగా ఉండడం ఇంధన సంక్షోభాన్ని తీవ్రతరం చేయగల అవకాశం ఉంది. విదేశీ మార్కెట్లలో బొగ్గు ధరలు మండిపోతున్నాయి. దిగుమతి చేసుకునే బొగ్గుపై ఆధారపడిన జెన్‌కోలు నిశ్చలంగా ఉన్నాయి. సాధారణంగా శీతాకాలంలో అత్యధికంగా ఉండే కోల్ ఇండియా బొగ్గు ఉత్పత్తి అంతంతమాత్రంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. థర్మల్ విద్యుచ్ఛక్తికి అనూహ్యంగా పెరిగిన డిమాండ్ 2017 జూలైలో విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించింది. డాటా కొరవడడం వల్ల, మొదట్లో దానికి జల విద్యుదుత్పాదన తగ్గడం కారణమనుకున్నారు. కేంద్రం రెండు పథకాల ద్వారా గ్రామీణ విద్యుదీకరణను ప్రోత్సహిస్తున్నందు వల్ల డిమాండ్ బాగా పెరగడం కూడా దానికి కారణం అను




కున్నారు. ఒక్కసారిగా, బొగ్గుకు డిమాండ్ ఏర్పడడంతో కోల్ ఇండియా సతమతమైంది. అప్పటికి దాదాపు రెండేళ్ళుగా మందగొడిగా ఉన్న డిమాండ్ వల్ల అది బొగ్గు ఉత్పత్తికి కోత విధించుకునే ప్రక్రియలో ఉంది. డిమాండ్ సాధారణంగా ఉండడం, గత రెండేళ్ళలో అవసరానికి మించిన ఉత్పత్తి వల్ల బొగ్గు నిల్వలు 6 కోట్ల 80 లక్షల టన్నులకు చేరుకున్నాయి. మెరుగుపడిన రైల్వే రవాణా ద్వారా కోల్ ఇండియా ఆ నిల్వలను అవసరం ఉన్న చోటుకు తరలించగలిగింది. క్రమంగా సరఫరాలు మెరుగుపడుతూ వచ్చాయి. డిసెంబర్ నెలాఖరు నాటికి విద్యుదుత్పాదన కేంద్రాల వద్ద ఐదు నుంచి తొమ్మి ది రోజులకు సరిపడ బొగ్గు నిల్వలు ఉన్నాయి. బొగ్గు నిల్వలు తగినంతగా లేని స్థితిలో ఉన్న విద్యుదుత్పాదన కేంద్రాల సంఖ్య ఐదు నెలల్లో 29 నుంచి 12కు తగ్గింది. విద్యుత్తుకే కాకుండా, ఉక్కు, సిమెంటు రంగాలకు కూడా బొగ్గు సరఫరాలు పెరిగాయి. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో బొగ్గు ఉత్పత్తిలో వృద్ధి నమోదైంది. ఆ తర్వాత, కోల్ ఇండియాకు అనుబంధ సంస్థలైన సి.సి.ఎల్, బి.సి.సి.ఎల్.ల బొగ్గు ఉత్పత్తి 11 నుంచి 13 శాతం క్షీణించింది. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి నెలకు సగటున 5 కోట్ల 30 లక్షల టన్నులుగా ఉంది. కాగా, విద్యుచ్ఛక్తికి డిమాండ్ గత జూలై నెలలోనే 5.8 శాతం పెరిగింది. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్‌లు ప్రధాన విద్యుత్ కొనుగోలు రాష్ట్రాలుగా ఉన్నాయి. ఫిబ్రవరి 1 నాటికి 21 విద్యుదుత్పాదన కేంద్రాల వద్ద తొమ్మిది రోజులకు సరిపడ బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా మందగించిన పసిడి గిరాకీ



ముంబయి: ఎక్చేంజ్-ట్రేడెడ్ ఫండ్ల (ఇ.టి.ఎఫ్)లోకి నిధుల ప్రవాహం తక్కువగా ఉండడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా పసిడి డిమాండ్ 2016తో పోలిస్తే 7 శాతం తగ్గి, 2017లో 4,071.7 టన్నులకు తగ్గిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యు.జి.సి) నివేదిక ఒకటి వెల్లడించింది. 2016లో మొత్తంమీద డిమాండ్ 4,362 టన్నుల మేరకు ఉందని పసిడి డిమాండ్ ధోరణుల తాజా నివేదిక వెల్లడించింది. ఇ.టి.ఎఫ్‌లలోకి 2017 పొడవునా నిధుల రాక నిలకడగా కొనసాగినప్పటికీ, అది 202.8 టన్నుల మేరకే ఉందని కౌన్సిల్ తెలిపింది. అసాధారణమైన స్థాయిలో 2016లో వచ్చిపడిన స్థాయిలతో పోలిస్తే అది మూడింట ఒకటో వంతు కింద మాత్రమే లెక్కకు వస్తుందని చెప్పింది. అలాగే, అమెరికా రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ తీవ్రంగా పడిపోవడంతో 2017లో పొడుగూతా బంగారు బిస్కట్లు, నాణాల డిమాండ్ 2 శాతం తరుగుదలను చవి చూసింది. కేంద్ర బ్యాంక్ నుంచి ఉన్న డిమాండ్ కూడా 2017లో 5 శాతం తగ్గింది. ఆ డిమాండ్ 2016లో 390 టన్నులకు ఉండగా, 2017లో 371 టన్నులకు తగ్గింది. పసిడి ప్రధాన కొనుగోలుదార్లలో రష్యా, కజాఖ్‌స్తాన్‌ల సరసన టర్కీ చేరింది. బిస్కట్ల రూపంలో ఇన్వెస్ట్‌మెంట్ స్థూలంగా చూస్తే నిలకడగా ఉండగా, నాణాల ఇన్వెస్ట్‌మెంట్ 10 శాతం తగ్గింది. మొత్తంమీద, బిస్కట్, నాణాల డిమాండ్ 2 శాతం తరుగుదలను చవి చూసింది. అమెరికా రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ 2016లో 1048.7 టన్నులు ఉన్నది 2017లో 1029.2 టన్నులకు తగ్గింది. నగలు, టెక్నాలజీతో తయారయ్యే వస్తువుల డిమాండ్ 2017లో రికవరయింది. ఇండియా, చైనాలలో ఆర్థిక పరిస్థితులు మెరుగుపడడం దానికి ప్రధాన కారణం. స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లు వంటి వస్తువులలో పసిడితో కూడిన చిప్‌లు ఉంటాయి. ఆభరణాల మొత్తం డిమాండ్ 2016లో ఉన్న 2,054 టన్నుల నుంచి 2017లో 4 శాతం (82 టన్నులు) పెరిగి 2,136 టన్నులకు చేరుకుంది. ''ద్రవ్య విధానాన్ని కట్టుదిట్టం చేయడం, 2017లో పటిష్ఠంగా ఉన్న ఈక్విటీ మార్కెట్ల నేపథ్యంలో మొత్తంమీద పసిడి డిమాండ్ తగ్గడం ఆశ్చర్యం కలిగించదు. అంతమాత్రాన మార్కెట్ స్థితి సరిగ్గా లేదని అర్థం కాదు. అమెరికా డాలర్లలో పసిడి ధర 13 శాతం పెరిగింది. సంస్థాపరమైన మదుపరులు క్షీణిస్తున్న ఆస్తుల ధరలు, భౌగోళిక, రాజకీయ అస్థిరతల నుంచి రక్షణకు తమ పోర్ట్‌ఫోలియోలకు పసిడిని జోడించుకోవడం ప్రారంభించారు'' అని డబ్ల్యు.జి.సి. మార్కెట్ ఇంటెలిజెన్స్ అధిపతి అలీస్టైర్ హెవిట్ చెప్పారు. గనుల నుంచి పసిడి ఉత్పత్తి 2017లో రికార్డు స్థాయిలో 3,269 టన్నులకు పెరిగింది. రీసైక్లింగ్ 10 శాతం తగ్గింది. మొత్తంమీద సరఫరాలో 4 శాతం కొరతకు దారితీసింది. పసిడి సరఫరా 2016లో 4,591 టన్నుల మేరకు ఉండగా, అది 2017లో 4,398 టన్నులకు తగ్గింది.

'కార్పొరేట్ పన్నును తగ్గించాల్సింది'



ముంబయి: భారతీయ కంపెనీలు చెల్లిస్తున్న అధిక పన్ను అంతర్జాతీయంగా అవి ఎక్కువ పోటీ ఇవ్వలేనివిగా తయారు చేస్తోందని జేఎస్ డబ్ల్యు గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. కార్పొరేట్ ఆదాయ పన్ను రేటును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి ఉండవలసిందని ఆయన సోమవారం ఇక్కడ బడ్జెట్‌ను విశ్లేషిస్తూ చెప్పారు. అంతర్జాతీయంగా అత్యధిక పన్ను రేట్లు ఉన్న దేశాలలో ఇండియా ఒకటిగా ఉందని భారీ కంపెనీలు హెచ్చు పన్నులు చెల్లిస్తూ, అంతర్జాతీయంగా ఎక్కువ పోటీ ఇవ్వలేకపోతున్నాయని ఆయన అన్నారు. సెక్యూరిటీల లావాదేవీ పన్నును తొలగించకుండా, కాస్ట్ ఇండెక్సేషన్ ప్రయోజనం కల్పించకుండా అమలులోకి తేవాలని భావిస్తున్న దీర్ఘకాల మూలధన లాభ పన్నును ప్రవేశపెట్టే అంశాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించుకోవాలని ఆయన కోరారు. ఇది దీర్ఘకాల ఇన్వెస్టర్లకు భారతీయ ఈక్విటీల పట్ల ఉన్న ఆకర్షణీయతను తగ్గిస్తుందని జిందాల్ అన్నారు. ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రతలకు కేటాయించిన (క్రితంసారికన్నా 13 శాతం ఎక్కువగా) రూ. 1.38 లక్షల కోట్లు , మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయించిన (కడపటిసారికన్నా 20 శాతం ఎక్కువగా) రూ. 5.97 లక్షల కోట్లు భారత పౌరుల జీవన పరిస్థితులను మెరుగుపరచగలవని ఆయన చెప్పారు. మొత్తంమీద, దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు గ్రామీణ భారతావనికి బడ్జెట్ భారీగా రూ. 14.34 లక్షల కోట్లు కేటాయించిందని ఆయన అన్నారు. జి.డి.పి వృద్ధిలో నిలకడగా 8 శాతం పైన వృద్ధిని సాధించాలంటే, ఎగుమతులు చాలా ముఖ్యమని, ఎందుకంటే, భారతీయ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ వినిమయంతో నడిచేదిగా లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం 3 వేల కోట్ల డాలర్లుగా ఉన్న వ్యవసాయ ఎగుమతులకు, వెయ్యి కోట్ల డాలర్ల ఎగుమతి సామర్థ్యం ఉందని ప్రభుత్వ అంచనా. వ్యవసాయ ఎగుమతులను సరళీకరించడం ద్వారా అది అందుకు రోడ్ మ్యాప్‌ను సృష్టించింది.

పతనానికి పురికొల్పిన అంశాలు



ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్చేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ శుక్రవారం 800 పాయింట్లకు పైగా పతనమైనప్పుడు కేంద్ర బడ్జెట్‌లో దీర్ఘ కాల మూలధన లాభ పన్నును తిరిగి ప్రవేశపెట్టడాన్ని దానికి ప్రధాన కారణంగా చెప్పారు. కానీ, ఆ వెనువెంటనే, అమెరికా మార్కెట్‌లో శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లు ఉలిక్కిపడేంత పతనం చోటు చేసుకుంది. డౌజోన్స్ 666 పాయింట్లు క్షీణించింది. అనంతరం సోమవారంనాడు డౌ ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తూ 1175 పాయింట్లు కోల్పోయింది. శాతం లెక్కన చూస్తే 4 శాతం తరుగుదల అధ్వానం కాకపోయినప్పటికీ, ఇంత పెద్ద సంఖ్యలో పాయింట్లు కోల్పోవడం మాత్రం చాలా అరుదు. అమెరికాలో మార్కెట్ల పతనంతో ఇంతకాలం తెరవెనుకనున్న బేర్లు ఒక్కసారిగా రంగంపైకి వచ్చి మంగళవారంనాడు ప్రపంచ మార్కెట్లు రక్తమోడేట్లు చేశారు. భారతదేశంలో కూడా స్టాక్ మార్కెట్లు తీవ్ర నష్టాలను చవిచూశాయి. ట్రేడర్లు భయోత్పాతానికి లోను కావడంతో వోలాటిలిటీ ఇండెక్స్ (వి.ఐ.ఎక్స్) 50 శాతం పెరిగింది. సురక్షితమైనదిగా పేరుండడం వల్ల యెన్ మాత్రం పెరిగింది. ఆసియాలో మిగిలిన మార్కెట్లన్నీ దాదాపు 3-4 శాతం నష్టపోయాయి. ఒక్కసారిగా మార్కెట్లు ఇలా కుప్పకూలడానికి కారణం ఏమిటి?

అమెరికా బాండ్ ప్రతిఫలం

అమెరికాలో షేర్ల ధరలు అవిశ్రాంతంగా పెరుగుతూపోవడానికి గల కారణాలలో ఒక కారణం అక్కడ బాండ్లపై లభించే ప్రతిఫలాలు తక్కువగా ఉండడం. దాంతో సాపేక్షంగా చూస్తే, మదుపరులకు షేర్లు మరింత ఆకర్షణీయమైనవిగా మారాయి. కానీ, షేర్లలో మదుపు చేయడం ఎక్కువ రిస్కుతో కూడుకున్నది కావడంతో, బాండ్ల నుంచి లభించే ప్రతిఫలాలు పెరగగానే మదుపరులు షేర్లను అమ్మేసి, ఆ నగదును తెచ్చి బాండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అమెరికా బాండ్లపై లభించే ప్రతిఫలాలు శుక్రవారంనాడు గత నాలుగేళ్ళలో ఎన్నడూ లేనంత శిఖర స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల ట్రంప్ ప్రభుత్వ పన్ను బిల్లు అమెరికా ప్రభుత్వం హెచ్చు రుణాలకు వెళ్ళడానికి దారితీస్తుందని అందరి అంచనా. అంటే, బాండ్ల సరఫరా మరింత పెరుగుతుంది. అమెరికా 10 ఏళ్ళ బాండ్ ప్రతిఫలం 2017 సెప్టెంబర్‌లో 2.1 శాతంగా ఉన్నది ఈ నెలలో 2.8 శాతానికి పెరిగింది.

కేంద్ర బ్యాంక్‌లు నగదును బిగించేయడం

ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు 2017లో నిర్విరామంగా పరుగులు తీశాయి. అడ్డు అదుపు లేకుండా షేర్ల ధరలు పెరుగుతూరావడానికి ప్రాథమిక కారణం గ్లోబల్ లిక్విడిటీ. కానీ, యూరోపియన్ యూనియన్, అమెరికాలలో వృద్ధి పుంజుకోవడంతో ఫెడ్‌తో సహా కేంద్ర బ్యాంకులన్నీ మార్కెట్లలోకి నిధులు ప్రవహించడానికి సంబంధించినంతవరకు లాకుల గేట్లు ఎత్తేశాయి. చేతులో డబ్బులు ఆడడంతో అందరూ షేర్లు కొన్నారు. తర్వాత, ఫెడ్ రేట్లను పెంచడం ప్రారంభించింది. పరిమాణాత్మక వెసులుబాటులో భాగంగా తాను కొన్న బాండ్లను తిరిగి అమ్మేసేందుకు ఫెడ్ స్పష్టమైన ప్రణాళికను నిర్దేశించుకుంది. ఈ చర్యలు ద్రవ్యతను మరింత తగ్గించాయి. ఇవన్నీ ప్రధాన ఆందోళనకర అంశాలు కాగా, మార్కెట్లు వాటిని పరిగణించకుండా వ్యవహరిస్తూ వచ్చాయి. ఆ అంశాలను లెక్కలోకి తీసుకునే షేర్ల ధరలు పెరిగాయనే భావన నెలకొంది. కానీ, లిక్విడిటీ తగ్గితే ఏదో ఒక దశలో మార్కెట్ల కాళ్ళ కింద నుంచి చాపను లాగేసినట్లు అవుతుందని ఊహించిందే.

ఫండమెంటల్స్ మించి పెరిగిన షేర్ల ధరలు

ప్రస్తుతం స్టాక్ మార్కెట్లను అస్థిరపరచిన మరో అంశం మితిమీరిన స్పెక్యులేషన్. అమెరికాలో షేర్ల ధరలు వాటి ఫండమెంటల్ విలువను మించి పెరిగిపోయాయి. స్టాండర్డ్ అండ్ పూర్ 500 సూచి ప్రస్తుత (ప్రైస్ ఎర్నింగ్) పి.ఇ. నిష్పత్తి గత 8 ఏళ్ళలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉంది. గత ఏడాది మార్కెట్లలో సర్దుబాటు చోటుచేసుకున్న సందర్భాలు చాలా తక్కువ. వ్యాపార రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ట్రంప్ దేశ అధ్యక్షుడైన సరంభంలో మార్కెట్లు మునిగిపోయాయి. షేర్‌పై ఆదాయం రెండంకెలకు వృద్ధి చెందుతూండడంతో, మార్కెట్లు చల్లారడం ఖాయమని ఊహించిందే.

ర్యాలీకి ఊతం ఇవ్వని భారతదేశ వృద్ధి

ఒక్కో షేర్ నుంచి లభించే ఆదాయంలో వృద్ధి నామమాత్రంగానే ఉన్నప్పటికీ, ఇండియాలో షేర్ల ధరలు పైపైకి ఎగబాకడం ప్రారంభించాయి. ఆదాయంకన్నా విలువ అధికమైనవిగా తయారయ్యాయి. లార్జ్-క్యాప్ నిఫ్టీ 50 సూచి ప్రస్తుతం 12 నెలల ప్రైస్ ఎర్నింగ్ స్థితి (23.8 రెట్ల గుణకంతో)కి వెనుకబడి ట్రేడవుతోంది. ఈ మూల్యాంకనం 2007 డిసెంబర్ పి.ఇ. (22.5) మల్టిపుల్ కన్నా ఎక్కువ. కానీ, లార్జ్ క్యాప్ విభాగంలో రాబడులు, లాభాలలో వృద్ధి ఇప్పటికీ రెండు సంఖ్యలలో ఉంది. సాపేక్షంగా చూస్తే మిగిలిన వాటికన్నా సురక్షిత స్థితిలో ఉంది.

ఈక్విటీ ధరలకు ముఖ్యమైన రిస్కు కొనసాగుతూనే ఉంది. రానున్న రోజుల్లో ఉండగల ఆదాయాల రికవరీని మించి కూడా వాటి ధరలు అధికంగా ఉన్నాయి. ప్రైవేటు మూలధన వ్యయం కొరవడడం, వస్తూత్పత్తి విభాగాల్లో ఉత్పాదక సామర్థ్యం తక్కువ స్థాయిలో వినియోగం కావడం, మొండి బాకీలతో కునారిల్లుతున్న బ్యాంకులు, విద్యుత్, స్థిరాస్తుల రంగాల్లో స్తంభించిన కార్యకలాపాలు, ఐ.టిలో వ్యవస్థాపరమైన సమస్యలు, ఫార్మా సంస్థలకు, నియంత్రణ సంస్థలకు మధ్య నడుస్తున్న వివాదాలు వివిధ కీలక రంగాలను పీడిస్తున్నాయి. అయితే, దీర్ఘకాలంలో భారతదేశ భవిష్యత్తు ఇప్పటికీ బాగానే ఉంది. ఇప్పుడు మార్కెట్లలో సర్దుబాటు చోటుచేసుకుంది కనుక బ్లూచిప్‌ల కొనుగోలుకు సిద్ధపడవచ్చు.

దూరవిద్యలో దగ్గరి దారులు



మార్కెట్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలు ఉన్నవారికే ఏ రంగంలోనైనా ఉపాధికి హామీ లభిస్తుంది. అందుకే సమకాలీన ప్రపంచంలో నైపుణ్య ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం! దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఇగ్నో (ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం) ఈ విషయంలో ముందంజలో ఉంది. 2018 జనవరి ప్రవేశాలకు ప్రకటన వెలువడిన సందర్భంగా ఇగ్నో, హైదరాబాద్ అందిస్తున్న నైపుణ్య కోర్సుల్లో ముఖ్యమైవి ఇవీ! సంప్రదాయ కోర్సులతో పాటు ఉద్యోగం, స్వయం ఉపాధి కల్పనలు ధ్యేయంగా ఇగ్నో సరికొత్త కోర్సులను అందిస్తోంది. దీనిలో భాగంగా .. దేశంలోని అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలను కుదు ర్చుకుని శిక్షణను కూడా అందిస్తోంది. ఉన్నత విద్యను పొందాలనుకునే నిరుద్యో గులు, చిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు, ఖైదీలు, ట్రాన్స్‌జెండర్స్.. ఇలా ఎవరైనా సరే వయసుతో సంబంధం లేకుండా ఈ కోర్సుల్లో చేరవచ్చు. ఇగ్నో తమ డిగ్రీ కోర్సులక్కూడా నైపుణ్యాధారిత పేపర్లను జోడిస్తోంది. వీటి ద్వా రా డిగ్రీ పూర్తయ్యేనాటికి విద్యార్థి వేరే అంశంలోనూ నిపుణుడై ఉండాలనేది ఉద్దేశం.

సైన్స్ ఇలా చదివేద్దాం!



సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ఏపీపీఎస్సీ సంయుక్త రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ సిలబస్‌కూ, ప్రస్తుతం నిర్వహించే పేపర్ సిలబస్‌కీ కొంత తేడా ఉంది. ప్రస్తుత పేపర్‌లో దాదాపు 20 శాతం సిలబస్ ఎక్కువ. ఇది మరింత విస్తృతంగా, లోతుగానే కాదుబీ స్పష్టంగా కూడా ఉందని చెప్పవచ్చు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో నాలుగో పేపర్ సైన్స్ అండ్ టెక్నాలజీ. దీన్ని మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఉపయోగపడేలా చదివితే అభ్యర్థులు ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. గతంలో సన్నద్ధత సాగించినవారు సిలబస్ అదనపు అంశాలను ప్రత్యేకంగా రాసుకుని, వాటిని మొదటగా చదవడం ప్రారంభించాలి. ఆపైన తాము ఇదివరకు చదివినవాటిని పునశ్చరణ చేయడం మంచిది. ఈ పేపర్ సిలబస్ 3 విభాగాలుగా ఉంటుంది. ప్రతి విభాగంలో 5 చొప్పున మొత్తం 15 యూనిట్లు. మొదటి విభాగంలో భారతదేశంలో టెక్నాలజీ అభివృద్ధి, టెక్నాలజీ పాలసీలు, టెక్నాలజీ మిషన్‌లు, అంతరిక్ష రంగం, శక్తి వనరులు, విపత్తు సంబంధ అంశాలున్నాయి.


ఫార్మా పీజీకి మార్గం



ఫార్మా రంగంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆశించే విద్యార్థుల ఆశాకిరణం జీప్యాట్. ఏఐసీటీఈ ఇటీవల ఈ ప్రవేశపరీక్ష ప్రకటనను వెలువరించింది. నాణ్యమైన పీజీ ఫార్మసిస్టుల అవసరం పరిశ్రమకు ఎంతగానో ఉంది. దీంతో బీఫార్మసీ చదివేవారిలో చాలామంది జీప్యాట్‌లో మంచి ర్యాంకుతో ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఎంఫార్మసీ/ ఎంఎస్ చదవాలని ఉవ్విళ్లూరుతుంటారు. గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీప్యాట్)లో మంచి ర్యాంకు సాధించినవారికి మాత్రమే దేశంలో పేరొందిన బనారస్, పంజాబ్, ఆంధ్రా, కాకతీయ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఎంఫార్మసీ చదవడానికి అవకాశం ఉంటుంది. అలాగే దేశంలోని ప్రముఖ నైపర్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్)ల్లో చేరాలంటే జీప్యాట్ అర్హత తప్పనిసరి.

మారాలి అధ్యయనం

యూపీఎస్సీ మార్గనిర్దేశకత్వంలో తెలుగు రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు గ్రూప్-1, 2 సిలబస్, పరీక్షా విధానా లను మారుస్తున్నాయి. వాటిపై పూర్తి స్పష్టత వచ్చేవరకూ అభ్యర్థులు సమయం వృథా చేయటం నష్టదాయకం. అందుకే ప్రతిపాదిత మార్పులను గమనిస్తూనే... ఈలోపు ఏ అంశాలు అధ్యయనం చేయాలో గ్రహించటం తప్పనిసరి. పరీక్షా విధానంలో మార్పులు వస్తున్నప్పుడు వాటిని శ్రద్ధగా గమనించి, ఆకళింపు చేసుకోవడం కార్యసాధకుల లక్షణం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని గ్రూప్స్ ఆశావహుల కర్తవ్యమిదే! రెండు పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ప్రతిపాదిస్తున్న మార్పుల లక్ష్యం- సిలబస్‌లో 'హేతుబద్ధత'ను పెంచడం. అలాగే సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఎక్కువమంది తెలుగువారు ఎంపికయ్యే అవకాశాలను కూడా మెరుగుపరచడం. రెండు రాష్ట్రాల పరీక్షా విధానంలో నిర్మాణపరంగా ఎటువంటి మార్పులూ లేవు. స్థానిక చరిత్ర, ప్రాంతీయ భౌగోళిక, ప్రాంతీయ ఆర్థిక అంశాల్లో మాత్రం భిన్నత్వం కనిపిస్తుంది. ఫలితంగా రెండు రాష్ట్రాల్లోనూ అభ్యర్థులు తమ అవకాశాలను పరీక్షించుకోవచ్చు. ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ... ఇలా పాతవిధానాన్నే ప్రతిపాదించారు. అయితే ప్రిలిమినరీ పరీక్షలో రెండు జనరల్ స్టడీస్ పేపర్లు తేవడం గమనార్హం. ఈ రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కులు.



ప్రతి పేపర్‌కు 2 గంటల పరీక్ష వ్యవధి ఉంటుంది. గత ప్రిలిమినరీలో ఉన్న సిలబస్ అంశాల కొనసాగింపే ఇది. కాకపోతే రెండు పేపర్లుగా విభజించడం వల్ల చదవాల్సిన నిడివీ, లోతూ బాగా పెరిగాయని చెప్పవచ్చు. అందువల్ల గత గ్రూప్-1కి తయారైన అభ్యర్థులు కొత్తగా 'భారం' పడిందని భావించాల్సిన అవసరం లేదు. అయితే ప్రతి విభాగం 50 మార్కుల ప్రాధాన్యాన్ని కలిగివుండే పరిస్థితి కనిపిస్తోంది. కాబట్టి, ఇప్పటినుంచే ఆరు విభాగాలు (మానసిక సామర్థ్యాలు, వర్తమానాంశాలు తప్ప) పాఠశాల పుస్తకాల ఆధారంగా చదివితే సరైన మార్గంలో తయారయ్యేందుకు అవకాశాలు పెరుగుతాయి. గత ప్రిలిమినరీ సిలబస్లో ఉన్న విపత్తు నిర్వహణను జాగ్రఫీలో భాగంగా చేశారు. 'పర్యావరణ' విభాగాన్ని శాస్త్ర సాంకేతికతతో కలిపారు. అందువల్ల సీనియర్ అభ్యర్థులు మరింత సమయం అందుబాటులోకి వచ్చిందని భావించి, సద్వినియోగం చేసుకోవాలి.

ఇంజినీరింగ్‌కి ఎన్ని దారులు?

ఇంజినీరింగ్ విద్యను అభ్యసించదల్చినవారి కోసం ఇంటర్ తర్వాత జాతీయ, రాష్ట్రస్థాయుల్లో వివిధ ప్రవేశపరీక్షలున్నాయి. అన్నిటినీ అందరూ రాయాల్సిన అవసరం లేదు. విద్యార్థులు తమ ప్రతిభకు అనుగుణమైన కొన్ని పరీక్షలను ఎంచుకుని, వాటిపైనే ద ష్టి కేంద్రీకరించటం మేలు. ఈ సందర్భంగా ఏ అంశాలు పరిశీలించాలి? ఎలా ముందుకు సాగాలి? ఇంటర్మీడియట్ పూర్తిచేయబోతున్న ఎంపీసీ విద్యార్థులు గత సంవత్సరాల్లాగే ఎక్కువ పరీక్షలు రాయాల్సిన అవసరం ఏర్పడుతోంది. బైపీసీ విద్యార్థులకు ఇప్పుడు 'నీట్' అనే ఒకే పరీక్షతో వారి అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవుతుంది. బాగా చదివే విద్యార్థులు ఇంకా అదనంగా ఎయిమ్స్, జిప్‌మర్ అనే రెండు పరీక్షలను మాత్రమే రాయాల్సి ఉంటుంది. కానీ ఎంపీసీ విద్యార్థులకు ఈ ఏడాది కూడా జాతీయస్థాయి ఉమ్మడి పరీక్ష లేదు. జేఈఈ-అడ్వాన్స్‌డ్, జేఈఈ-మెయిన్స్, బిట్‌శాట్, మహి, ఎంసెట్-ఏపీ, ఎంసెట్-టీఎస్, ఐఎస్ఐ, వీఐటీ, గీతం, ఎస్ఆర్ఎం, కేఎల్‌సీఈ, విజ్ఞాన్, నెస్ట్.. ఇలా కనీసం 20 వరకూ పరీక్షలున్నాయి. ప్రవేశపరీక్షలంటే దరఖాస్తు చేసుకోవటం, తయారవడం, పరీక్ష రాయడం.. ఇవన్నీ మామూలే కదా? అయితే ప్రతి విద్యార్థీ ఆలోచించుకోవాల్సిన అంశం- 45 రోజుల్లో 20 పరీక్షలను రాయడమంటే కనీసం 3 రోజులకోసారి పరీక్ష! వీటిలో పరీక్ష పరీక్షకూ వ్యత్యాసం ఉంది. వాటిని గమనించి వేటిలో రుణాత్మక మార్కులు ఉన్నాయో, వేటిలో లేవో ఏ పరీక్షకు ఎన్ని ప్రశ్నలు ఉంటాయో అర్థం చేసుకోవడానికి కనీసం కొంత సమయం అవసరమవుతుంది. అన్ని పరీక్షలకూ దరఖాస్తు చేసుకుని, రాయాలంటే ఎంతో శ్రమా, ఒత్తిడీ తప్పదు. అది అవసరం కూడా లేదు. ఆచరణీయ మార్గం ఏమిటంటే... తమ ప్రతిభను సరిగా అంచనా వేసుకుని దానికి అనుగుణంగా కొన్ని ప్రవేశపరీక్షలను ఎంచుకోవడం!



నేషనల్ పూల్‌లో తెలుగు రాష్ట్రాలు కలవడం వల్ల 'నీట్' ద్వారా తెలిగ్గా మెడికల్ సీట్లు వచ్చేస్తాయనీ, సన్నద్ధతకు అంతగా కష్టపడాల్సిన అవసరం లేదనీ.. ఇలాంటి అపోహలు వ్యాపిస్తున్నాయి. వీటిని విశ్వసించి, అశ్రద్ధ చూపితే విద్యార్థులకు నష్టదాయకమవుతుంది. జాతీయస్థాయి పోటీని తక్కువ అంచనా వేయకూడదు. ప్రతిభాస్థాయిని పెంచుకోవాల్సిందే. మారిన పరిస్థితుల్లో మెడికల్ సీటు సాధించటానికి ఏ దిశలో 'నీట్'కు ఎలా రెడీ అవ్వాలో తెలుసుకుందాం...



'నీట్' సీటు!

మెడికల్ లేదా డెంటల్ కళాశాలల్లో సీటు సాధించాలనుకునే విద్యార్థులకు ఇప్పుడు మూడే పరీక్షలు మిగిలాయి. అవి నీట్-యూజీ, ఎయిమ్స్, జిప్‌మర్. వీటిలో అధిక సంఖ్యలో లేదా 98 శాతం వరకు విద్యార్థులు నీట్ రాయాలని కోరుకునేవారే ఉంటున్నారు. గత సంవత్సరం నీట్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జరిగినప్పటికీ 371 9(డి) ఆర్టికల్ ఉండటం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు యూనివర్సిటీల (ఉస్మానియా, ఆంధ్ర, శ్రీవేంకటశ్వర) ప్రాతిపదికనే అడ్మిషన్లు జరిగాయి. అయితే ఈ సంవత్సరం 371 డి నుంచి మినహాయింపు కోరడం వల్ల విద్యార్థుల్లో లాభమని కొందరూ, నష్టమని కొందరూ విశ్లేషణలు చేస్తున్నారు. దీనికంటే విద్యార్థులు తయారీ విధానం పటిష్టం చేసుకోవటం లాభదాయకం.





మనం నేషనల్ పూల్‌లో కొన్ని సీట్లు ఇవ్వడం వల్ల తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థుల సీట్లు కొన్ని తగ్గవచ్చు. గవర్నమెంట్ కళాశాలల్లోని సీట్లలో మాత్రమే 15% ఇస్తే 450 సీట్లు (1900-1100), కేటగిరి-ఎ సీట్లు కూడా ఇవ్వాల్సి వస్తే దాదాపు 750 నుంచి 800 వరకు సీట్లు నేషనల్ పూల్‌కి ఇవ్వాలి.

దేశంలో మొత్తం 458 మెడికల్ కళాశాలలు ఉంటే వాటిలో 201 మాత్రమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు. వాటిలో సీట్లు 27880. వాటిలో 15 శాతం సీట్లు అంటే 4182 సీట్లు నేషనల్ పూల్‌లో ఉంటాయి. 2017లో తెలుగు విద్యార్థులు మొదట లక్ష ర్యాంకుల్లో 10 శాతం లోపు మాత్రమే ఉన్నారు. అది కూడా మొదటి 50,000 ర్యాంకులలో కొద్దిగా ఎక్కువ శాతం, లక్షలోపు ర్యాంకుల్లో తక్కువ శాతం ఉన్నారు. దానివల్ల నేషనల్ పూల్‌లో మనం సాధించుకోగల్గిన సీట్ల శాతం 8కి మించదు. 4182 సీట్లలో 8 శాతం అంటే సుమారుగా 335. వీటిలో జమ్ము-కశ్మీర్, అసోం, సిక్కిం లాంటి ఈశాన్య రాష్ట్రాల్లో చేరేవారు ఉండకపోవచ్చు. ఆ సంఖ్య తీసివేస్తే 250 నుంచి 300 లోపు సీట్లు వచ్చినా కచ్చితంగా అధికసంఖ్యలో సీట్లు తగ్గిపోతాయి.

అయితే ఇది తొలి సంవత్సరం కాబట్టి విద్యార్థుల అవగాహన తక్కువ ఉండటం వల్ల సక్సెస్ రేటు తగ్గిందని చెప్పవచ్చు. రాబోయే కాలంలో జాతీయ స్థాయిలోని లక్షలోపు ర్యాంకుల్లో 15,000 పైన తెలుగు విద్యార్థులు సాధించుకోగల్గితే సీట్ల సంఖ్య పరంగా లాభనష్టాలు ఉండవు. అయితే ఈ విధానం వల్ల విద్యార్థులు వివిధ రాష్ట్రాలలోని ఉత్తమ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించిన వారవుతారు. అదేవిధంగా 50,000 లోపు జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థులు వెలుపలి రాష్ట్రాల్లో మంచి కళాశాలల్లో సీటు సాధించుకునే అవకాశం పెరుగుతుంది.

బయాలజీలో అదనం

బయాలజీలో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలోని వాక్యాలకు మాత్రమే పరిమితమైతే 90 ప్రశ్నల్లో 75 ప్రశ్నల వరకు సమాధానాలు గుర్తించవచ్చు. మిగిలిన 15 ప్రశ్నలు కూడా బాగా రాయాలంటే అదనంగా కొంత చదవడం, పరీక్షల రూపంలో కొత్త ప్రశ్నలకు జవాబు గుర్తించడం అభ్యాసం చేసుకోవాలి.

బయాలజీలో 12 వ తరగతిలోని జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్, ఎకాలజీబీ 11వ తరగతిలోని ప్లాంట్ ఫిజియాలజీ, హ్యూమన్ ఫిజియాలజీలకు ప్రాధాన్యం ఇచ్చి పునశ్చరణ చేసుకోవాలి. వీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చి చదివిన విద్యార్థి అదనంగా 20 మార్కులు సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది.

కెమిస్ట్రీలో గరిష్ఠంగా..

రసాయన శాస్త్రంలో కూడా ద్వితీయ సంవత్సర సిలబస్‌కే ప్రాధాన్యం బాగా ఎక్కువ. దీనిలో విద్యార్థులు లెక్కలు ఎక్కువగా ఉంటున్నాయనే అపోహతో ఉంటున్నారు. మొత్తం 45 ప్రశ్నల్లో 35 నుంచి 40 ప్రశ్నల వరకు సిద్ధాంతపరమైన ప్రశ్నలు మాత్రమే ఉంటున్నాయి. కర్బన, అకర్బన, భౌతిక రసాయన శాస్త్రాల్లో కూడా ప్రశ్నలు దాదాపు సమ విభజనతో అంటే ఒక్కో విభాగం నుంచి 15 ప్రశ్నల వరకు వస్తున్నాయి.

అకర్బన రసాయన శాస్త్రంలో గుర్తుంచుకునే ప్రశ్నలే అధికం. వాటిలో పీ, డీ, ఎఫ్ బ్లాక్ మూలకాల్లో వస్తున్నాయి. కో ఆర్డినేషన్ కాంపౌండ్స్‌లోని ప్రశ్నలను కూడా కొంత విశ్లేషించి అర్థం చేసుకోవడం మేలు. కర్బన రసాయన శాస్త్రంలో నేమ్‌డ్ రియాక్షన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చి వాటిని ఒకే దగ్గర విద్యార్థి నోట్ తయారుచేసుకోగల్గితే తుది పరీక్షల్లో బాగా ఉపయోగపడతాయి.


మెకానిజంలో రియాక్షన్స్, ప్రొడక్ట్స్ గురించే కాకుండా కెటలిస్ట్ రోల్, ఇంటర్మీడియట్ కాంపౌండ్స్ ఏమి తయారవుతాయి అనేదానిపై విశ్లేషణ అవసరం. భౌతిక రసాయన శాస్త్రంలో ఇచ్చే ప్రాబ్లమ్స్‌లో కూడా సింపుల్ అప్లికేషన్స్ మాత్రమే ఉంటున్నాయి. దీనిలో సాలిడ్ స్టేట్, సొల్యూషన్స్‌పై కొంత ఎక్కువ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రసాయనశాస్త్రం విశ్లేషణతో తయారైన విద్యార్థి సులభంగా 180 మార్కులకు 160 మార్కుల వరకూ సాధించుకునే అవకాశం ఉంటుంది.

పోటీ పరీక్షల పరంగా ఇంటర్మీడియట్ మార్కులకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. ఈ జనవరి, ఫిబ్రవరి నెలలు విద్యార్థి ద్వితీయ ఇంటర్‌తోపాటు ఆ సిలబస్‌లోనే పోటీ పరీక్షలకు కూడా తయారు కాగలిగితే మంచిది. మార్చి 14వ తేదీకి ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి కాబట్టి తర్వాత ప్రథమ సంవత్సర సిలబస్ పునశ్చరణ చేసుకొని నమూనా పరీక్షలు రాయవచ్చు. అవి కనీసం 10 నుంచి 12 వరకు రాయగల్గితే నీట్‌లో మెరుగైన ర్యాంకు దిశలో ముందుకు సాగుతున్నట్టే అవుతుంది!

ఇది ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో కేటగిరీ-ఎ సీట్ల కటాఫ్ కాబట్టి విద్యార్థి ఈ మార్కుకి కనీసం 20 మార్కులు పెంచుకోవడం అంటే ఇప్పుడు ఓసీ విద్యార్థులకు 720 మార్కులకు జరిగే ఈ పరీక్షలో కనీసం 540 మార్కులపైన సాధించుకోవాలి. ఇప్పటినుంచి సూక్ష్మరీతిలో ప్రణాళిక వేసుకొని, ఆచరించే విద్యార్థికి మాత్రమే విజయం చేకూరే అవకాశం ఉంది.


ఫిజిక్స్‌లో నూరుశాతం

ఈ సబ్జెక్టులో ద్వితీయ సంవత్సరపు పుస్తకం నుంచే అధిక ప్రశ్నలుంటాయి. ప్రాధాన్యతా క్రమం కూడా అలాగే ఉండాలి. ద్వితీయ సంవత్సరపు సిలబస్‌లోని ఎలక్ట్రిసిటీ, ఆధునిక భౌతికశాస్త్రం (మోడర్న్ ఫిజిక్స్) బాగా చేయగల్గితే దాదాపు 50 శాతం ప్రశ్నలకు జవాబులు రాయవచ్చు. మోడర్న్ ఫిజిక్స్ చదవటం వల్ల అది కెమిస్ట్రీకి కూడా బాగా ఉపయోగం. దానిలోని ఆటమ్, న్యూక్లియై పాఠ్యాంశాలు ఫిజిక్స్, కెమిస్ట్రీ.. దేనికైనా సరిపోతాయి.



తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించుకునే అవకాశమూ ఏర్పడుతుంది. భౌతిక శాస్త్రంలో విద్యార్థి కొంత ఇబ్బంది అని చెప్పేది ప్రథమ సంవత్సర సిలబస్‌లోని యాంత్రిక శాస్త్రం (మెకానిక్స్). అయితే వాటిలో ఫార్ములాలు కంఠస్థం చేయడం కాకుండా, విశ్లేషణతో విషయాన్ని అర్థం చేసుకోగల్గితే మిగిలిన వాటికంటే మెకానిక్స్‌లోనే ఎక్కువ మార్కులు సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫిజిక్స్‌లో ఇచ్చే 45 ప్రశ్నల్లో సాధారణ విద్యార్థి కూడా 35 ప్రశ్నలకు పైగా జవాబులు గుర్తించే విధంగానే ప్రశ్నపత్రాలు ఉంటున్నాయి. కనీసం 180 మార్కులకు జరిగే ఫిజిక్స్ తుది పరీక్షలో కనీసం 120 - 140 మార్కుల వరకు సాధించుకునే దిశలోనే విద్యార్థి అభ్యాసం చేయాలి. అవగాహనతో, విశ్లేషణతో తయారయ్యే ఏ విద్యార్థి అయినా భౌతిక శాస్త్రంలో నూరు శాతం మార్కులు అంటే 180కి 180 మార్కులు సాధించాలి.





పోటీ బాగా పెరుగుతుంది

సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది కాబట్టి పోటీ ఇంకా బాగా పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థి గత సంవత్సరపు కటాఫ్ మార్కు కంటే ప్రతి కేటగిరీలోనూ 20 మార్కుల వరకు పెంచుకోవడానికి ప్రణాళిక తయారుచేసుకోవాలి. నీట్ పీజీ ప్రవేశాలకు ఇతర రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య ఎక్కువ. ఇంకా నేషనల్ పూల్‌కి 50 శాతం సీట్లు కేటాయింపు ఇవ్వాలి కాబట్టి తెలుగు రాష్ట్రాల విద్యార్థులు బాగా లాభపడతారు.

సారాంశం ముఖ్యం

తెలుగు విద్యార్థులు ఇంతవరకు ఎంసెట్ టీచింగ్ విధానంలోనే కొనసాగుతున్నారు కాబట్టి పాఠ్యపుస్తకంలోని ప్రతి వాక్యాన్నీ వీలైనన్ని ఎక్కువసార్లు చదవాలనే అపోహతోనే ఉంటున్నారు. కానీ విద్యార్థులు వాక్యంలోని పదాలు అలాగే నేర్చుకోవాలనే విధానాన్ని వదిలిపెట్టి ఆ పేజీలోని సారాంశం ఏంటి అనేది సంపూర్ణంగా గ్రహించాలి. దాన్ని ప్రశ్నల రూపంలో తయారుచేసుకొని అభ్యాసం చేసినప్పుడే కావాల్సిన మార్కులు సాధించుకోవచ్చు. తయారీ విధానంలో ఇప్పటివరకు భౌతిక శాస్త్రానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులు చదువుతున్నారు. దాంతోపాటు బయాలజీ, కెమిస్ట్రీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. సీటు సాధించాలంటే 720 మార్కులకు 540 మార్కుల వరకు సాధించాలి.



సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా 3-0 ఆధిక్యాన్ని సంపాదించడంపై కోహ్లీ సేన దృష్టి పెట్టింది. ఆరు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 2-0తో నిలిచిన సంగతి తెలిసిందే.

హ్యాట్రిక్‌పై టీమిండియా దృష్టి

నేడు సౌతాఫ్రికాతో మూడో వన్డే

కేప్‌టౌన్: ఇండియా, సౌతాఫ్రికా మధ్య బుధవారం మూడో వన్డే జరగనుంది. డర్బన్, సెంచూరియన్‌లలో జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా ఆరు, తొమ్మిది వికెట్లతో గెలిచింది. గతంలో అంటే 1992-93, 2010-11 ద్వైపాక్షిక సిరీస్‌ల్లో టీమిండియా రెండు వన్డేల్లో గెలిచింది. తర్వాత 2-1 ఆధిక్యాన్ని సంపాదించినప్పటికీ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-3తో ఓటమిపాలైంది. మరోసారి 2-5తో కోల్పోయింది. కానీ ఈసారి మాత్రం మెన్ ఇన్ బ్లూ చరిత్ర సృష్టించే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు గాయాల బెడదతో సతమతమవుతోంది. వన్డే సిరీస్‌కు ముందే ఏబీ డివిలియర్స్ దూరమయ్యాడు. రెండో వన్డేకు ముందు ఫాఫ్ డు ప్లెసిస్ దూరమయ్యాడు. వీరిద్దరూ వేలి గాయాలకు గురయ్యారు. ఇప్పుడు మూడో వన్డేకు ముందు క్వింటన్ డికాక్ ఎడమ చేతి మణికట్టు గాయంతో దూరమయ్యాడు. ఇప్పటి వరకు డికాక్‌కు ప్రత్యామ్నాయాన్ని సౌతాఫ్రికా బోర్డు ప్రకటించలేదు. కానీ దేశవాళీ వన్డే టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన హీన్రిచ్ క్లాసెన్‌ను జట్టులోకి తీసుకునే అవకాశముంది. టీమిండియాతో టెస్టులు, వన్డేలు కలిపి ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో డికాక్ 50కిపైగా పరుగులు చేయలేకపోయాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న క్లాసెన్ హాషీం ఆమ్లాతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశముంది. అయితే ఇప్పటి వరకు మణికట్టు స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్‌ల మాయాజాలం గురించి క్లాసెన్‌కు తెలీదు. తొలి రెండు వన్డేల్లో డికాక్, ఆమ్లా 30, 39 పరుగులు చేశారు. కానీ డు ప్లెసిస్ ఒక్కడే స్పిన్నర్లు సమర్థవంతంగా ఎదుర్కొని సెంచరీ సాధించాడు. అయితే తాత్కాలిక కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ తనకు తానుగా పదోన్నతి కల్పించుకున్నాడని కొంత మంది అభిప్రాయంతో ఉన్నారు. తొలి వన్డేల్లో నాలుగో స్థానంలో (21 బంతుల్లో 9), రెండో వన్డేలో మూడో స్థానంలో (11 బంతుల్లో 8 పరుగులు) మార్‌క్రమ్ బరిలోకి దిగాడు. అయితే ఖయలిహ్లే జొండోకు బదులుగా అనుభవజ్ఞుడైన ఫర్హాన్ బెహార్డీన్‌ను మిడిలార్డర్‌లో దింపాలని సౌతాఫ్రికా యోచిస్తోంది. రెండో వన్డేలో జొండో 45 బంతుల్లో 25 పరుగులు చేశాడు. క్లిష్ట పరిస్థితుల్లో జట్టును ఆదుకునేందుకు జొండో ఎన్నో రిస్కీ షాట్స్ ఆడాడు. జేపీ డుమినీతో కలిసి సంయుక్త టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయినప్పటికీ సౌతాఫ్రికా 32.2 ఓవర్లలో 118 పరుగులకు కుప్పకూలింది. మరో ఆటగాడు డేవిడ్ మిల్లర్‌ను కూడా ఈ మూడో వన్డేకు పక్కన పెట్టే అవకాశముంది. ఎందుకంటే ఇతను కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌ను ఆడేందుకు చాలా ఇబ్బంది పడ్డాడు. ఒకవేళ మిల్లర్‌ను పక్కన పెట్టే పరిస్థితి వస్తే బెహార్డీన్‌తో పాటు జొండోకు మళ్లీ జట్టులో చోటు దక్కే అవకాశముంది. ఏది ఏమైనా మణికట్టు స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు సౌతాఫ్రికా జట్టులో మార్పులు జరగనున్నాయి. మరోవైపు డివిలియర్స్, ప్లెసిస్ దూరం కావడంతో బ్యాటింగ్‌లోనూ సత్తా చాటేందుకు సౌతాఫ్రికా పక్కా ప్లాన్ చేసుకుంటోంది. రెండో వన్డేలో ఇమ్రాన్ తాహిర్, తబ్రైజ్ షమ్సీలను తీసుకుని మార్‌క్రమ్ మోసపోయాడు. గాయంతో ప్లెసిస్ ఇంకా డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం కావడంతో పిచ్ కండిషన్ ప్రకారం సౌతాఫ్రికా భారీ మార్పులు చేయనుంది. అయితే మూడో వన్డేకు ఎటువంటి పిచ్‌ను తయారు చేస్తారో చూడాలి.

సాయంత్రం 4-30 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



మరోవైపు టీమిండియా టెస్టు సిరీస్‌కు భిన్నంగా వన్డే సిరీస్‌ను ఎంజాయ్ చేస్తోంది. ప్రస్తుతం 2-0 ఆధిక్యంతో ఉంది. వచ్చే ఏడాది వరల్డ్ కప్‌కు సరైన జట్టు ఎంపిక నేపథ్యంలో ఈ సిరీస్‌కు ముందు అనేక ప్రయోగాలు జరిగాయి. కానీ ప్రస్తుతం అటువంటి మార్పులు జరగకపోవచ్చు. 35 టెస్టుల్లో 35సార్లు జట్టులో మార్పులు చేసిన విరాట్ కోహ్లీ మూడో వన్డేకు రెండో వన్డే జట్టునే బరిలోకి దింపే అవకాశముంది. ఇప్పటి వరకు ద్వైపాక్షిక సిరీస్‌ల్లో మూడు మ్యాచ్‌లు గెలవని టీమిండియా చారిత్రాత్మక మూడో విజయంపై దృష్టి పెట్టింది. వరుస విజయాలు సాధిస్తున్న కోహ్లీ సేన రెట్టించిన ఆత్మ విశ్వాసంతో ఉంది. కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ పిచ్ విషయానికొస్తే.. ఇది టీమిండియాకు మూడో విజయం అవుతుంది. ఎందుకంటే 1992 నుంచి టీమిండియా ఈ మైదానంలో నాలుగు వన్డేలు ఆడింది. రెండింటిలో గెలిచి రెండింటిలో ఓడింది. 2010-11 తర్వాత ఈ మైదానంలో సౌతాఫ్రికా ఆడిన మూడు వన్డేలకు గాను రెండింటిలో ఓడి ఒక మ్యాచ్‌లో గెలిచింది. ఈ లెక్కలన్నింటికీ సరిచేయాలని, ఆధిక్యాన్ని పెంచుకోవాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు సెంచూరియన్‌లో వన్డే గెలిచిన తర్వాత కోహ్లీ సేన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ ర్యాంక్‌ను సాధించింది. కానీ కేప్‌టౌన్‌లో గెలిస్తే మరింత స్పష్టమైన అంతరంతో నిలుస్తుంది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలిస్తే మళీ 2వ ర్యాంక్‌కు టీమిండియా వెళుతుంది. ర్యాంక్‌లను తామెప్పుడూ పట్టించుకోమని టీమిండియా మేనేజ్‌మెంట్ చెబుతుంది. కానీ ఇటువంటి అవకాశాన్ని చేజార్చుకునేందుకు కోహ్లీ సేన సిద్ధంగా లేదు.





భారత్‌కు సునాయాస డ్రా

- కామన్వెల్త్ గేమ్స్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్

GOLD COAST 2018
XXI COMMONWEALTH GAMES

న్యూఢిల్లీ: బలమైన భారత జట్టుకు కామన్వెల్త్ గేమ్స్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సునాయాస డ్రా లభించింది. ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో కామన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. ఈ పోటీల్లో గ్రూప్-ఎలో ఇండియాతో పాటు అంతగా అనుభవం లేని పాకిస్థాన్, స్కాట్లాండ్, శ్రీలంక జట్లు ఉన్నాయి. దీంతో భారత జట్టు సునాయాసంగా నాకౌట్‌కు చేరుకునే అవకాశముంది. మొత్తం 16 దేశాల జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. తొలి రెండ్రోజులు జరిగే పోటీల్లో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఆడుతుంది. ఇండియాతో పాటు పతకాలకు పోటీ పడుతున్న మలేసియా జట్టు గ్రూప్-డిలో ఉంది. ఈ గ్రూప్‌లో కెనెడా, సీషెల్స్, ఘనా జట్లు ఉన్నాయి. గ్రూప్-సిలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఉగాండా, గ్రూప్-బిలో సింగపూర్, మారిషస్, జాంబియా, జమైకా ఉన్నాయి. ప్రతి పోరులో ఐదు మ్యాచ్‌లుంటాయి. పురుషులు, మహిళల సింగిల్స్, పురుషులు, మహిళలు, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంటాయి. గ్రూప్ దశ చివరి మ్యాచ్ ముగియగానే నాకౌట్ దశ డ్రాను సిద్ధం చేస్తారు. తొలుత మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌ను నిర్వహిస్తారు. ఈ పోటీలు ఏప్రిల్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయి. ఫైనల్స్ 9వ తేదీన జరుగుతాయి. తర్వాత ఆరు రోజుల పాటు సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు ఉంటాయి. 14, 15 తేదీల్లో ఫైనల్స్ జరుగుతాయి.

PyeongChang 2018

వింటర్ ఒలింపిక్స్‌లో వైరస్ కలకలం

- 1200 మంది గార్డ్స్‌కు సోకినట్టు నిర్వాహకుల వెల్లడి

పియాంగ్‌చాంగ్ (సౌత్ కొరియా): పియాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్ నుంచి 1200 మంది సెక్యూరిటీ గార్డ్స్ తమ విధులను ఉపసంహరించుకున్నారు. ఇక్కడ నొరొవైరస్ విస్తరించిందని నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. మొత్తం భద్రతా సిబ్బందిలో 41 మంది ఆదివారం వాంతులు, డయేరియాకు గురయ్యారు. వీళ్లను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వీరంతా నొరొవైరస్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్టు డాక్టర్లు వెల్లడించారు. నొరొవేరస్ అనేది తీవ్రమైన అంటువ్యాధి. ఇది భోజనం, నీళ్ల ద్వారా విస్తరిస్తుంది. '1200 మంది భద్రతా సిబ్బందిని తమ విధుల నుంచి విముక్తి కలిగించాం. వారి స్థానంలో 900 మంది మిలిటరీ సైనికులను నియమించాం' అని పియాంగ్‌చాంగ్ ఒలింపిక్ నిర్వాహక కమిటీ అధికారి ఒకరు చెప్పారు. అయితే ఈ వైరస్ మూలాలను కనుగొనేందుకు ఆరోగ్య సిబ్బంది ప్రయత్నిస్తున్నారని ఆ అధికారి పేర్కొన్నారు. సెక్యూరిటీ కంపెనీకి చెందిన గార్డ్స్‌కు అథ్లెటిక్స్ విలేజ్‌కు దూరంగా ఉన్న యూత్ ట్రెయినింగ్ సెంటర్‌లో బస ఏర్పాటు చేశారు.

భవిష్యత్తులో మహిళల 'ఖేలో ఇండియా'

- క్రీడల మంత్రి రాథోడ్ ప్రకటన

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక 'ఖేలో ఇండియా'ను మరింత విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. భవిష్యత్తులో మహిళలకు ప్రత్యేక చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తామని కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ (కేఐఎస్‌జీ) సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రాథోడ్ మాట్లాడారు. ప్రస్తుత 16 క్రీడాంశాలను వచ్చే ఏడాది మరింత పెంచుతామన్నారు. 'మహిళా క్రీడాకారులను కూడా ప్రోత్సహిస్తాం. ఇందుకోసం ఖేలో ఇండియాలో మహిళలకు ప్రత్యేక చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తాం. ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌లో ప్రస్తుతం 16 అంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది వీటి సంఖ్యను పెంచుతాం. ఔత్సాహికుల సంఖ్యను పెంచకపోతే మనకు పతకాలు రావు. ఏ స్కూల్ చిన్నారైనా ఖేలో ఇండియా గేమ్స్‌లో పాల్గొనొచ్చు. హీరో కావచ్చు' అని రాథోడ్ అన్నారు. ప్రస్తుత పోటీల ప్రమాణాలపై క్రీడా మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ముమ్ముందు మరింత మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'అమెరికా కాలేజ్ గేమ్స్‌ను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నాం. భవిష్యత్తులో ప్రతి ఖేలో ఇండియా గేమ్స్ అనుసరించేలా ప్రమాణాలను ఏర్పాటు చేసినందుకు గర్విస్తున్నాం. మేము ఊహించిన దానికంటే ఉన్నత ప్రమాణాలు ఉన్నందుకు సంతోషంగా ఉంది' అని రాథోడ్ చెప్పారు.

ICC UNDER19 CRICKET WORLD CUP NEW ZEALAND 2018

అండర్-19 విజేత జట్టుకు
5 లక్షల ట్వీట్స్
ట్విట్టర్ చరిత్రలోనే రికార్డు

ముంబై: ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ట్విట్టర్ రికార్డు సృష్టించింది. వరల్డ్ కప్ గెలిచిన పృథ్వీ సేనకు 5 లక్షల ట్వీట్స్ వచ్చినట్టు ట్విట్టర్ ప్రకటించింది. మొన్న శనివారం జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాను పృథ్వీ సేన చిత్తు చేసి ట్రోఫీని సొంతం చేసుకోవడంతో ఈ ట్వీట్ల వరద మొదలైంది. భారత్‌కు ఇది నాలుగో అండర్-19 వరల్డ్ కప్ టైటిల్. ఇంతకుముందు మహ్మద్ కైఫ్ (2000), విరాట్ కోహ్లీ (2008), ఉన్ముక్త్ చంద్ (2012) కెప్టెన్సీలో భారత్ వరల్డ్ కప్ ట్రోఫీని గెలిచింది. ఈ సందర్భంగా లక్షలాది మెసేజ్‌లు రికార్డయ్యాయి. ట్విట్టర్ క్రీడా విభాగంలో ఇంతలా మెసేజ్‌లు రావడం ఇదే తొలిసారి అని ట్విట్టర్ ఆసియా పసిఫిక్ స్పోర్ట్స్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ అనీష్ మదాని అన్నారు.

అందరి దృష్టి అంకిత, కర్మన్‌పైనే

నేటి నుంచి కజకిస్థాన్‌తో ఫెడ్ కప్ టెన్నిస్

న్యూఢిల్లీ: ఫెడ్ కప్ వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్‌కు భారత్‌ను తీసుకెళ్లడం అకింత రైనా, కర్మన్ కౌర్ థండిలకు కష్టసాధ్యమే. కానీ స్ఫూర్తిదాయక ఈ యువతులు ప్రత్యర్థి కజకిస్థాన్‌ను ఓడిస్తారని అందరూ ఎదురు చూస్తున్నారు. ఫెడ్ కప్‌లో భాగంగా ఆసియా/ఓసియేనియా గ్రూప్-1 పోటీలు బుధవారమిక్కడ ప్రారంభం కానున్నాయి. 1991 నుంచి భారత్ ఫెడ్ కప్ వరల్డ్ గ్రూప్‌కు అర్హత సాధించలేదు. ఇప్పుడు కజకిస్థాన్‌లో టాప్-60 ర్యాంక్ ప్లేయర్స్ ఉన్నారు. పూల్-ఎలోనే చైనా కూడా ఉండడం భారత్‌కు మరింత కష్టతరం కానుంది. గతేడాది సీజన్‌లో అంకిత, కర్మన్ ఐటీఎఫ్ సర్క్యూట్‌లో స్థిరంగా రాణించారు. లువాన్‌లో జరిగిన 60వేల యూఎస్ డాలర్ల ఈవెంట్‌లో అకింత సింగిల్స్‌లో ఫైనల్ వరకు ఆడింది. ఫెడ్ కప్‌లో అంకిత ప్రపంచ 120వ ర్యాంక్ ప్లేయర్ లిన్ ఝుతో తొలి మ్యాచ్ ఆడుతుంది. మరోవైపు ఢిల్లీ ప్లేయర్ కర్మన్ కూడా గత సీజన్‌లో సత్తా చాటింది. 25 వేల యూఎస్ డాలర్ల స్థాయి ఈవెంట్‌లో ఓసారి సెమీఫైనల్‌కు చేరడంతో పాటు 2సార్లు ఫైనల్ వరకు ఆడింది. ఫెడ్ కప్‌లో కర్మన్ ప్రపంచ 125వ ర్యాంక్ ప్లేయర్ వాంగ్ యఫన్‌తో తొలి మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్-ఎలో భారత్, కజకిస్థాన్, హాంకాంగ్, చైనా జట్లు ఉండగా గ్రూప్-బిలో జపాన్, చైనీస్ తైపీ, థాయ్‌లాండ్, కొరియా తలపడనున్నాయి.

అసమానతపై ద్రవిడ్ అసంతృప్తి



న్యూఢిల్లీ: అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా బీసీసీఐ ప్రకటించిన నగదు పురస్కారాలపై కోచ్ రాహుల్ ద్రవిడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాహుల్ ద్రవిడ్ శిక్షణలోని భారత యువ సేన ఎంతో కష్టపడి ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ ట్రోఫీని గెలిచింది. ఈ సందర్భంగా బీసీసీఐ నగదు పురస్కారాలను ప్రకటించింది. ద్రవిడ్‌కు రూ. 50 లక్షలు, యువ జట్టులోని ఒక్కో క్రికెటర్‌కు రూ. 30 లక్షలు, సపోర్ట్ స్టాఫ్ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు ఇవ్వనున్నట్టు పేర్కొంది. అయితే కోచింగ్ స్టాఫ్‌లోని ఇతర సభ్యుల కంటే తనకు ఎక్కువ నగదును ప్రకటించడంపై ద్రవిడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. న్యూజిలాండ్‌లో జరిగిన ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ ట్రోఫీని గెలవడంలో అందరం సమానంగా శ్రమించామని ద్రవిడ్ చెప్పినట్టు ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రిక పేర్కొంది. అయితే దీనిపై బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు స్పందించారు. భారత్‌లో గురు-శిష్యుల పరంపర ఉందని.. గురువుకు ఎల్లప్పుడు ఎక్కువ పారితోషికం లభిస్తుందని ఆయన చెప్పారు. ఆ క్రమంలో కోచ్‌కు సహజంగానే ఎక్కువ నగదును ప్రకటించామన్నారు. కానీ ప్లేయర్స్ కంటే తక్కువ నగదు బహుమతిని సపోర్ట్ స్టాఫ్‌కు ప్రకటించడాన్ని ద్రవిడ్ అంగీకరించడం లేదు.



భారత్‌ను గెలిపించిన సింధు

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

అలోర్ సెటర్ (మలేసియా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారమిక్కడ జరిగిన తొలి పోరులో ఒలింపిక్ రజత పతక విజేత పీవీ సింధు నేతృత్వంలోని భారత జట్టు 3-2తో హాంకాంగ్‌ను ఓడించింది. గాయం కారణంగా ఈ టోర్నీకి సైనా నెహ్వాల్ దూరం కావడంతో భారమంతా సింధుపై పడింది. తొలి సింగిల్స్‌లో గెలిచిన సింధు తర్వాత డబుల్స్‌లో ఎన్. సిక్కి రెడ్డితో కలిసి జట్టుకు విజయాన్ని కట్టబెట్టింది. ఇండియా ఓపెన్ ఫైనల్స్ ఓటమి నుంచి త్వరగా కోలుకున్న సింధు తొలి సింగిల్స్‌లో 21-12, 21-18తో హాంకాంగ్‌కు చెందిన యిప్ పుయ్ యిన్‌ను ఓడించింది. తర్వాత జరిగిన మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, ప్రజక్తా సావంత్ జంట 22-20, 20-22, 10-21తో ఎంగ్ వింగ్ యంగ్, యియంగ్ ఎంగా టింగ్ జోడీ చేతిలో పోరాడి ఓడింది. తర్వాత జరిగిన మరో మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్ శ్రీకృష్ణ ప్రియ కుదారవల్లి 1-21, 21-18, 20-22తో చెంగ్ యింగ్ మీ చేతిలో పరాజయం పాలైంది. దీంతో భారత్ 1-2తో వెనకబడింది. తర్వాత జరిగిన మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డితో జతకట్టిన సింధు 21-15, 15-21, 21-14తో ఎన్గ్ యు, యెన్ సిన్ యింగ్ ద్వయంపై గెలిచి స్కోరును 2-2తో సమం చేసింది. తర్వాత జరిగిన మరో సింగిల్స్‌లో రుత్వికా శివాని గద్దె 16-21, 21-16, 21-13తో యెంగ్ సమ్ యీపై గెలిచి భారత్‌కు కీలకమైన విజయాన్ని అందించింది. ఉబెర్ కప్ ఫైనల్‌కు ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టోర్నీగా నిలిచింది. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరిన జట్టు ఉబెర్ కప్‌కు అర్హత సాధిస్తుంది. మేలో బ్యాంకాక్‌లో ఉబెర్ కప్ టోర్నీ జరుగుతుంది. గురువారం భారత బలమైన జపాన్‌తో తలపడుతుంది. ఈ జట్టులో ప్రపంచ 2వ ర్యాంక్ షట్లర్ అకానె యమగుచి, ప్రపంచ చాంపియన్ నొజొమి ఒకుహర ఉన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.